ఆదివారం వార్త అనుబంధం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-12-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 330 పేజీలు: 8+16 వెల: 6.50

## బంగ్లా తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత




## 'వైకుంఠ' దర్శనాలకు పోటెత్తిన భక్తులు

### ఆధ్యాత్మిక శోభతో తెలుగునాట ఆలయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు30:** వైకుంఠ ఏకాదశి రోజున, విష్ణువు ఆధ్యాత్మిక నివాసమైన వైకుంఠ ద్వారాలు ఆయన భక్తుల కోసం తెరుచుకుంటాయి. ఇది దక్షిణ భారతదేశంలోని ఒక ప్రధాన పండుగ, >>2



# ఇక కాలుష్య ప్రక్షాళన



### హైదరాబాద్‌లో నెలకు మూడు రోజులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

### ప్రతి పది రోజులకు గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్

### రోడ్లపై చెత్త, గుంతలు కనిపించకూడదు..

### ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు

### వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

### కొత్త కమిషనర్లకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. డిసెంబరు30:** హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. తెలంగాన రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటీవల గ్లోబల్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి (దిగిలిని) ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే క్యూర్(సియుఆర్ఈ) పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని, పరిపాలనను పట్టాలెక్కించాల నేదే తమ ఆలోచన అని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని, హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన చెత్త నిర్వహణ సమస్యను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని, సిటీలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ బస్సులు, ఆటోలను తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని, జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్ లదేనని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడా, రోడ్లపై గుంతలు కనిపించకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

**గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు**

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్ మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ ఏరియాలో >>2



ట్రంప్‌కు ఇజ్రాయెల్

## అత్యున్నత పురస్కారం

**ఫ్లోరిడా, డిసెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ఇజ్రాయెల్ ప్రైజ్ ఫర్ పీస్"ను ట్రంప్‌నకు ప్రదానం చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగోలో ఇరువురు నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది. >>2



శ్రీజన వినయ్ కృష్ణారెడ్డి

## పలువురు ఐఎఎస్‌ల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. డిసెంబరు30:** తెలంగాణ రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారుల బదిలీలు, నియామకాలకు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ బదిలీల్లో జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్ పదవులు, కీలక శాఖల కమిషనర్ పోస్టులు ఉన్నాయి. పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా ఉన్న జి.శ్రీజనను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో (కూకట్‌పల్లి, శేర్‌లింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. నిజామాబాద్ కలెక్టర్‌గా ఉన్న వినయ్ కృష్ణారెడ్డిని జిహెచ్ఎంసీ (మల్కాజ్‌గిరి, ఎల్‌బినగర్, ఉప్పల్ జోన్లు)లో అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ నగర పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు ఈ >>2



భారత్- పాక్‌ల మధ్య మళ్లీ

## యుద్ధ మేఘాలు!

### అమెరికా థింక్ ట్యాంక్ విశ్లేషణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** భారత్ పాకిస్తాన్‌లమధ్య వచ్చే ఏడాది మరోసారి యుద్ధంజరిగే అవకాశం ఉందని అమెరికన్ విదేశాంగ నిపుణులను సర్వేచేసే యుఎస్ థింక్ ట్యాంక్ నివేదిక విడుదలచేసింది. కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ సాయుధ సంఘర్షణ అవకాశాలకు ఎక్కువ ఆస్కారం ఉందని తెలిపింది. అమెరికన్‌ప్రయోజనాలపై పరిమిత ప్రభావం చూపవచ్చుని ఉగ్రవాద కార్య కలాపాల పెరుగుదల >>2

అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా

## హరీష్, తలసాని, సబిత

### మండలిలో డిప్యూటీ నాయకులుగా ఎల్.రమణ,శ్రీనివాస్‌రెడ్డి

### లీడర్లను, విప్‌లను ప్రకటించిన కెసిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. డిసెంబరు30:** బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. మాజీ సిఎం, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. శాసనమండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు >>2



సెట్ తేదీలు విడుదల చేస్తున్న దృశ్యం

## మే 4 నుంచి ఎప్‌సెట్

### వివిధ సెట్‌ల తేదీలు ప్రకటించిన ఉన్నత విద్యామండలి

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 30:** 2026-27 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదిలను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. వచ్చే ఏడాది మే 4 నుంచి 11 వరకు ఎప్ సెట్-2026 పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాల కిష్టారెడ్డి తెలిపారు. >>2

సంక్రాంతి సెలవుల్లో

## 'టోల్' బంద్‌కు యోచన

### గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి బహిరంగ లేఖ

### అధికారులతో సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు30:** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి పండగ రోజుల్లో టోల్ గేట్ల నిర్వహణను నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాయాలని నిర్ణయం తీసుకుంది. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండగ సమయంలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఫ్లై ఓవర్లు, వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లపనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 3,4 రోజుల పాటు టోల్ గేట్ల నిర్వహణను ఆపాలని రాష్ట్రం ప్రభుత్వం అనుకుంటోంది.

ఈ మేరకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ రాశారు. ఆ లేఖలో సంక్రాంతి సందర్భంగా టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ -విజయవాడ హైవేపై జనవరి 9 నుంచి 18 వరకు టోల్ ఫీజు మినహాయించాలని కోరారు. పండగ రోజుల్లో ట్రాఫిక్ 200 శాతం అధికంగా ఉంటుందన్న మంత్రి టోల్ గేట్ల వద్ద వాహనాలు ఆగకుండా సహకరించాలని కోరారు. సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎన్‌హెచ్ఎఐ రీజినల్ అధికారి శివ శంకర్, ఎంఆర్‌టిహెచ్ రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్, డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, ఆర్ అండ్ బి ఈ ఎన్సి లు జయభారతి, మోహన్ నాయక్, ఎస్. ఈ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి పండుగకి సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ - విజయవాడ హైవే పై జనవరి 8 నుండి వాహన రద్దీ ఎక్కువ ఉంటుందని, ఈ సమయంలో రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందని, దీనిపై అన్ని విభాగాల >>2

ట్రాన్స్‌జెండర్లకు

## రూ.75వేల సాయం

### నూరుశాతం సబ్సిడీతో రుణాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 30:** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలో ట్రాన్స్ జెండర్లు కూడా గౌరవప్రదమైన జీవనం సాగించేలా, ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడేలా భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ట్రాన్స్ జెండర్లకు 100 శాతం సబ్సిడీతో రుణాలు అందించేందుకు ముందుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి రూ. 75 వేల వరకు రుణం మంజూరు చేయనున్నారు. ఇది పూర్తిగా సబ్సిడీతో కూడుకున్నది కావడంతో లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఏదైనా రంగంలో నైపుణ్య శిక్షణ >>2



మంగళవారం అర్ధరాత్రి నెక్కొండ ప్రాంతంలో యూరియా కోసం పసిపిల్లలతో రైతులు


## యూరియా ఏదయా?

### ఎరువుల కోసం అర్ధరాత్రి పోరాటం

### ఒక్క బస్తాకోసం పసిపిల్లలతో పడిగాపులు

### నెక్కొండ ప్రాంతంలో రైతుల దురవస్థలు

**నెక్కొండ,డిసెంబర్ 30,ప్రభాతవార్త:** నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతుల కష్టాలు కన్నీటిపాలయ్యాయి. పంటలకు ప్రాణమైన యూరియా కోసం వృద్ధులు, మహిళలు, పసిపిల్లలతో సహా రైతులు మధ్యరాత్రి నుంచే మంచు కురిసే చలిలో క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. రైతుల పాలిట యూరియా బస్తా ఇప్పుడు ఒక కలగా మారిందని స్థానికులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎముకలు గడ్డకట్టించే చలిలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని, కొందరు రైతులు పసిపిల్లలను వెంటబెట్టుకొని ఎదురుచూడడం రాష్ట్ర ప్రభుత్వ >>2




మద్యం ప్రియుల జోరుకు కళ్లెం.. బార్లు, పబ్‌ల వద్ద గట్టి నిఘా

రంగంలోకి షీ బృందాలు, ప్రత్యేక గస్తీ దళాలు

## ఇటు ముస్తాబు.. అటు ఆంక్షలు

### కొత్త సంవత్సర స్వాగత హేలకు పరిమితులు విధించిన పోలీసులు

### బుధవారం రాత్రి నుంచి తెల్లవారే దాకా ట్యాంక్‌బండ్, ఒఆర్ఆర్, పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే సహా పలు మార్గాల మూసివేత

### ప్రజలు రోడ్లపై ఇష్టానుసారం చెలరేగకుండా గట్టి ఆంక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ ముస్తాబవడంతో ఇందుకు అనుగుణంగా పోలీసు శాఖ భద్రతా చర్యలు చేబట్టింది. 2026కు స్వాగతం పలికేందుకు ప్రజలు రోడ్లపై ఇష్టానుసారం రాకుండా వుండేందుకు అనేకచోట్ల ఆంక్షలు విధించింది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్‌లను బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారు జామున రెండు గంటల వరకు మూసి వేయనున్నారు. ఇదేసమయంలో సైబరాబాద్, రాచకొండ పరిధుల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో వుంటాయి. హైదరాబాద్ వరకు వస్తే ట్యాంక్‌బండ్, నె క్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ మార్గాలు మూసివేయనుండడంతో ఈ మార్గాలలో రాకపోకలు సాగించే వాహనదారులు ఆంక్షల సమయంలో సమీపంలో ని ఇతర మార్గాల గుండా ప్రయాణాలు సాగించాల్సి వుంటుంది. ఈ మార్గాలలో పోలీసులు >>2



మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని చార్మినార్ వద్ద నిర్వహించిన స్వామివారి ఊరేగింపులో కళాకారుల నృత్యప్రదర్శన దృశ్యం

## దర్శనాలకు పోటెత్తిన భక్తులు

>> దీనిని అన్ని విష్ణువు ఆలయాలలో జరుపుకుంటారు. విష్ణువు మహిమాన్వితమైన నివాసం వైకుంఠం. వైకుంఠం అనే పదానికి "ఆందోళనలు లేని ప్రదేశం" అని అర్థం. భక్తులు అత్యున్నత ఆధ్యాత్మిక ఆనందంలో భగవంతునికి ప్రేమపూర్వక భక్తితో సేవలో శాశ్వతంగా నిమగ్నమై ఉంటారు. విష్ణువు ఆరాధన ఆత్మకు భక్తి, స్మరణ, శరణాగతి ద్వారా ఆయనతో ప్రత్యక్ష సంబంధాన్ని అందిస్తుంది. వైకుంఠ ఏకాదశి నాడు, విష్ణు భక్తులు ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తారు. ఆయన పవిత్ర నామాలను జపిస్తూ ఆయన మహిమలను పాడటం ద్వారా పరమాత్మను స్మరిస్తారు. అన్ని విష్ణు దేవాలయాలలో సామాన్యులు మొదలుకొని పెద్దల వరకు అందరూ తెల్లవారు జామున వెళ్లి పూజలు చేయడం ద్వారా తరిస్తారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని దేవాదయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని దేవాలయాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించకుంది.

## మే 4 నుంచి ఎప్‌సెట్

>> రాష్ట్రంలో నిర్వహించే 8 కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కి సంబంధించిన తేదిలను ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో కలిసి మంగళవారం మీడియాకి తెలిపారు. గత ఏడాది వివిధ ప్రవేశ పరీక్షలను సాఫీగా నిర్వహించామన్నారు. గత ఏడాది సెట్స్ నిర్వహణలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లను కూడా ఈ ఏడాది జరగకుండా స్టూడెంట్స్ ఫ్రెండ్లీగా ప్రవేశ పరీక్షలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే సెట్స్ కన్వీనర్లను, నిర్వహించే యూనివర్సిటీలను సోమవారం ప్రకటించగా.. మంగళవారం సెట్స్ తేదిలను ప్రకటిస్తున్నట్టు తెలిపారు. జాతీయ ప్రవేశ పరీక్షలను వివిధ పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అనుమతితో కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదిలను నిర్ణయించినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీ(ఎప్) సెట్ పరీక్షలను మే 4 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలను నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. మే 12న బీఈడీలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్‌ను, మే 13, 14 తేదీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ పరీక్షని నిర్వహించనున్నారు. బీఈ, బీటెక్, బీ ఫార్మా కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా వచ్చే వారి కోసం మే 15న ఈసెట్ పరీక్షను, మే 18న ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల కోసం లాసెట్, పీజీ లాసెట్ పరీక్షలను, ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మా, ఎంఆర్క్, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 28 నుంచి 31 వరకు పీజీ ఈసెట్‌ను నిర్వహిస్తారు. ఇక మే 31 నుంచి జూన్ 3వ తేదీ వరకు పిజికల్ ఎడ్యుకేషన్(పీఈ) సెట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. గత ఏడాది ఎప్ సెట్ పరీక్షలను ఏప్రిల్ 29 నుంచి ప్రారంభించగా.. ఈ ఏడాది మే 4 నుంచి ప్రారంభించనున్నారు.

## పలువురు ఐఎఎస్‌ల బదలీ

>> నియామకాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో వీరి పాత్ర కీలకంగా ఉండనుంది. వుమెన్ చైల్డ్ వెల్‌ఫేర్ డైరెక్టర్‌గా ఉన్న శృతి ఓజాకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థల పర్యవేక్షణ, గ్రామస్థాయి పరిపాలన బలోపేతం దిశగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇలా త్రిపాఠిని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్‌ను నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీ చేశారు. నల్గొండ జిల్లాలో సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక నారాయణపేట జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌ను నియమించారు. జిల్లా పరిపాలనలో అదనపు కలెక్టర్ పాత్ర కీలకమైన నేపథ్యంలో, అభివృద్ధి పనులు, రెవెన్యూ వ్యవహారాలు, సంక్షేమ పథకాల అమలులో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.

## అత్యున్నత పురస్కారం

>> గత 80 ఏళ్ల చరిత్రలో ఈ పురస్కారాన్ని ఓ విదేశీయుడికి (నాన్‌ఇజ్రాయెల్ సిటిజన్) ఇవ్వడం ఇదే తొలిసారి కాగా శాంతి విభాగంలో అవార్డును ప్రకటించడం కూడా ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఏడాది జులై లో ఇజ్రాయెల్ తమ నిబంధనలను సవరించి మరీ విదేశీయులకు ఈ అవార్డు ఇచ్చేలా మార్పులు చేసింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరై ట్రంప్ ఈ అవార్డును స్వీకరించే అవకాశం ఉంది. ట్రంప్ ఎన్నో సంప్రదాయాలను తిరగరాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే మేం కూడా సంప్ర దాయాన్ని పక్కనపెట్టి తొలిసారి ఓ ఇజ్రాయేలేతరుడికి ఈ అవార్డును ఇస్తున్నాం. యూదు ప్రజలకు, ఇజ్రాయెల్ భద్రతకు ట్రంప్ చేసిన సేవలకు ఇది గుర్తింపని నెతన్యాహు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ట్రంప్ ఈ గౌరవం తనను ఆశ్చర్యపరిచిందని, ఇజ్రాయెల్ గుర్తింపు పట్ల ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భేటీలో భాగంగా గాజా శాంతి ఒప్పందం రెండో దశ, వెస్ట్ బ్యాంక్ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. వెస్ట్ బ్యాంక్ విషయంలో తమ మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ ఒప్పందానికి కట్టుబడి ఉందని, ఆ దేశం బలంగా ఉందని ట్రంప్ కితాబునిచ్చారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని నెతన్యాహు వెల్లడించారు.

## యూరియా ఏదయా?

>> వ్యవసాయ పాలన వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా మారిందని ఆరోపించారు. ఒకవైపు చలి తీవ్రత, మరోవైపు యూరియా బస్తాల కోసం నానా అవస్థలు ఇదే నేడు రైతుల జీవన వాస్తవంగా మారిందని రైతులు వాపోయారు. పొలాల్లో పంటలను కాపాడుకోవాల్సిన రైతులు, ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడి అశ్రువులు మింగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా బస్తాలు సకాలంలో సరఫరా అయ్యేవి. ఇప్పుడు ఒక్క బస్తాకోసం ఈ స్థాయి అవమానం ఎదుర్కోవాల్సి వస్తోంది అంటూ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కాలంలో కనీస అవసరమైన ఎరువులు కూడా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొనడం రైతు పాలనపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధినే ప్రశ్నిస్తోందని స్థానికులు వ్యాఖ్యానించారు. రైతులు పొలాల్లో పంటల కోసం పోరాడుతుంటే, ప్రభుత్వం మాత్రం అసమర్థతతో చేతులు దులుపుకుంటోందా? అనే ప్రశ్న ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. రైతు సంక్షేమం అని సభల్లో, ప్రకటనల్లో గొప్పగా చెప్పుకునే పాలకులు, యూరియా వంటి మౌలిక అవసరాన్ని కూడా సక్రమంగా నిర్వహిం చలేకపోతే ఈ పాలన రైతుకు ఏం మేలు చేస్తుందనే సందేహం గ్రామ గ్రామానా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించియూరియా సరఫరాను వెంటనే సరిచేయాలని రైతులుఅర్ధరాత్రి క్యూ లైన్లలో నిలబడే దుస్థితికి ముగింపుపలకాలని పంటకాలంలో ఎరువుల కొరత లేకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## రూ.75వేల సాయం

>> పొంది, సొంతంగా చిరు వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ సాయం అందిస్తారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉన్న ట్రాన్స్‌జెండర్లు ఈ పథకానికి అర్హులని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత శాఖ అధికారులు తెలిపారు.
హైదరాబాద్ జిల్లాకు సంబంధించి ఈ పథకం కింద 30 స్వయం ఉపాధి యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆసక్తి గల అభ్యర్థులు నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. లేదా వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వచ్చే నెల (జనవరి) 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తుంది.

## వారం - వర్జ్యం

31-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి రా.1.46
కృత్తిక రా.1.28, పూర్వాషాఢ కార్తె
వర్జ్యం : మ.3.41-5.06
దు.ఉ.11.41-మ.12.33
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారాలలో మంచి మార్పులు ఉంటాయి.

**వృషభం:** జీవితాశయాన్ని ఏ విధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు. సోదరుల కలయిక.

**మిథునం:** చర్మసంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. మొండి వ్యవహారాలను కాలానికి వదిలివేస్తారు.

**కర్కాటకం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు. ప్రయాణాలు.

**సింహం:** సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపించడానికి విశేషంగా కృషి చేస్తారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కన్య :** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారిపోకుండా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తారు.

**తుల :** అప్పుచేయకపోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం:** ఎదుటివారి సంభాషణలలోని నిజానిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహనయోగం.

**ధనుస్సు:** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కుటుంబ సభ్యుల సహాయసహకారాలు అందుకుంటారు.

**మకరం:** సంతానరీత్యా సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కుంభం:** అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్ధతగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇటు ముస్తాబు..అటు ఆంక్షలు

>> సూచనల మేరకు వాహనదారులు ప్రయాణాలు సాగించ వాల్సి వుంటుంది. నగరంలోని బేగంపేట్, షేక్‌పేట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మినహా అన్ని ఫ్లై ఓవర్‌లను ఆంక్షల సమయంలో మూసివేస్తారు. ఇక సైబరాబా ద్, రాచకొండ పరిధుల వరకు వస్తే అవుటర్ రింగు రోడ్డును రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున ఐదు గంటల వరకు మూసివేస్తారు. ఈ సమయంలో కేవలం విమానాశ్రయ ప్రయాణీకులు, తగిన అనుమతులు వుండి దూర ప్రయాణం చేసే భారీ వాహనాలకు మాత్రమే అనుమతిస్తారు. అయితే సైబరాబాద్, రాచకొండ పరిధిలో ఫ్లై ఓవర్‌లపై వాహనాల రాకపోకలపై కేవలం ఆంక్షలు మాత్రం విధించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున ఐదు గంటల వరకు అనుమతించరు. ఈ సమయంలో సరుకు రవాణా వాహనాలకు అనుమతిస్తారు. ఆంక్షల సమయంలో వాహనదారులు ఇతర ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వుంటుంది. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మందు బాబులు, డ్రగ్స్ సేవించిన వారి భరతం పట్టేందుకు ట్రై కమిషనరేట్ల పోలీసులు బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున ఆరు గంటల వరకు డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రహదారులు, బహిరంగ ప్రాంతాలలో ఎవరైనా మద్యం సేవించినా, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించినా కఠినంగా వ్యవహరిస్తారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో వాహనదారులు ఎక్కడా అతివేగంతో వెళ్లరాదని పో లీసులు కోరారు.

**వేడుకలు నిర్వహించే సంస్థలకు పోలీసుల సూచనలు**

ఇదిలావుండగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే సంస్థలతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌ల నిర్వాహకులు పరిమితికి మించి పా సులు ఇవ్వడం లేదా టికెట్లు విక్రయించడం చేయకూడదని, వేడుకలకు సంబంధించిన వివరాలను ముందుగానే తెలియపరచాలని పోలీసులు సూచిం చారు. వేడుకలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు ఎక్కువ మంది ఉద్యోగులను నియమించుకోవాలని, రాకపోకలకోసం వేరు వేరుగా మార్గాలు వు ండాలని వారు తెలిపారు. వేడుకలు జరిగేచోట తప్పించి బయట ఎలాంటి డిజెలు పెట్టరాదని పోలీసు అధికారులు పేర్కొన్నారు. వేడుకలు జరిగే ప్రాంతం తప్పించి బయట ఎలాంటి ధ్వని కాలుష్యం రాకూడదని, ఇరుగు పొరుగు వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. వేడుకల్లో పాటలు పాడేవారు ముందుగా నిర్ణయించిన వేదికలోనే వుండాలని, జనం మధ్యకు రాకూడదని, ఈ సందర్భంగా అశ్లీలంగా వ్యవహరించకూడదని అధికారులు తెలిపారు. వేడుకల్లో ఎలాంటి మాదకద్రవ్యాలకు ఆస్కారం వుండ కూడదని, ఈ విషయంలో తే డావస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వేడుకలు జరిగేచోట సిసి కెమెరాలు వుండాలని, రాకపోకలు జరిగే ప్రాంతాలలో 50 గజాల వరకు కనిపించేలా చూడాలని అధికారులు కోరారు. వేడుకలు జరిగేచోట ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ క్రమంలో పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు తెలిపారు. వేడుకల కోసం సర్కారు అనుమతి ఇచ్చిన అర్ధరాత్రి ఒంటి గంట తరువాత మద్యం సరఫరా చేయరాదని, ఎక్కడా బాణాసంచా కాల్చరాదని, వేడుకల్లో మద్యం తాగిన వారు గలాటా చేయకుండా చూ డాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని పోలీసు అధికారులు పేర్కొన్నారు. వేడుకలు జరిగేచోట్ల పార్కింగ్‌కు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందు కోసం తగిన సిబ్బందిని నియమించాలని, మద్యం తాగిన వారు వాహనాలు నడపకుండా చూసే బాధ్యతను నిర్వాహకులు తీసుకోవాలని పోలీసులు తెలిపారు. అతిగా మద్యం తాగే వారి విషయంలో జాగ్రత్తగా వుండాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. నూతన సంవత్స వేడుకలు ముగిసిన తరువాత అతి వేగంతో వెళ్లేవారిపైనా చర్యలు తీసుకుంటామని, మైనర్లు వాహనాలు నడపకుండా చూడాలని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. వేడుకల రోజున షీ బృందాలను రంగంలో దించనున్నారు. ఎక్కడైనా ఎవరైనా మ హిళలను ఇబ్బందులకు గురిచేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటారు.



షహీద్ స్వరాజ్ దివస్ వేడుకల సందర్భంగా మంగళవారం కోల్‌కతాలోని ఐఎన్ఎ స్మారక చిహ్నం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఆజాద్ హింద్ పీపుల్స్ మిషన్ సభ్యులు

# హరీష్, తలసాని, సబిత

>> చేయడం వంటి కీలక అంశాలను సమన్వయం చేస్తారు. శాసనమండలిలో విపక్ష నేతగా ఉన్న సిరికొండ మధు సూదనాచారిని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగించనున్నారు. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. సభ్యులు, పార్టీ నేతలు ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. పార్టీలో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయంవంటి అంశాలు ఈ మార్పులద్వారా మరింత ప్రాముఖ్యత పొందుతాయని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) మంగళవారం సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం. ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది. ఇదే విషయంపై కొద్దిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే మంగళవారం కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?.. ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో ఎలా సిద్ధంగా ఉండాలని అంశంపై పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

# ఇక కాలుష్య ప్రక్షాళన

>> విభాగాల అధికారులను బాధ్యత స్పెషల్ సీఎస్ సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు సీఎం సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని హోటల్స్ లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్దరించి యాక్టివిటీ జోన్స్ గా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి నుంచి ప్రతీ ఒక్కరూ ఫీల్డ్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే నగరం భవిష్యత్ మారుతుందన్నారు. ప్రతీ నెలకు ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, సెక్రెటరీ మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కర్ణన్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్ సీడీఏ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎం రేవంత్, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్

## 'టోల్' బంద్‌కు యోచన

>> అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం సచివాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం తాను తూప్రాన్ పేట్, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తానని అధికారుల చర్యలను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ప్రధానంగా ఎల్బీనగర్ నుంచి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదన్నారు. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దన్నారు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలన్నారు. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలన్నారు. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట పగలు, రాత్రి స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. హైవిజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలని సూచించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలని, అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. రోడ్డు పనుల్లో ఉన్న సిబ్బంది అందరూ ప్రతిబింబించే జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రాత్రి సమయంలో జంక్షన్లు, వర్క్ జోన్‌ల వద్ద తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలన్నారు. బారికేడ్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రూట్ పేట్రోల్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని, టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా సజావుగా వెళ్లేలా అదనపు బృందాలను మోహరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రికి రాసిన లేఖలోని ప్రధాన అంశాలు:తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో సంక్రాంతి అతిపెద్ద పండుగ అని, ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి విజయవాడ మార్గంలో జనవరి 13 వరకు వాహనాల రాక విపరీతంగా ఉంటుందని పేర్కొన్నారు. పంతంగి, కొర్లపహాడ్ మరియు చిల్లకల్లు టోల్ గేట్ల వద్ద ఉన్న డేటా ప్రకారం.. సాధారణ రోజుల కంటే ఈ సమయంలో 200 అదనపు ట్రాఫిక్ ఉంటుందని వివరించారు. దీనివల్ల టోల్ ప్లాజాల వద్ద ప్రయాణికులు తీవ్ర జాప్యానికి గురవుతున్నారని తెలిపారు. జంక్షన్లు, జనావాసాలు, ప్రస్తుతం రహదారిపై జరుగుతున్న పనుల వల్ల కూడా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, పోలీసులతో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తోందని పేర్కొన్నారు. ప్రయాణం సాఫీగా సాగడం కోసం ఈ క్రింది సమయాల్లో టోల్ వసూలు చేయకుండా (టోల్ ఫ్రీ) టోల్ మినహాయింపు ఇచ్చి వాహనాలను అనుమతించాలని కోరారు. హైదరాబాద్ నుండి విజయవాడకు: జనవరి 9 నుండి 14 వరకు. విజయవాడ నుండి హైదరాబాద్‌కు: జనవరి 16 నుండి 18 వరకు. ప్రజల సౌకర్యార్థం జనవరి 9 నుండి 18 వరకు ఈ మార్గంలో ఉచిత ప్రయాణాన్ని (టోల్ ఫ్రీ) అనుమతించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

## యుద్ధ మేఘాలు!

>> కారణంగా భారత్, పాక్ మధ్య తిరిగి సాయుధ సంఘర్షణకు అవకాశం ఉన్నట్లు సిఎఫ్ఆర్ తన కాన్‌ఫ్లిక్ట్ వాచ్ఇన్ 2026 నివేదికలో ఉటంకించింది. భారత్‌తోనే కాకుండా పాక్ ఆఫ్ఘనిస్తాన్ మధ్యకూడా సాయుధ పోరాటం ఉంటుందని హెచ్చరించింది. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వ్యాప్తంగా ఉన్న లష్కరే, జైషే ఉగ్రవాద స్థావరాలు కార్యాలయాలపై దాడులుచేసింది. వందలాదిమంది ఉగ్రవాదులు హతమయ్యారు. తర్వాత పాక్ సైన్యం భారత్‌పై దాడులకు ప్రయత్నిస్తే పాక్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను భారత్ క్షిపణులు డీకొట్టాయి. తర్వాత తాజాగా థింక్‌ట్యాంక్‌నుంచి ఈ నివేదికవచ్చింది. ప్రత్యేకించి ఆర్మీచీఫ్‌గా ఆసిమ్‌మునీర్‌కు అత్యున్నత పదవి లభించిన తర్వాత భారత్ లక్ష్యంగా కార్యకలాపాలు పెరిగాయి. రెండుదేశాలు కూడా రక్షణ వ్యవస్థను బలోపేతంచేసుకుంటున్నాయి. రెండురోజులక్రితమే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 79 వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రి కొనుగోలుకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పాక్ కూడా అమెరికా,చైనాలపై రక్షణ సామగ్రి దిగుమతికి ఆధారపడింది. దీనికితోడు ఆసిమ్‌మునీర్ హయాంలోనే ఉగ్రవాదం ఇతర దేశాలకు కూడా పాకుతోంది. ఇటీవలే స్పానిష్ పోలీసులు 11 మంది పాకిస్తానీ దేశీయులను తాలిబన్ టెర్రరిస్టులుగా అనుమతనిస్తూ అరెస్టులుచేయడంతో జీహాదీ చర్యలు బలపడ్డాయి.

# రూ.వెయ్యి కోట్ల రుణం తీసుకున్న సర్కారు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,000 కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ మంగళవారం నిర్వహించిన బహిరంగ మార్కెట్లో బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. ఇందుకు గాను 11 ఏండ్ల కాలానికి రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెట్టినట్టు ఆర్థిక శాఖ వెల్లడించింది. దీంతో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.69,300 కోట్ల రుణాన్ని సమీకరించినట్లు అయింది. ఇక రాష్ట్ర వార్షిక అంచనా బడ్జెట్‌లో రూ.54,009 కోట్లు రుణం కింద సేకరించాలని ప్రతిపాదించింది. అయితే తాజాగా ఈ రుణ పరిమితి పెంచాలని, పాత రుణాల రీ షెడ్యూలింగ్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన వినతికి కేంద్రం అంగీకరించింది. ఇందులో భాగంగా 2025-26 వార్షిక సంవత్స రానికి రూ.71,400 కోట్ల వరకు రుణాలకు అనుమతి ఇచ్చింది. వీటిలో ఈ రోజు తీసుకున్న రూ.1,000 కోట్లు పోను, వచ్చే మూడు నెలల కాలానికి కేవలం రూ.2,100 కోట్లు మాత్రమే రుణ సమీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నది.

## దివంగత ఎమ్మెల్యే మాగంటి సోదరుడిపై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 30, ప్రభాతవార్త:** దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సోదరుడు మాగంటి వజ్రనాథ్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని 550 చదరపు గజాల స్థల విక్రయానికి సంబంధించి మణికొండ చిత్రపురి కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ సుధాకర్‌బాబును దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోద రుడు మాగంటి వజ్రనాథ్ సంప్రదించారు. స్థలం విక్రయిస్తే రూ. 10 లక్షలు బ్రోకరేజీ ఇస్తానని మాగంటి వజ్రనాథ్ హామినిచ్చారు. దీంతో ఈ స్థలాన్ని డీఎస్ఆర్ డెవపలర్స్‌కు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మధ్యవర్తిత్వంతో సుధాకర్‌బాబు విక్రయించాడు. ఇందుకు సంబంధించి బ్రోకరేజీ లక్ష రూపాయలు చెల్లించిన వజ్రనాథ్ మిగిలిన మొత్తం చెల్లించకుండా కాలం గడుపుతున్నాడు. పలుమార్లు సంప్రదించగా వజ్రనాథ్ అశ్లీల పదజాలంతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఫోన్ నంబరును బ్లాక్ చేశాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 6న బంజారా హిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ ప్లాట్ నంబరు 80సి వద్ద కలిసిన వజ్రనాథ్‌ను బ్రోకరేజీ డబ్బుల గురించి అడుగగా తిరిగి దూషించాడు. ఈ వ్యవహారాన్ని సుధాకర్‌బాబు తన ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు సుధాకర్‌బాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మాగంటి వజ్రనాథ్‌పై సెక్షన్ 351(4), 352 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యూరియాకు ప్రత్యేక అధికారులు

### వ్యవసాయ డైరెక్టర్ గోపి ఉత్తర్వులు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుత యాసంగి సీజన్ సాగుకు సంబంధించి యూరియా పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసు కుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా రబీ సీజనుకు రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నప్పటికీ వాటి పంపిణీ తలెత్తుతున్న లోపాలను అధిగమించేందుకు వ్యవసాయ శాఖ దృష్టిసారించింది. ప్రధానంగా యూరియా అందుబాటులో ఉన్నా రైతులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రత్యేక అధికారులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా ఒక్కొక్క ప్రత్యేక అధికారికి నాలుగైదు జిల్లాలను కేటాయించారు. జిల్లాల్లో యూరియా పంపిణి సక్రమంగా జరిగేలా వీరంతా మానిటరింగ్ చేయనున్నారు. ఈ ప్రత్యేక అధి కారులుగా వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్లు కే.విజయ్ కుమార్, బి.నర్సింహారావు, అడిషనల్ డైరెక్టర్లు ఎస్.గీత, వి.ఆశాకుమారి, వై.సుచరిత, బి. బాలు, ఎం. శైలజ, డిప్యూటీ డైరక్టర్లు ఎం.చంద్రశేఖర్, ఎం. కనకరాజులకు బాధ్యతలు అప్పగించారు. వీరంతా పైలట్ ప్రాజెక్టు కింద యూరియా యాప్ కొనసాగు తున్న ఐదు జిల్లాలో కాకుండా మిగతా జిల్లాలో కూడా సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీగా పంపిణి చేసేలా ప్రత్యేక అధికారులు జిల్లాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నారు.

## రైల్వే విద్యుత్తు లైన్ల దగ్గర గాలిపటాలు ఎగురవేయకండి

### సంక్రాంతి పండుగ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే విజ్ఞప్తి

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 30, ప్రభాతవార్త :** విద్యుత్తు తీగల నుండి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైల్వే ప్రాంగణాల పరిసరాల్లో, యార్డులు, ట్రాక్‌లు, సమీపంలోని జనసంచార ప్రాంతాల్లో గాలిపటాలు ఎగుర వేయడం వల్ల అనేక విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు సంభవిం చాయని దక్షిణ మధ్య రైల్వే తీవ్ర ఆందోళనతో గమనిం చిందని వెల్లడిం చారు. మునుపటి సంక్రాంతి పండుగ సీజన్‌లో ఇలాంటి సంఘటనలు భారతీయ రైల్వేలోని అనేక జోన్‌లలో, కొన్ని కేసులు నమోదయ్యాయి. ఇందులో వ్యక్తులు 25 కె.వి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్లలో చిక్కుకున్న గాలిపటం దారాలను తాకడంతో విద్యుత్‌షాక్‌లు లేదా ప్రాణాంతక గాయాలకు గురయ్యారు.



## కరీంనగర్‌లో వర్ధమాన్(మహిళ) కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖ ఏర్పాటు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** వర్ధమాన్ (మహిళ) కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, తన 36వ సంవత్సర కార్యకలాపాలలో ఈ నెల 29న హైదరాబాద్ వెలుపల తన మొదటి శాఖను ప్రారంభించింది. కరీంనగర్‌లో ఈ శాఖను ప్రారంభించింది. మొత్తం మీద తన 15వ శాఖను ప్రారంభించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ విస్తరణ తెలంగాణ రాష్ట్రమంతటా బ్యాంక్ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో ఒక చారిత్రాత్మక అడుగును సూచిస్తుంది. ఈ శాఖను కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం. సచ్చిదానంద రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రకాష్ చంద్ లూనియా, యోగేష్ గాంధీ, అరవింద్ శ్రీమల్, మెచినేని అశోక్ రావు, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, గంప వెంకటేష్ వంటి విశిష్ట అతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, అధికారులు, వ్యాపారవేత్తలు ఆ ప్రాంత నివాసితులు కూడా హాజరయ్యారు. కరీంనగర్ బ్రాంచ్ పూర్తిగా ఎయిర్ కండిషన్డ్, అన్ని ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలు, స్ట్రాంగ్ రూమ్ మరియు లాకర్ సేవలతో కూడి ఉంది. ఇది గరిష్ట కస్టమర్ సౌలభ్యాన్ని నిర్ధారించడానికి సమగ్ర డిజిటల్ బ్యాంకింగ్ పరిష్కారాలను అందిస్తుంది. ఈ బ్రాంచ్ బంగారు రుణాలు, వ్యాపార రుణాలు ఇతర రిటైల్ బ్యాంకింగ్ సేవలతో సహా విస్తృత శ్రేణి ఆర్థిక ఉత్పత్తులను అందిస్తుంది, ఈ ప్రాంతంలోని వ్యక్తులు వ్యాపారాలకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందించడంలో బ్యాంక్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ సందర్భంగా మహేందర్ కుమార్ జైన్ గోలేచా మాట్లాడుతూ, బ్యాంక్ సాధించిన విజయాలు మైలురాళ్లను వివరించారు. వర్ధమాన్ (మహిళ) కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రూ. 1,100 కోట్ల వ్యాపార టర్నోవర్ సాధించిందని ఆయన పేర్కొన్నారు. 1990లో స్థాపించబడినప్పటి నుండి, బ్యాంక్ లాభదాయకతలో అజేయమైన రికార్డును కొనసాగించిందన్నారు,

# తెలంగాణలో 2.33 శాతం తగ్గిన నేరాలు

### 3 శాతం తగ్గిన సైబర్ నేరాలు.. నేరగాళ్లకు పెరిగిన శిక్షల శాతం

### శాంతిభద్రతలు భేష్, నక్సల్స్‌ను కట్టడి చేశాం, రాజకీయ నేతల ఆరోపణలు అవాస్తవం

### వార్షిక మీడియా సమావేశంలో డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి



మంగళవారం డిజిపి కార్యాలయంలో 2025 యేడాదికి సంబంధించిన వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025లో శాంతిభద్రతలు భేషుగ్గానే వున్నాయని, నక్సలైట్లను కట్టడి చేశామని, డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేస్తున్న కృషి మంచి ఫలితాలను ఇస్తోందని మొత్తం మీద తొలిసారిగా 2.33 శాతం నేరాలు తగ్గాయని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సవ్యంగా లేవని, నేరాలు పెరిగాయని రాజకీయ నేతలు చేసున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తమ వద్ద దీనికి సంబంధించి అన్ని ఆధారాలున్నాయని డిజిపి తెలిపారు. మంగళవారం డిజిపి కార్యాలయంలో 2025 యేడాదికి సంబంధించిన వార్షిక మీడియా సమావేశాన్ని నిర్వహించిన డిజిపి అనేక విషయాలను పంచుకున్నారు. ఈ ఏడాది పోలీసు శాఖకు అనేక అంశాలలో బాగా కలిసివచ్చిందని డిజిపి తెలిపారు. శాంతి భద్రతలతో పాటు పండగలు, వేడుకలు అన్నీ సాఫీగా సాగాయని, మూడు విడతలుగా జరిగిన పంచాయితీ ఎన్నికలు సైతం ప్రశాంతంగా ముగిశాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఆయన తెలిపారు. అన్ని కేటగిరిలో ఈ ఏడాది నేరాలు బాగా తగ్గుముఖం పట్టిందని, ముఖ్యంగా సైబర్ నేరాల వరకు వస్తే దేశంలో ఇది 41 శాతం పెరుగుదల వుంటే రాష్ట్రంలో మూడు శాతం తగ్గిందని ఆయ న తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ మొదటి స్థానంలో వుందని ఆయన అన్నారు. నక్సలైట్ల సమస్య తెలంగాణలో లేదని, ఉగ్రవాదం సమస్య కూడా లేదని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణ నుంచి 53 మంది వున్నారని, ఈ ఏడాది 509 మంది నక్సలైట్లు లొంగి పోగా ఇందులో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారే ఎక్కువగా వున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టుల ఏరివేత విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుస రిస్తున్న విధానమే రాష్ట్రంలోనూ వుంటుందని డిజిపి తెలిపారు. రాష్ట్రంలో నేరాల శాతం తగ్గగా ఐపిసి కేసులు కూడా 1.45 తగ్గిందని, నేరగాళ్లకు శిక్షల శాతం 38.72గా వుందని, గత ఏడాది ఇది 35.63 శాతంగా వుందని ఆయన తెలిపారు. మొత్తం మీద శిక్షల శాతం 3.09 పెరిగిందని ఆ యన తెలిపారు. 216 కేసుల్లో 320 మంది నిందితులకు జీవిత ఖైదు శిక్షలు పడ్డాయని డిజిపి తెలిపారు. పోస్కో కేసుల్లో 154 మంది నిందితుల కు జీవిత ఖైదు శిక్షలు పడ్డాయని ఆయన వెల్లడించారు. ఎస్సి, ఎస్‌టి కేసుల్లో 53 మంది నిందితులకు జీవిత ఖైదు శిక్షలు పడ్డాయని డిజిపి తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు 5.68 శాతం పెరిగాయని, అయితే మృతుల సంఖ్య 7.9 శాతం తగ్గిందని ఆయన తెలిపారు. మిస్సింగ్ కే సుల్లో 87 శాతం ఫలితాలు సాధించామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 12 లక్షల 9782 సిసి టివిలు వుండగా ఈ ఏడాది 45,137 కెమెరాలను ఏర్పాటు చేశామని డిజిపి తెలిపారు. సైబర్ నేరాలు తగ్గాయని. నేరగాళ్ల నుంచి నగదును జప్తు చేయడం బాగా పెరిగిందని వీటిని బాధితులకు అందించామని ఆయన వెల్లడించారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలతో పాటు అన్ని వర్గాల వారు మరింత అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని డిజిపి కోరారు. సైబర్ నేరాల నివారణకు కొత్తగా ఏర్పాటైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో బాగానే పని చేస్తోందని, అనేక కరుడుగట్టిన నేరగాళ్లను అరెస్టు చేశామని డిజిపి తెలిపారు. వచ్చే ఏడాది సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించను న్నామని ఆయన తెలిపారు. కరుడు గట్టిన నేరగాళ్లపై పిడి నమోదు చేయడం ఈ ఏడాది కూడా పెరిగిందని డిజిపి తెలిపారు. కాగా రాష్ట్రంలో నక్స ల్స్ ను ఈ ఏడాది కూడా కట్టడి చేయడంలో పోలీసులు సఫలం అయ్యారని డిజిపి తెలిపారు. ఇందుకు గానూ పోలీసులను అభినందిస్తున్నానని ఆయన తెలిపారు. పోలీసులు సమష్టిగా కృషి చేయడం వల్లే ఇది సాధ్యమయ్యిం దని ఆయన నేరాల నివారణలో మెరు గైన ఫలితాలు వచ్చాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చేందుకు తాము కృషి చేస్తామని డిజిపి తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశం సుప్రీం కోర్టు పరిధిలో వుంద ని, అయితే కేసు విచారణ పారదర్శకంగానే జరుగుతుందని డిజిపి తెలిపారు. ఐ బొమ్మ రవి విషయంలో అంతా చట్టప్రకారమే జరుగుతుందని ఆ యన చెప్పారు.

**డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తెలంగాణ..**

**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం**

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలన్న సర్కారు సంకల్పానికి అనుగుణంగా పోలీసు శాఖ కృషి చేస్తుందని డిజిపి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా డ్రగ్స్ కాన రాకుండా చేయడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఇదే సమయంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నామని డిజి తెలిపారు. డ్రగ్స్ నివారణలో భాగంగా నేరగాళ్లకు సంబంధించి భారీగా ఆస్తులను జప్తు చేశామని, నార్కోటిక్ కేసులు 20 శాతం పెరిగాయని డిజిపి తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల విషయంలో జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. డ్రగ్స్‌కు సంబంధించి ప్రజల వద్ద సమాచారం వుంటే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

ఈ యేడాది డయల్ 100, 112కు 16 లక్షల 10 వేల 778 ఫిర్యాదులు వచ్చాయని, ఫిర్యాదుపై ఐదు నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలికి పోలీసులు వస్తున్నారని డిజిపి తెలిపారు. గస్తీ వాహనాలు సవ్యంగానే గస్తీ కాస్తున్నాయని ఆయన కితాబునిచ్చారు. రాష్ట్రంలో విజిబుల్ పోలీసింగ్ ఈ ఏడాది కూడా వంద శాతంగా వుందని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో టి.నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, పోలీసు అకాడమి డిజి అభిలాష్ బిస్త్, శాంతి భ ద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, నిఘా విభాగం అధిపతి విజయ్ కుమార్, టిఎస్ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్, గ్రేహౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, సిఐడి చీఫ్ చారు సిన్హా ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇక మిషన్‌మోడ్ ప్రణాళికలకు శ్రీకారం

### ఆర్థిక శాఖ అధికారులకు ప్రధాని దిశానిర్దేశం

### నీతిఆయోగ్ ఆర్థికవేత్తలు, నిపుణులతో భేటీ

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ హాజరు



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** వికసిత్ భారత్ లక్ష్యంగా 2047నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే దార్శనికతతో 2026-27 బడ్జెట్‌ను రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. దీర్ఘకాలిక వృద్ధిని కొనసాగించడానికి విభిన్న రంగాల్లో మిషన్‌మోడ్ సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. పెరుగుతున్న దేశ ప్రజల అవసరాలను తీర్చడానికి మెరుగైన సంస్థాగత సామర్థ్యం, మౌలిక సదుపాయాల ప్రణాళిక అవసరం. ప్రపంచ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, ప్రపంచ ఏకీకరణను సాధించడానికి మిషన్ మోడ్ సంస్కరణల అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశ విధాన రూపకల్పన, బడ్జెట్ 2047 దార్శనికతతో ఉండాలని మోడీ పునరుద్ఘాటించారు. మంగళవారం నీతి ఆయోగ్ లోని ప్రముఖ ఆర్థిక వేత్తలు, నిపుణులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఆత్మనిర్భరతకు ఊతమిస్తూనే, వికసిత్ భారత్ లక్ష్యం అజెండాగా పనిచేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని పేర్కొన్నారు. ప్రపంచ శ్రామిక శక్తి, అంతర్జాతీయ మార్కెట్లకు భారతదేశం ముఖ్యమైన కేంద్రంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తయారీ, సేవల రంగాలలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచడంపై వ్యూహాత్మక అంశాలను ఆర్థికవేత్తలు పంచుకున్నారు. పెరిగిన గృహ పొదుపులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం ద్వారా నిర్మాణాత్మక పరివర్తనను వేగవంతం చేయడంపై చర్చలు సాగాయి.

వివిధ రంగాల ఉత్పాదకతకు దోహదపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) పాత్రపైనా సమాలోచనలు జరిగాయి. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ) నిరంతర స్కేలింగ్‌పైనా చర్చించారు. 2025లో వివిధ రంగాలలో తీసుకొచ్చిన సంస్కరణలు, రాబోయే సంవత్సరంలో వాటి మరింత ఏకీకరణ, భారతదేశం తన పునాదులను బలోపేతం చేయడం ద్వారా కొత్త అవకాశాలను తెరవడం ద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా తన మార్గాన్ని కొనసాగించవచ్చని పలువురు ఆర్థిక వేత్తలు ఈ సందర్భంగా ప్రధాని మోడీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో శంకర్ ఆచార్య, అశోక్ కె భట్టాచార్య, ఎన్ ఆర్ భానుమూర్తి, అమితా బాత్రా, జనమేజయ సిన్హా, అమిత్ చంద్ర, రజనీ సిన్హా, దినేష్ కనబర్, బసంత ప్రధాన్, మదన్ సబ్నావిస్, మదన్ సబ్నవీర్, ఉమాకాంత్ దాష్, పినాకి చక్రవర్తి, ఇంద్రనీల్ సేన్ గుప్తా, సమీరన్ చక్రవర్తి, అభిమాన్ దాస్, రాహుల్ బజోరియా, మోనికా హాలన్, సిద్ధార్థ సన్యాల్. మదన్ సబ్నావిస్ అబ్నావీస్‌తో సహా పలువురు ప్రముఖ ఆర్థిక వేత్తలు, నిపుణులు చర్చలో పాల్గొన్నారు.



## కెనడాలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కొత్త కార్యవర్గం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 30:** కెనడాలో స్థిరపడిన తెలంగాణ వాసుల ప్రత్యేక సంస్థ తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరమ్ రానున్న రెండేళ్ల కోసం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. జితేందర్ రెడ్డి గార్లపాటి అధ్యక్షుడిగా, వెంకట్ రెడ్డి పోలు ప్రధాన కార్యదర్శిగా పనిచేయనున్నారు. 2026-27 రెండేళ్ల పాటు ఈ కొత్త కార్యవర్గం పనిచేయనుంది. కొత్త కార్యవర్గంలో ఫౌండేషన్ కమిటీ చైర్ పర్సన్ గా అమిత పినికేశి, ఉపాధ్యక్షుడిగా మహేందర్ కీస్రా, సంయుక్త కార్యదర్శిగా అనికేత్ రెడ్డి శామీర్ పేట, ట్రెజరర్‌గా కృష్ణా రెడ్డి చాడ, జాయింట్ ట్రెజరర్‌గా రవీందర్ రెడ్డి కొండం, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్‌గా కె.మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కెనడాలో స్థిరపడిన తెలంగాణ వాసుల కోసం 2005 లో టీడీఎఫ్ కెనడా సంస్థ ఏర్పాటైంది. తెలంగాణ ఉద్యమ సమయంతో పాటు రాష్ట్రం ఏర్పటయ్యాక కూడా ఈ సంస్థ క్రియాశీలకంగా పని చేస్తోంది. ప్రతీ యేటా తెలంగాణ నైట్ ను నిర్వహిస్తూ అక్కడి తెలుగువారిని ఏకం చేసే ప్రయత్నం చేస్తోంది. తంగేడు అనే అనుబంధ సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండగతో పాటు వివిధ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. కెనడాలో స్థిరపడిన వందలాది మంది తెలుగువారు తమ కుటుం బాలతో ఈ కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా తమ పిల్లలకు తెలంగాణ సంస్కృతీ, సంప్రదా యాలను తెలిపే ప్రయత్నం చేస్తున్నారు. అవసరమైన అన్ని సమయాల్లో సమాజ సేవ కార్యక్రమాలను కూడా విసృతంగా ఈ సంస్థ నిర్వహిస్తోంది.

# గృహ రుణాలకు పెరుగుతున్న దరఖాస్తులు

### బ్యాంకుల వడ్డీ రేట్ల తగ్గింపు

### 'రెడీ టు మూవ్' ఇళ్లకు డిమాండ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఈ యేడాది చివరి త్రైమాసికంలో దేశీయ బ్యాంకింగ్ రంగం గృహ రుణ గ్రహీతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు గృహ రుణాలపై వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గించడమే కాకుండా, ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించాయి. ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు, తక్కువ వడ్డీరేటు, మహిళా రుణ గ్రహీతలకు అదనపు రాయితీలు వంటి వి మధ్యతరగతి ప్రజలను ఇళ్ల కొనుగోలు వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి. బ్యాంకులు ప్రకటించిన ఈ ప్రత్యేక ఇయర్ ఎండ్ ఆఫర్ల ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై స్పష్టంగా కనిపిస్తోంది. గత నెల రోజుల్లో దేశవ్యాప్తంగా మధ్యతరగతి ఇళ్లు అంటే రూ. 40 లక్షల నుండి రూ. 80 లక్షల లోపు అమ్మకాలు 10 శాతం మేర వృద్ధి చెందాయి. సాధారణంగా అద్దె ఇళ్లలో ఉండేవారు, వడ్డీ రేట్లు తగ్గడం వల్ల వచ్చే ఇఎంఐ భారం అద్దెతో సమానంగా ఉంటుందని భావించి సొంత ఇళ్ల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది కేవలం మెట్రో నగరాల్లోనే కాకుండా, టైర్2 నగరాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రియల్ ఎస్టేట్ డెవలపర్లు కూడా బ్యాం కుల ఆఫర్లకు అను గుణంగా తమ విక్రయ వ్యూహా లను మార్చుకు న్నారు. 'రెడీటుమూవ్' ఇళ్లకు డి మాండ్ ఎక్కువగా ఉండటంతో, బిల్డర్లు ఉచిత పార్కింగ్, క్లబ్ హౌస్ మెంబర్‌షిప్ వంటి అదనపు ఆకర్షణలను జోడిస్తున్నారు. బ్యాంకులు నేరుగా ప్రాజెక్ట్ సైట్ల వద్దే లోన్ మేళాలు నిర్వహించడం ద్వారా రుణ మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేశాయి. దీనివల్ల డాక్యు మెంటేషన్ ఇబ్బందులు తగ్గి, కొనుగోలుదారులకు భరోసా కలుగుతోంది. జనవరి వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉండవచ్చని బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్న క్రమంలో గృహ రుణాల కోసం దరఖాస్తులు పెరుగుతున్నాయి. డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా తక్షణ రుణ అనుమతులు లభిస్తుండటంతో, యువ ఉద్యోగస్థులు సైతం ఇన్వెస్ట్‌మెంట్ పరంగా ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

## జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జిఓ 252 సవరిస్తాం

### అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు

### త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు

### టిడబ్ల్యుజెఎఫ్, డిజెఎఫ్‌టి రాష్ట్ర నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించి, తుది జీవోను రిలీజ్ చేస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్‌టీ ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రికి వివిధ అంశాలను వివరించారు. ఇటీవల రిలీజ్ చేసిన జీవో 252 ద్వారా రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇస్తామనే ప్రకటన వారిలో విభజన తెచ్చేలా ఉందని చెప్పారు. ప్రస్తుతమున్న పరిస్థితులలో డెస్క్ జర్నలిస్టులు కూడా ఫీల్డ్ వర్క్ చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ జీవోతో జర్నలిస్టులకూ భారీగా అక్రిటేషన్లు తగ్గే అవకాశం ఉందని, మహిళా కోటాను పునరుద్దరించాలని మంత్రి దృష్టికి ఫెడరేషన్ నేతలు తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి.. జీవోపై కొంతమంది అపోహలకు గురిచేలా ప్రయత్నం చేస్తున్నారనీ, వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని చెప్పారు. జర్నలిస్టులను రెండు భాగాలుగా చూడాలన్న ఆలోచన కాదనీ, ప్రభుత్వ పరంగా అందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని వెల్లడించారు. అర్హులైన జర్నలిస్టులకు మేలు చేయాలన్న సంకల్పంతో తీసుకున్న నిర్ణయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మినహా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే అన్ని జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి డెస్క్ జర్నలిస్టులనూ ఆహ్వానిస్తామని తెలిపారు. అందరి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకొని జర్నలిస్టులకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు.

# భారీగా పెరిగిన కూరగాయల ధరలు

### కిలో రూ.80 నుండి 100కు చేరిన రేటు

### చలి తీవ్రతతో 70 శాతం తగ్గిన దిగుబడి

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ప్రస్తుత వాతావరణం కూరగాయల తోటలకు ప్రతికూలంగా మారింది. ఈసారి ఉత్తరాది ప్రాంతాలను తలపించే విధంగా చలి పంజా విసురుతోంది. ఈ చలి తీవ్రతతో దిగుబడి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా లేక రాష్ట్రంలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. సాధారణంగా కూరగాయలు అధికంగా పండే ఈ సీజన్‌లో రూ.50 నుంచి రూ.60 కు కిలో దొరికేవి. దిగుబడి తగ్గిపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఏ కూరగాయలైనా కిలో రూ.80 పైబడి సెంచరీ ధర పలుకుతున్నాయి. ఆకు కూరలకు కూడా రూ.60 నుంచి రూ.80 వెచ్చించాల్సి రావడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్‌లో వినియోగదారులకు ఒక్కో రోజుకు కనీసం రూ.200 వెచ్చిస్తే తప్ప కూరగాయల అవసరాలు తీరడం లేదు. సాధారణంగా ఈ సీజన్‌లో అన్ని కూరల్లో వాడే టమాట కిలో రూ.20 నుంచి రూ.30 మించేది కాదు. బీర, బెండ, కాకర, చిక్కుడు కూరగాయలు అన్నీ ఇప్పుడు రూ.80 నుండి రూ.100కు పైగా అమ్ముతున్నారు. ఒక్కో సోరకాయ ధర రూ.40, పచ్చిమిర్చి రూ.100 కు కిలో అమ్ముతున్నారు.

కాగా చలి కారణంగా పిందె దశలోనే రాలిపోవడం, ఆకులు నల్లబడి పోవడం, పూత రాలిపోవడంతో కూరగాయల దిగుబడి తగ్గుతున్నది. మొక్కల ఆకులు పెలుసుబారి నల్లబడి దిగుబడి తగ్గిపోతున్నది. ప్రతీ సీజన్‌లో ఎకరానికి 15 టన్నుల కూరగాయల దిగుబడి వస్తుంటాయి. అయితే ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఎకరాకు మూడు టన్నుల నుంచి నాలుగు టన్నుల దిగుబడి మాత్రమే వస్తుంది. చలి అధికంగా ఉండడంతో 70 శాతం దిగుబడి తగ్గింది. ఎకరం పొలంలో బీర పంట సాగు చేస్తే రోజు తప్పించి రోజు క్వింటాల్ కన్నా ఎక్కువే కోతకు వచ్చేవని రైతులు అంటున్నారు. ఇప్పుడు 50 కిలోలు మాత్రమే వస్తున్నాయని, 200 వరకూ వచ్చే సోరకాయలు చలి తీవ్రతతో ఇప్పుడు 80 వస్తున్నాయని చెబుతున్నారు. అలాగే టమాట వారానికి 50 బాక్సులు వస్తుండగా, ప్రస్తుతం 20 బాక్సులు రావడం కష్టంగానే ఉందని వాపోతున్నారు. చలికి పొగమంచు మిర్చి, బెండ, కాకర, బీర, కీరదోస ఆకుల మీద పడడంతో మొక్కలకు భూమినుంచి పోషకాలు తగిన మోతాదులో అందడంలేదు. దీంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోయిందని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇలా దిగుబడి తగ్గడంతో కొన్నిచోట్ల కూరగాయల పంటను పూర్తిగా తీసివేస్తున్నారు.

అంతరంగపు ఓటమి తప్పితే, మరెలాంటి ఓటమి లేదు. ఉద్దేశపరమైన అంతరంగిక బలహీనత తప్ప మనం దాటలేని అడ్డంకులంటూ ఏమీ లేవు.

-ఎమర్సన్

# పతనం అంచుకు ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది కోట్లురూపాయలు ఖర్చుచేశారు. చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ప్రజలను అనారోగ్యం భారి నుండికాపాడేందుకు శ్రమిస్తేకు కృషి చేస్తూనే ఉన్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్యనిపుణులని కూడా నియమించారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గురించి రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. స్వాతంత్య్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికీ కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగాచెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి.ముఖ్యంగా గిరిజనప్రాంతాల్లో నేటికీస్వాతంత్య్రం పూర్వం ఉన్న పరిస్థితిని గుర్తు తెస్తున్నాయి. ఇప్పటికీ దారుణ్యేక డోలీ కట్టుకుని రోగులను మోసుకుపోవాల్సిన పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నారు. సకాలంలో వైద్యసహాయం అందక ఎందరు మరణిస్తున్నారో లెక్కలే అందవు. ఇక వ్యాధులు కూడా రకరకాలుగా విస్తరిస్తున్నాయి. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూ వీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పుడూ తలవంచుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు, చికిత్సలు, ఆధునిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపుస్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగ పీడితులుగా మారుతుంటే లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా బారినపడినవారు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకున్నారు.ఇటీవల గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయస్సుతో సంబంధం లేకుండా పదిహేళ్ల వయసు నుంచి అరవైయేళ్ల వరకు గుండెపోటుకు గురై క్షణాల్లో మరణిస్తున్నారు. అయితే ఇందుకు కరోనా నివారణ మందులు కారణమనే ప్రచారాన్ని తాజాగా ఢిల్లీలోని వైద్యనిపుణుల బృందం తోసిపుచ్చింది. ఈ గుండెజబ్బులకు ఆ మందులకు సంబంధం లేదని అధ్యయనంలో తేలినట్లు వారు స్పష్టంచేశారు. దీంతో ఈ జబ్బులు ఎందుకు ఎక్కువ అవుతున్నాయనేది అర్థంకాకుండా పోతున్నది. అయితే మారిన, మారుతున్న అలవాట్లు, కాలుష్యం లాంటివి ఎన్నోకారణాలు ఉండవచ్చుననే ఊహాలు వెలువడుతున్నాయి. ఇదికాక దోమల నుండి వస్తున్నవ్యాధులు అన్నీఇన్నీకావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఇంకొకపక్క చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తున్నది. పాలకులు చేస్తున్న ప్రయత్నాలు దీన్ని నివారించలేకపోతున్నాయి. చికిత్స ఉన్నా సకాలంలో ముఖ్యంగా ప్రారంభదశలో ఈ వ్యాధిని గుర్తించగలిగితే నియంత్రించగలుగుతున్నారు. కానీరెండు, మూడు దశలు దాటిపోతే పరలోకానికి పయనం కట్టాల్సిందే. వీటన్నింటి కంటే మించి రకరకాల కారణాలతో కిడ్నీవ్యాధులు ఊహించనిరీతిలో విస్తరిస్తున్నాయి. డయాలసిస్‌కు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసినా అవి అవసరానికి తగినంతగా లేవు. కిడ్నీమార్పిడి అనేది సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందనే చెప్పొచ్చు. ఇలా రకరకాల వ్యాధుల విస్తరణతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేట్ దవాఖానాలు కూడా కిటకిటలాడిపోతున్నాయి. అయితే వ్యాధివచ్చిన తర్వాత చికిత్స కంటే రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం అందరూ డాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు వైద్యరంగ నిపుణులు శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటినుంచో చెప్తున్నారు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? అందుకు కారణాలేమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలను పరిశీలించాల్సిన తరుణమిది. రోగ నిరోధకశక్తి ఒక్కరోజులోనో, వారంలోనో, నెల రోజుల్లోనో పెరిగేదికాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటిస్తున్నవారు భారత్‌లో కోట్లాది మంది ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలావస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? మద్యపానం లాంటి కొన్ని విధానాలు కూడా ప్రజారోగ్యానికి హాని చేస్తున్నాయి. ప్రజాసంక్షేమమే ధ్యేయమని పదేపదే చెప్పుకునే పాలకులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జనచేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. అలాగే ప్రజారోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై మాత్రమే వదలకుండా ప్రజలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలి.

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.



తిరుక్కురళ్

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏ చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

# వ్యక్తిగత స్వేచ్ఛకు కట్టుబాట్లు అవసరం

మగవారికైనా, ఆడవారికైనా విచ్చల విడితనం తప్పు. అదిసమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మనస్తత్వంతో చేసే వాదన కాదు. మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడానికి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి.'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ'అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా? సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వ్యస్త్రధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామాజిక సంస్కృతిలో భాగం.భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం,వ్యక్తిత్వ వికాసం.అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేద కాదు సామాజిక బాధ్యత.



నునుబోలు రాజశేఖర్

ఇటీవల ఒక సినిమా వేడుకలో 30 ఏళ్లుగా సినీ పరిశ్రమలో అనుభవం ఉన్న ఒక వట్టి సినిమా కథానాయికల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు అన్ని సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్ ఛానళ్లలో విశేషమైన చర్చకు అంశాలుగా మారాయి. సామాన్యుల నుంచి ప్రముఖ విశ్లేషకుల వరకు ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు వివిధ కోణాల్లో తమ అభిప్రాయాలనుసామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తపరుస్తున్నారు. అయితే, కొందరు ప్రముఖులు తమ వాదనలో ఎటువంటి ప్రామాణికత నిర్మాణాత్మకత లేకపోయినా, వస్త్రధారణపై తమ వ్యక్తిగత అభిప్రాయాలను సమాజంపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీ,పురుషులు వస్త్రధారణ ఎలా ఉండాలి అనే అంశంపై స్పష్టత అవసరం. లేకపోతే భావితరాలకు ఒక తప్పుడు సందేశం వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే వస్త్రధారణ మూలాలతోపాటు చర్చించి, వస్త్రధారణ విషయంలో నిజాన్ని నిర్భయంగా సమాజానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. సమాజంలో మనిషి హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జీవించాలంటే కొన్ని కట్టుబాట్లు తప్పనిసరిగా ఉండాలి. మనిషి దిగంబరుడిగా, అనాగరికతతో జీవించే పాత రాతి యుగం నుండి వస్త్రాలు తయారు చేసి, తన శరీరాన్ని పూర్తిగా కప్పుకొని మంచి భాషను నేర్చుకొని నాగరికుడిగా మారిన క్షణంతోనే మానవుని అభివృద్ధి ప్రారంభమైంది. మానవ అభివృద్ధి ప్రారంభమైన కాలాన్నే నాగరిక యుగంగా పిలుస్తారు. ఆ నాగరిక యుగం నుండి మన పూర్వీకులు అవలంబించి మనకు అందించిన సంప్రదాయాలు, కళారూపాలు, భాషసంభాషణ, ఆచరణలు, విలువలు అన్నీ మన సంస్కృతిగా రూపొందాయి. మనిషి కట్టు, బొట్టు, నడవడిక, ప్రవర్తన అన్నీ మనం మన రక్షణకోసం నిర్మించుకున్న సంస్కృతిలో భాగాలే. వస్త్రధారణ కూడా మన సంస్కృతిలో భాగమే. అంతేకాదు, మనిషి వ్యక్తిత్వ వికాసంలో వస్త్రధారణ కూడా ఒక ముఖ్యమైన అంశమే. చేసే వృత్తిని బట్టి, చదివే విద్యను బట్టి, వెళ్లే ప్రదేశాన్ని బట్టి కూడా మన వస్త్రధారణలో మార్పులు చేసుకుంటూ ఉంటాం. ఎందుకంటే మనం ధరించే వస్త్రాలు మన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఏ రకమైన వస్త్రాలు ధరించాలి అన్నది ప్రాంతాన్ని బట్టి, కుటుంబాన్ని బట్టి మారుతుంటుంది. అయితే ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే శరీరాన్ని, సిగ్గును కాపాడే విధంగా వస్త్రాలు ధరించడమే ప్రధానమైనది. అది ఏ రకమైన వస్త్రమైనా కావచ్చు. వస్త్రధారణ స్వేచ్ఛకు సంబంధించిన విషయం కాదు. అది సమాజ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. మనిషి వ్యక్తిత్వంలోనూ, సమాజ సంస్కృతిలోనూ ఎంతో కీలకమైన స్థానమున్న వస్త్రాలను నిండుగా ధరించకుండా సమాజంలో తిరగటం స్వేచ్ఛ కాదు. అది ఒక అనాగరిక చర్య. ఇది మళ్లీ నాగరిక ప్రపంచం నుండి మనిషిని అనాగరిక ప్రపంచంవైపు తీసుకెళ్లే ప్రమాదకరమైన వాదన. స్త్రీలపై జరిగే అకృత్యాలకు వస్త్రధారణే కారణమని కచ్చితంగా చెప్పలేము ఎందుకంటే, చాలీచాలని వస్త్రాలు ధరించిన మహిళలపైనే కాదు, సరైనరీతిలో వస్త్రాలు ధరించిన మహిళలపై కూడా లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్నాయి. ఇలాంటి అకృత్యాలకు పాల్పడేవారు మానవత్వాన్ని మరిచి మృగాల్లా ప్రవర్తించే సామాజిక ద్రోహులు. అలాంటి వారిపై ప్రభుత్వాలు కఠిన శిక్షలు విధించాలి. విధిస్తున్నాయి కూడా. అయితే, వస్త్రధారణ ఎలాఉన్నా అకృత్యాలు జరుగుతున్నాయనే కారణంతో మాకు నచ్చినట్లు వస్త్రాలు ధరిస్తాం అనే వాదన చేయడం సమంజసం కాదు. ఇంటికి తాళం వేసినా కూడా దొంగతనాలు జరుగుతున్నాయని, ఇంటికి తాళం వేయడం మానేస్తామా? తాళం వేసిన ఇంటిలో దొంగతనాల శాతం తక్కువగాఉంటుంది. తాళంవేయని ఇంటిలో దొంగతనాల శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మన ఇంటికి తాళం వేసి ముందు జాగ్రత్త ఎలా తీసుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత జాగ్రత్త అవసరం. సమా జంలో పలుకుబడి, రక్షణ వలయాలు ఉన్న స్త్రీలు ఎటు వంటి వస్త్రధారణ చేసిన వారికి భద్రత ఉంటుంది. వారిని చూసి సామాన్యులు కూడా అలాంటి వస్త్రాలను ధరించి సమాజంలో తిరిగితే ప్రతి ఆడపిల్లకు అలాంటి రక్షణ ఉండదు. ప్రభుత్వాలు సైతం ఎంతమందికి రక్షణ కల్పించగలుగుతాయి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రతి ఆడపిల్ల తన వ్యక్తిగత భద్రతకోసం సమాజానికి అనుగుణంగా, సరిగ్గా వస్త్రాలను ధరించడం ఒక ప్రాథమిక జాగ్రత్త. ఇది నింద కాదు, బాధ్యత. దుష్ట ఆలోచనతో చూసే దృష్టిని మార్చుకోవాలి అన్నది నిజమే కానీ విశ్లేషణ వేదికలపై కూర్చొని చెప్పే ఇలాంటి సందేశాలతో వెంటనే దుష్ప్రభావాలను, వారి దుగ్ధ ఆలోచనలను మార్చలేం. అందుకే సంస్కారవంతులైన మనమే జాగ్రత్తగా ఉండాలి. 'చూసేవారి దృష్టే తప్పు' అనే వాదంతో మాత్రమే ముందుకు వెళ్లలేం. ఎందుకంటే సమాజంలో మంచిఉన్నట్లే చేదు కూడా ఉంది అనే సత్యాన్ని మనం మర్చిపోవద్దు. సమాజంలోస్త్రీకి అత్యంత ఉత్తమమైనస్థానం ఉంది. అందుకే అలాంటి స్త్రీ వస్త్రధారణపై ఒక్కోక్కసారి ఇలాంటి చర్చలు జరుగుతూ ఉంటాయి. అది స్త్రీ మీద ఉన్న అపారమైన గౌరవంతోనే తప్పా అగౌరవంతోకాదు అని అర్థంచేసుకోవాలి. భారతీయ స్త్రీ కట్టు, బొట్లు, ప్రవర్తన, సంస్కారం ప్రపంచ దేశాలకు ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శమే. భారతీయ మహిళలలో సుమారు95శాతం మంది గొప్ప వస్త్ర సంస్కృతిని పాటిస్తున్నారు. మిగిలిన ఐదుశాతానికి సంబంధించిన వారితోనే సమస్యలు కనిపిస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలోని తల్లిదండ్రుల పెంపకం, విద్యావ్యవస్థలో అందించే విద్యలోని లోపాలుకూడాఇందుకు కారణాలు. ఒక వ్యక్తి మంచి పౌరుడిగా లేదా అసాంఘిక శక్తిగా మారడం వెనుక అతడు పెరిగిన వాతావరణం, పొందిన విద్యకీలక పాత్ర పోషిస్తాయి. చిన్ననాటి నుంచే పిల్లలకు క్రమశిక్షణ, బాధ్యత, మానవీయ విలువలు నేర్పించడంలో తల్లిదండ్రులు, విద్యావ్యవస్థ విఫలమైతే, సమాజానికి హానికరమైన వ్యక్తులు తయారవుతారు. తల్లిదండ్రులు పిల్లలను స్వేచ్ఛపేరుతో నియంత్రణ లేకుండా పెంచడం, తప్పులను సరిదిద్దకుండా కప్పిపుచ్చడం, తప్పు చేసినా సమర్థించడం, అనే పెంపకంలోని లోపాలు పిల్లల్లో చిన్నప్పుడే అసాంఘిక ఆలోచనలకు బీజంవేస్తుంది. అందుకే అసాంఘిక శక్తులను అరికట్టాలంటే శిక్షలతోపాటు బాధ్యతాయుత మైన తల్లిదండ్రుల పెంపకం అవసరం. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమేకాదు. నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చే ప్రక్రియకూడా. వస్త్రధారణ మన సంస్కృతిలో, వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన భాగమే. సమాజానికి హానిచేసే ఏపనైనా నా స్వేచ్ఛలోకిరాదు. చలి నుంచి,ఎండ నుంచి, దుమ్ముధూళి నుంచి మనల్ని రక్షించేది. మన సిగ్గును కాపాడేదిసరైన వస్త్రధారణే. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించేదుస్తులనే వేసుకోవాలి. సమాజంలో మన మందరం హాయిగా, ఆనందంగా,సురక్షితంగా జీవించాలంటే స్త్రీ పురుషులు ఇద్దరూ తమపరిధులకులోబడి కట్టుబాటుతో జీవించాలి. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి తన వ్యక్తిత్వాన్ని కోల్పో కూడదు.సమాజ శ్రేయస్సు కోసం సరైన రీతులో వస్త్రాలుధరించండని చెప్పడం ఏ మాత్రం తప్పుకాదు. ఒక సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలిగితే అందులో మనం, మన కుటుంబంహాయిగా జీవించగలుగుతుంది. మగవారికైనా,ఆడ వారికైనా విచ్చల విడితనం తప్పు. అది సమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మన స్తత్వంతో చేసే వాదన కాదు.మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడాని కి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా,పురుషుడైనా సభ్యసమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి. 'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ' అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా?సమాజ కట్టు బాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వస్త్రధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామాజిక సంస్కృతిలో భాగం. భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం,వ్యక్తిత్వ వికాసం.అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకాదు సామాజిక బాధ్యత. ●



# కొంపముంచుతున్న ఆన్‌లైన్ గేమ్స్

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్య కాలంలో మీడియాలో వచ్చిన ఒక వార్త తీవ్ర ఆందోళనకు కలిగించేలా వుంది. అదేమిటంటే ఒక ఆన్‌లైన్ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మరీ ఆడిన డిగ్రీ చదువుతున్న విద్యార్థి ఏకంగా ఏదోఅవసరం నిమిత్తమై తమ తల్లిదండ్రులు తన ఖాతాలోకి బదిలీ చేసిన 95 లక్షల రూపాయలను పోగొట్టుకున్న తీరును చూస్తుంటే ఈ సమాజంలోని యువత ఎలా చెడు,వక్రమార్గంలో పయనిస్తున్నారో ఇట్టే ఊహించవచ్చు. అంతేకాదు ఈ బాధాకరమైన సంఘటనకు కేవలం ఆ విద్యార్థిని ఒక్కడినే బాధ్యున్ని చేయలేం. ఎందుకంటే ఈ సంఘటనలో తమ పిల్లల అలవాటును పసిగట్టలేక అత్యంత నిద్రాణావస్థలో కూరుకుపోయి, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన వారి తల్లిదండ్రుల ఘోర తప్పిదం కూడా అందులో దాగి వుంది. ముఖ్యంగా చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే కన్నా ముందుగానే మేల్కొని ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహారశైలిపై,వారి అలవాట్లపై ఎల్లవేళలా ఒక కన్నేసి ఉంచాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఊహకు కూడా అందనంత రీతిలో టెక్నాలజీ తుఫాన్ వేగంతో కొత్త పుంతలు త్రొక్కుతున్న నేపథ్యంలో ఒక వైపుఅలాంటి టెక్నా లజీ మన దేశాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, మరోవైపు విద్యార్థుల ఉజ్వల భవితకు, ఎదుగుదలకు ఒక శనిలా, శాపంలా ఆన్‌లైన్ గేమ్‌ల రూపంలో ఈ టెక్నాలజీ మాయ పరిణమించడం అత్యంత దురదృష్టకరమైన విషయం. కాబట్టి ఇప్పటికైనా మించిపోయింది లేదు ఆలస్యం అమృతం విషంలాగా పరిస్థితి తలెత్తకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల, ముఖ్యంగా వారి స్నేహితుల విషయంలో అత్యంత జాగరుకతతో వ్యవహరించాలి. తమ పిల్లలు మంకు పట్టు పడుతున్నారనో, వారికి బోర్ కొడుతుందనో వారి చేతికి పొరపాటున స్మార్ట్ ఫోన్ అందించి చేతులు దులుపుకున్నారు అంటే మాత్రం మున్ముందు భారీ మూల్యం చెల్లించక తప్పదు అనే విష యాన్నీ ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వివేకం తో,పరిణతితో ఒక్కసారి ఆలోచించాలి. ఎలాగంటే ఈ పాటికే స్మార్ట్ ఫోన్‌ల వల్ల విద్యార్థులు ఎంతగా తమ చదువు సంధ్యలను, జ్ఞానాన్ని కోల్పోతున్నారో, ఎలా ఏ రీతిలో వారి అమూల్యమైన జీవితాలను భ్రష్టుపట్టించుకుం టున్నారో అందుకు సంబంధించి ఇటీవల మీడియాలలో వచ్చిన పలు వార్తలు మన కళ్లముందు సాక్షాత్కరిస్తూనే వున్నాయి అనేది ఎవరు కాదనలేని జగమెరిగిన సత్యం. ఏదిఏమైన ఇదివరకటి కంటేకూడా విద్యార్థుల తల్లిదండ్రు లు తమ పిల్లల నడవడికపై, వారి తీరు తెన్నులపై గట్టి నిఘాను పెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. తమ పిల్లలను నిరంతరం కనిపెట్టుకొని ఉండటం కోసంవిద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఎన్ని పనులు, బాధ్యతలు ఉన్నప్పటికీ వాటిని కాస్త ప్రక్కకు పెట్టి పిల్లల ఎదుగుదల కోసం, వారి ఉజ్వల భవిష్యత్ కోసం రోజులో కనీసం కొంత సమయాన్ని వారికి కేటాయించక తప్పని పరిస్థితి. నేటి పిల్లలే రేపటి బాధ్యతగల పౌరులుగా నిలిచి ఈ యావత్తు దేశ ప్రజలు మెచ్చేలా నిలువాలంటే మాత్రం ఈ ఆన్‌లైన్ గేమ్‌ల వాసన కూడా తమ పిల్లల దరిచేరకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త వ్యవహరించాలి. ఫోన్‌లను అందుబాటులో లేకుండా చూసుకోవాలి. ●

# ప్రజావాక్కు



## ఆరావళి పై ఉండాల్సిన ఆలోచనా సరళి

ఆరావళి ప్రాంతంలో ఏయే గుట్టలు,పర్వతాలు ఆరావళి శ్రేణిగా నిర్వచించబడతాయో అన్న సందిగ్ధతకు సుప్రీం కోర్టు తాత్కాలిక బ్రేక్ వేయడం ముదావహం. గతంలో ప్రభుత్వ ప్రతిపాదనకు తానుఅంగీకరించి, ఇచ్చిన ఆదేశం పైతానే నేడు స్టేఇచ్చి విజ్ఞత చూపింది.ఆరావళి శ్రేణి అతి పురాతన పర్వతాల,గుట్టల వరుస. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు,నాలుగు రాష్ట్రాల్లో,37 జిల్లాల్లో వ్యాపించి ఉత్తర భారతానికి రక్షణ గోడగా నిలిచాయి.ఆ శ్రేణి వల్ల థార్ ఎడారి తూర్పుదిశగా వ్యాపించడంలేదు.ఇసుక తుఫాన్లకు అడ్డుగోడ. ఆయా రాష్ట్రాలకు నీటి ఎద్దడి రానీయకుండా భూగర్భాన్ని రీ ఛార్జ్ చేస్తున్నాయి. పచ్చదనం నిండుగా ఉండి ఉత్తర భారతానికి ఊపిరితిత్తులుగా పిలవబడుతున్నాయి.అలాగే ఆప్రాంతంలోవిలువైన ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. గనుల తవ్వకాలకు అనుమతుల విషయ మై ఆరావళి శ్రేణి ప్రాంతం అనేక నిర్వచనాలకు గురవుతుంది. అందులో ఒకటి అధికారికమైంది.

- డా.డి.వి.జి. శంకరరావు,పార్వతీపురం

## డిజిటల్ నేరస్తులు

ఈమధ్యన సైబర్‌నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంతసొమ్మును విడతల వారీగా స్థంభింప చేస్తున్నారు. ఆ డబ్బు ఎక్కడికీపోదు. కాకపోతే సైబర్ నేరాలకు సంబంధించిన డిపార్టుమెంటు వారు పరిశీలించి విడుదల చేస్తేనేకాని ఖాతాదారునికి చెల్లింపబడదని బ్యాంక్ వారు సమాధానం ఇస్తున్నారు.ఇలా ఎన్నినెలలు కాలాయాపన చేయాలి.ఈలోగా ఖాతాదారుల జీవనం ఎలా?దేశంలో 8000కోట్లరూపాయల పైన డిజిటల్ నేరస్తుల గుప్పిట్లో ఉన్నాయనివార్త. కేంద్రం సత్వరచర్యలు తీసుకొనక పోతే ఖాతాదారులు మరింతఇబ్బందులు పడవలసి వస్తుంది.

- డా. ఎన్. ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## మార్చాల్సింది సమాజ దృక్పథాన్ని

అమ్మాయి రక్షణ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ, బాధ్యులను బోనులో నిలబెట్టాల్సింది పోయి బాధితురాలి రంగు, శరీరం, ఆమె ధరించిన దుస్తుల గురించి ప్రస్తావించడం ఒక అనాగరిక సంప్రదాయంగామారిపోయింది.అమ్మాయి సురక్షితంగా ఉండాలంటే పద్ధతిగా ఉండాలి అని సుద్దులు చెప్పే మేధావుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అసలు రక్షణకు,దుస్తులకు ముడి పెట్టే ఈ కుసంస్కృతి ఇంకెంత కాలం కొనసాగుతుందనేది నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న. వ్యక్తుల ప్రవర్తనను ప్రశ్నించకుండా, బాధితుల వేషధారణను విమర్శించడం అంటే పరోక్షంగా నేరాన్ని సమర్థించడమే అవుతుంది. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సినీరంగం నేడు మహిళల పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి అత్యంత ఆందోళనకరం. ఒకప్పుడు మహిళా పాత్రలను ఎంతో గౌరవప్రదంగా, స్ఫూర్తిదాయకంగా చిత్రించిన వినోదరంగం, రానురాను వారిని కేవలం గ్లామర్ వస్తువులుగా మార్చేసింది.

- దిడ్డి శ్రీకాంత్, జమ్మికుంట, కరీంనగర్

## గ్రామీణ వ్యవస్థలోనే భారతదేశ ఆత్మ

ఎన్ని శాస్త్ర సాంకేతిక పద్ధతులు వచ్చినా భారత దేశం ఆత్మ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలోనే ఉంది. తెలంగాణను సీడ్ హబ్‌గా తయారు చేయొచ్చు. అందుకే ఇప్పుడు గ్రామాలలో వివిధ పంటల విత్తనాలను పండించి కంపెనీలకు అమ్ముతున్నారు. ఇది ఒక రకంగా తెలంగాణ రైతులలో వచ్చిన అవగాహన ఫలితం. అయితే ఒక్క తెలంగాణకు మాత్రమే ఎందుకు పరిమితం కావాలి. కేంద్రం పూర్వోదయా ప్రణాళికను అమలుచేసినట్లు భూ పరివేష్టిత ప్రణాళికను అమలు చేయదు అనేది అసలు ప్రశ్న. భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉండే సౌలభ్యం మూలంగా కూడా ఈ ప్రణాళిక అమలు అవసరం.

- భారత అవినాష్, జనగామ

## వాక్ స్వేచ్ఛ.. అవగాహనకు దారితీసే సాధనం

మనరాజ్యాంగంలోని అనుచ్ఛేదం19(1)(ఎ) ప్రకారం ప్రతి పౌరునికి వాక్ స్వేచ్ఛ హక్కు కలదు. అయితే అనుచ్ఛేదం 19(2) ప్రకారం, ఆ స్వేచ్ఛ ప్రజా శాంతి, నీతి,మర్యాద, ఇతరుల గౌరవం దెబ్బతీయకుండా ఉండాలి. వాక్ స్వేచ్ఛ అంటే మనం ఇష్టం వచ్చినట్లు మాట్లాడే హక్కు కాదు.అది నిజాన్ని బాధ్యతతో వ్యక్తపరచే జ్ఞానం.వ్యంగ్యం అవమానంకాదు, అవగాహనకు దారి తీసే సాధనం కావాలి.

- వీరగంటి భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాఠాలు, గుణపాఠాలతో మరో వత్సరంలోకి..



సుంకవల్లి సత్తిరాజు

కొన్ని చేదు జ్ఞాపకాలు,మరికొన్ని మధురమైన అనుభూతులను మిగిల్చి 2025 కాలగర్భంలో ఒదిగిపోతూ,కొన్ని పాఠాలను, గుణ పాఠాలను నేర్పి, 2026 నూతన సంవత్సరానికి జన వాహినిలో చోటు కల్పిస్తూ, సెలవంటూ వీడ్కోలు తీసుకుంది.2025 సంవత్సరంలో కూడా ప్రపంచంలో అనేక దేశాలు ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు గర్జించి, పెను పిడుగులు కురిపించాయి. భారత్‌లో జరిగిన పహల్గాం సంఘటన భారత్, పాక్‌ల మధ్య పెను సంఘర్షణకు దారితీసింది. భారత్ సైనిక, ఆయుధ సామర్థ్యం ముందు పాక్ నిలువలేక శరణుజొచ్చి, అమెరికా చెంత పాదాక్రాంతమై, బేలగా విలపించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌వలన కేవలం పాకిస్థాన్ మాత్రమే కాదు,అమెరికా, చైనా లాంటి దేశాలు కూడా భారత ఆయుధ, సాంకేతిక, సైనిక సామర్థ్యాన్ని చూసి ఉలిక్కిపడ్డాయి. ఎప్పటి మాదిరిగానే రష్యా భారత్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. రష్యా ఆయుధాలు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడమే కాకుండా పాక్ క్షిపణులను,యుద్ధ విమానాలను గగన తలంలోనే తునాతునకలు చేయడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అప్పటివరకు భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్న అమెరికా ఉలిక్కిపడి, ఉగ్రవాద దేశమైన పాక్‌కువంత పాడుతూ భారత్‌ను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ ప్రపంచం దృష్టిలో చులకన కావడం జరిగింది. ప్రపంచ దేశాలు ఆయిల్ సంక్షోభం ఎదుర్కొంటున్న తరుణంలో భారత్‌కు కారు చౌకగా రష్యా ఇబ్బడిముబ్బడిగా చమురు సరఫరా చేయడాన్ని అమెరికా జీర్ణించుకోలేక, ఓర్వలేనితనంతో భారత్‌పై అకారణంగా వాణిజ్య సుంకాలను పెంచి, టారిఫ్ వార్ కొనసాగిస్తూ, భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని యత్నిస్తున్నది. అమెరికాను పట్టించుకోకుండా భారత్ రష్యాతో స్నేహం కొనసాగించడం ట్రంప్‌కుమింగుడు పడడం లేదు. సింధు జలాల నిలుపుదలతో పాక్ ఎడారిలా మారే అవకాశమున్నా, ప్రజల ఆకలి కేకలను పట్టించుకోకుండా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పావులు కదపడం, భారత్‌పై కక్షతో బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టి,చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తూ,ఇస్లామిక్ ర్యాడికల్ తీవ్రవాదులతో కలిసి, బంగ్లాదేశ్‌లో స్థిరబడిన భారత జాతీయులను హింసకు గురిచేయడం అత్యంత పాశవికమైన చర్య. అవామీ లీగ్ పార్టీని ఎన్నికల బరిలో లేకుండా చేయడానికి ప్రయత్నించిన ఒక మతోన్మాద "ఇంక్విలాబ్ మంచా" నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యకు ప్రతీకారంగా బంగ్లాదేశ్‌లోని భారతీయులను ఊచకోత కోయడం దానవ సంస్కృతికి అద్దం పడుతున్నది. అవామీ లీగ్ పార్టీని వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనీయకుండానిషేధిం చడంవలన షేక్





హసీనా ప్రత్యర్థి బేగం ఖలీదా జియా కుమారుడు తారీఖ్ రహ్మాన్ ఈఎన్నికల్లో విజయం సాధించడం కేవలం లాంఛన ప్రాయమే. ఎన్నికలు జరిగే వరకు బంగ్లాదేశ్‌లో చెలరేగిన మంటలు ఆగునా? బంగ్లాదేశ్ ఉద్యమాలు ఎగదోస్తున్నదెవరు? పాక్, బంగ్లాదేశ్‌లలోని పరిస్థితులు ఇలా ఉండగా, ఆఫ్ఘానిస్థాన్ పాక్‌పై దాడులుచేస్తూ,పాక్ పాలకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇదిలా ఉండగా, ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య తీవ్రమైన సంఘర్షణలు జరిగి, ప్రపంచాన్ని భయ భ్రాంతులకు గురిచేసాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమంలో ఎంతోమంది బలైపోయారు. గాజాలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఉక్రెయిన్, రష్యాల మధ్య సంవత్సరాల తరబడి సాగుతున్న యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన సైనికులు,పౌరులు లక్షల సంఖ్యలో మరణించారు.అయినప్పటికీ ఈ రెండు దేశాలమధ్య మారణహోమం ఆగడం లేదు. 2025ను యుద్ధాల సంవత్సరంగా భావించాలి.ఇక భారత్ విషయానికొస్తే సౌదీ అరేబియా నుండి 11వేలకు పైగా భారతీయులను బహిష్కరించడం దురదృష్టకరం. భారతీయులను వివిధకారణాల రీత్యా వెనక్కిపంపడంలో ప్రపంచంలో సౌదీ అరేబియా, అమెరికా దేశాలు మొదటి, రెండుస్థానాల్లో ఉన్నాయి. భారతీయుల బహిష్కరణ అంశంపై సౌదీ అరేబియా అత్యుత్సాహం ప్రదర్శించడంపై భారత్ దృష్టిసారించాలి. అమెరికా టారిఫ్‌వార్ కొనసాగిస్తున్నా, భారత్ నాల్గవ ఆర్థికవ్యవస్థగా ఎదగడంశుభసూచకం. అయితే అమెరికా డాలర్ విలువ పెరిగి, రూపాయి విలువ క్షీణించడం ఆందోళనకరం. దేశంలో సర్‌వివాదం కొనసాగుతూనే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో హింసా కాండ ఫలితం రాబోయే ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారానికి మంగళం పాడే సూచనలు కనిపిస్తున్నాయి.2025జూన్ నెలలో అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలు దేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ దశలోనే కూలిపోయి, సుమారు260మంది ప్రయాణీకులు మరణించిన సంఘటన అత్యంత విషాదాన్ని మిగిల్చింది.ఈ ప్రమాదంలో ఒకే ఒకవ్యక్తి మృత్యుంజయుడై బయటపడడం విశేషం. ఇక తెలుగురాష్ట్రాల రాజకీయాల్లో విమర్శలు, వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.రెండేళ్ల మౌనం తర్వా త కె.సి.ఆర్ ఫాం హౌస్‌ను వీడి రేవంత్ సర్కార్ పై విరుచుకుపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల కోసం విస్తృత ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమరావతిలో అడుగుపెట్టాయి. మెడికల్ కాలేజీల విషయంలో వై.సి.పి పోరుబాటలో పయనిస్తున్నది. పాలక కూటమిపై వై.సి.పి రప్పా రప్పా అంటూ వివాదాస్పద నినాదాలతో 2029 ఎన్నికల్లో విజయం కోసం రణనినాదం చేస్తున్నది. రాజకీయాలు హుందాగా నడపడానికి కేంద్రం,ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలి. 2025వ సంవత్సరంలో ప్రపంచ పరిణామాలు బాధను, అసంతృప్తిని మిగిల్చాయి. కాలగర్భంలో కలిసిపోతున్న 2025వ సంవత్సరపు చేదు జ్ఞాపకాలు పునరావృతంకాకుండా కొంగొత్త ఆశలతో అడుగిడుతున్న నూతన సంవత్సరం 2026 ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పులు తీసుకురావాలని,యుద్ధాలు పరిసమాప్తి కావాలని, హింసకు తావులేని ప్రపంచం ఏర్పడాలనికోరుకుంటూ, కదిలేకాలంలో ఒదిగిపోయిన జ్ఞాపకాలను అనుభవాలుగా మలచుకుని, నూతన సంవత్సరాన్ని ఘనంగా స్వాగతిద్దాం. ●

# దేశం కోసం జీవితం అంకితంచేసిన అమ్మ

## ఖలీదా జియా మృతిపట్ల ఆమె కుమారుడి భావోద్వేగం




**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా మృతి పట్ల ఆమె కుమారుడు, పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న 80 ఏళ్ల ఖలీదా జియా ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. తల్లి మరణంపై స్పందిస్తూ తారిఖ్ రెహమాన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ఒక ఉద్వేగభరితమైన పోస్ట్ చేశారు. నా తల్లి అల్లా పిలుపు మేరకు మనల్ని విడిచి వెళ్లిపోయారు. చాలా మందికి ఆమె ప్రజాస్వామ్యానికి తల్లివంటిది (మదర్ ఆఫ్ డెమోక్రసీ), రాజీపడని నాయకురాలు. కానీ, నాకు మాత్రం ఆమె దేశం కోసమే జీవితాన్ని అంకితం చేసిన ప్రేమగల అమ్మని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ ఆమె కుటుంబానికి అండగా నిలిచారని తారిఖ్ గుర్తుచేసుకున్నారు. దేశం కోసం తన భర్తను, బిడ్డను కోల్పోయినప్పటికీ దేశ ప్రజలనే తన కుటుంబంగా భావించారని, ఆమె త్యాగాలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు. ఖలీదా జియా మృతికి సంతాపంగా బీఎన్‌పీ 7 రోజుల సంతాప దినాలను ప్రకటించగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం 3 రోజుల అధికారిక సంతాపం, బుధవారం సాధారణ సెలవు ప్రకటించింది. రేపు ఢాకాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ అధ్యక్షతన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సీనియర్ నేతలతో చర్చించారు.

# వెనెజులా భూభాగంపై తొలిసారి అమెరికా దాడి.. ధ్రువీకరించిన ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 30:** వెనుజులా భూభాగంపై తొలిసారిగా అగ్రరాజ్యం అమెరికా దాడికి పాల్పడింది. పడవల్లో డ్రగ్స్ లోడింగ్‌కు వాడే డాక్‌పై అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ విషయాన్ని ఫ్లోరిడాలో జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. 'ముందుగా అన్ని బోట్లను ధ్వంసం చేశాం. ఇప్పుడు వాటిని తరలించే ప్రాంతాన్ని కొట్టాం. ఆ డాక్ ఇక లేదు' అని తెలిపారు. గత వారం ఓ రేడియో ఇంటర్వ్యూలో కూడా ఈ దాడి గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఓ పెద్ద సౌకర్య కేంద్రంపై అమెరికా ఆపరేషన్ జరిగిందని తెలిపారు. తాజాగా ఇప్పుడు రెండోసారి ఈ దాడి గురించి వెల్లడించారు. అయితే ఈ దాడి జరిగిన ప్రాంతం ఎక్కడ ఉంది? దాడి ఎప్పుడు జరిగిందనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఈ దాడిలో కేవలం అమెరికా సైన్యమే పాల్గొందా? సిఐఎ ప్రమేయం ఉందా అన్న వివరాలు బయటపెట్టలేదు. ఈ దాడి వెనుజులా భూభాగంపైనే జరిగిందా? లేదా అన్నది కూడా ఇంకా స్పష్టం కాలేదు. ఈ దాడిపై వైట్‌హౌస్ కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. గతంలో డ్రగ్స్ తరలించే బోట్లపై దాడుల సమయంలో చిత్రాలు, విడియోలను పెంటగాన్ విడుదల చేసింది. కానీ ఈ డాక్ ధ్వంసానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫొటోలు విడుదల చేయలేదు. మరోవైపు వెనుజులా ప్రభుత్వం కూడా అధికారికంగా స్పందించలేదు. డ్రగ్స్ స్మగ్లింగ్‌పై అమెరికా గత యేడాది సెప్టెంబరు నుంచి ఉక్కుపాదం మోపుతోంది. పసిఫిక్, కరేబీయన్ సముద్రాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నాయని ఆరోపిస్తూ 20కిపైగా బోట్లపై అమెరికా దాడులు చేసింది. వీటిలో చాలావరకు వెనుజులాకు చెందిన బోట్లే ఉన్నాయని అమెరికా చెబుతుంది. ఈ మొత్తం దాడుల్లో 100 మంది వరకు చనిపోయినట్లు సమాచారం.

# మోడీ, అమిత్‌షాలు దుర్యోధన, దుశ్శాసనులు..

## పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా, డిసెంబర్ 30:** పశ్చిమబెంగాల్ సిఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బిజెపిపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. బెంగాల్ రాష్ట్రంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయని అమిత్ షా చేసిన ఆరోపణలపై స్పందిస్తూ పహల్గాం దాడిని కేంద్రమే చేసిందా? అని మమతా ప్రశ్నించారు. బెంగాల్‌లోని బంకురాలోని బిర్సింగ్‌పూర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలను మహాభారత ఇతిహాసంలోని ఇద్దరు ప్రతినాయకులైన దుశ్శాసన, దుర్యోధనులుగా అభివర్ణించారు. శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించడానికి బెంగాల్‌కు వచ్చాడు. ఎన్నికలు రాగానే ఈ దుశ్శాసన, దుర్యోధనులు ప్రత్యక్షమవుతారు అని ఆమె అన్నారు. బెంగాల్ ఉగ్రవాదులకు కేంద్రంగా మారిందన్న హోంమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, మమతా ఎదురుదాడికి దిగారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు లేకపోతే, పహల్గాం ఎలా జరిగింది? పహల్గాంలో దాడిని మీరే చేశారా? ఢిల్లీలో జరిగిన సంఘటన వెనుక ఎవరున్నారు? అని అడిగారు. బెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా ప్రక్రియపై మమత విమర్శలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఎస్ఐఆర్ పేరుతో వేధిస్తున్నారని అన్నారు. రాజ్‌బన్షీలు, మతువాలు, ఆదివాసీలు వంటి అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ఎస్ఐఆర్ కింద 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని యోచిస్తున్నారని ఆమె అన్నారు. దీని ద్వారా బెంగాలీల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టాం

- వికసిత్ భారత్ లక్ష్యంగా సంస్కరణలు అమలు
- ఇంధనం, పన్నులు, విద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఇంధనం, పన్నులు, వాణిజ్యం, విద్య తదితర రంగాల్లో 2025లో పరివర్తనాత్మక సంస్కరణలు అమలు చేశామని, తద్వారా భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కార్మిక చట్టాలు, జన్ విశ్వాస్, సెక్యూరిటీల మార్కెట్, ఆదాయ పన్ను, జిఎస్‌టిలో మార్పులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ మేరకు మంగళవారం లింక్డ్‌ఇన్‌లో ప్రధాని మోడీ పోస్ట్ చేశారు. భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, 2025లో సంస్కరణల జాబితాను జతచేశారు. "2025 వివిధ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను చూసింది. ఇవి మన వృద్ధి ప్రయాణానికి ఊతం ఇచ్చాయి. అవి వికసిత్ భారత్‌ను నిర్మించడానికి మన ప్రయత్నాలను కూడా మెరుగుపరుస్తాయి" అని ప్రధాని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. 2025ని నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా అభివర్ణించారు. 'గత 11 సంవత్సరాలుగా కొనసాగుతున్న పునాదిపై నిర్మించబడిన నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా భారతదేశానికి 2025 గుర్తుండిపోతుంది. తాము సంస్థలను ఆధునీకరించాం, పాలనను సరళీకృతం చేశాం, దీర్ఘకాలిక, సమగ్రవృద్ధికి పునాదులను బలోపేతం చేశాం' అని అన్నారు.

# తమిళ సీరియల్‌నటి నందిని ఆత్మహత్య



**చెన్నై, డిసెంబరు 30:** తమిళ టెలివిజన్ రంగంలో తక్కువ వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సీరియల్ నటి నందిని (20) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది. షూటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నందిని గది నుంచి ఒక సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆ లేఖలో కుటుంబ సభ్యులు తనపై పెళ్లి విషయంలో ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఆ మానసిక వేదనను తట్టుకోలేకపోయానని నందిని పేర్కొన్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా నందిని తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతోందని గుర్తించారు. కెరీర్ పరంగా ఎదుగుతున్న దశలోనే వ్యక్తిగత సమస్యలు ఆమెను కుంగదీసినట్లు తెలుస్తోంది. నందిని తెలుగమ్మాయే అయినప్పటికీ, ముందుగా కన్నడ సీరియల్ ఇండస్ట్రీలో అడుగుపెట్టి మొదటి సీరియల్‌తోనే మంచి పేరు తెచ్చుకుంది.



# బంగ్లా తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

### కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో మాజీ ప్రధాని

### మాజీ అధ్యక్షుడు జియాఉర్‌రహ్మాన్ భార్యగా రాజకీయ ప్రవేశం

### మూడుసార్లు ప్రధానిగా, బిఎన్‌పీఅధినేతగా బంగ్లాపై చెరగని ముద్ర

### 17 యేళ్ల తర్వాత తిరిగి స్వదేశానికి వచ్చిన కుమారుడు తారిక్ రెహ్మాన్

**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో ధ్రువతార, ఆ దేశ తొలి మహిళా ప్రధానమంత్రి బేగం ఖలీదా జియా (80) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆమె నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రకటించింది. 80 ఏళ్ల ఖలీదా జియా వృద్ధాప్య సమస్యలతో పాటు పలు తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్నారు. వైద్యుల కథనం ప్రకారం ఆమె కాలేయ వ్యాధి, కీళ్ల నొప్పులు, మధుమేహం, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వారాలుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆసుపత్రిలో ప్రత్యేక నిఘాలో ఉంచి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆమె చికిత్స పొందుతున్న ఎవర్‌కేర్ ఆసుపత్రికి బ్రిటన్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియాలనుంచి వైద్యనిపుణులు వచ్చి కృషిచేసినా ఆమె తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ భార్య అయిన ఖలీదా జియా తన భర్త మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చి దేశాన్ని శాసించారు. మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేశారు. షేక్ హసీనాతో సాగించిన దశాబ్దాల రాజకీయ పోరు బంగ్లాదేశ్ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. ఆమె మరణవార్త తెలియగానే బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఉన్న బీఎన్‌పీ కార్యకర్తలు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఖలీదాకు కుమారుడు తారిక్‌రెహమాన్, కోడలు జుబైదారహమాన్, కకుమార్తె జైమా రహమాన్‌లు ఉన్నారు. 17 ఏళ్లప్రవాస జీవితం తర్వాత తొలిసారిగా ఈనెల 25వ తేదీనే ఆమెకుమారుడు ఢాకాకు వచ్చారు. జియా చిన్నకుమారుడు అరాఫత్ రహమాన్ కోకో మలేసియాలో కొన్నేళ్లక్రితమే చనిపోయారు. బ్రిటిష్ పాలనలోని భారత్ తూర్పు బెంగాల్‌లోని దిజాన్‌పూర్‌లో 1946 ఆగస్టు 15న జన్మించిన ఖలీదాజియా తల్లితండ్రులు జల్పాయిగురిలో తేయాకు వానయపారంచేసేవారు.



తూరుపబెంగాల్‌కువెళ్లినతర్వాత తూర్పు పాకిస్తాన్‌గా మారింది. 1947లో భారత్ విభజనలో పాకిస్తాన్‌కిందకువెళ్లింది. తొలినాళ్లలో ఖలదా దినాజ్‌పూర్‌లోనే గడిపారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకున్న తర్వాత సురేంద్రనాథ్ కళాశాలలో చేరారు. 1981లో ఆమె భర్త అప్పటి అధ్యక్షుడు జియావుర్ రెహమాన్‌ను మిలిటరీ తీరుగుబాటోల 1981 మే 30వ తేదీ ఛట్టోగ్రామ్ వద్ద హత్యకు గురికావడంతో ఖలీదా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. బిఎన్‌పిని ముందుండి నడిపించి జియావుర్‌ప్రాభవాన్ని కొనసాగించారు. రహమాన్ హత్యతర్వాత ఉపాధ్యక్షుడుఅ బ్దుస్ సత్తార్ తాత్కాలిక అధ్యక్షుడుగా వచ్చారు. కొన్ని నెలలకే ఆర్మీచీఫ్ హుస్సేన్ ముహమ్మద్ ఎర్షాద్ అధికారం హస్తగతం చేసుకున్నారు. మార్షల్‌లా నడిచింది. 1982లో పార్టీలోచేరిన తర్వాత 1983లో వైస్‌ఛైర్మన్ అయ్యారు. ఆ తర్వాత 1984లో ఛైర్మన్‌గా వచ్చారు. మూడు పర్యాయాలు ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రిగా కొనసాగారు. తన దీర్ఘకాల ప్రత్యర్థి షేక్ హసీనాకు ధీటుగా ఆమె వ్యూహాలు అమలుచేసారు. రానురాను ఆమె ప్రజాజీవితం సమస్యలతో నిండిపోయింది.

# ప్రధాని మోడీ సహా పలువురు నేతల ప్రగాఢ సంతాపం



**చైనా, పాక్ నేతలతో పాటు హసీనా, యూనస్‌ల నివాళి**

**సోనియా, రాహుల్ పలువురు విపక్ష నేతల సంతాపం**

**ఖలీదా మృతితో బంగ్లాలో మూడురోజులు సంతాపదినాలు, నేడు అంత్యక్రియలు**


**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు కీలక నేతగా వ్యవహరించిన ఆ దేశ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ ఖలీదా జియా మృతి పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా ఆమె సృష్టించిన చరిత్రను గుర్తుచేసుకుంటూ, ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. బంగ్లాదేశ్ అభివృద్ధిలో, అలాగే భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని మోదీ పేర్కొన్నారు. 2015లో ఢాకా పర్యటన సందర్భంగా ఆమెతో జరిగిన భేటీని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జియా మృతి పట్ల బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవలే లండన్ నుంచి తిరిగి రాగా, తల్లి చివరి క్షణాల్లో ఆసుపత్రిలోనే ఉన్నారు. ఖలీదా జియా మృతితో బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసినట్లయింది. కేర్‌టేకర్ ప్రధాని మహ్మద్‌యూనస్ తన సంతాప సందేశంలో బంగ్లాదేశ్ ఒక గొప్ప సంరక్షకురాలని కోల్పోయిందని, ఆమె రాజకీయ జీవితం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని దేశ అభివృద్ధికి రాజీలేని పోరాటంచేసారని పేర్కొన్నారు. ఆమె పవిత్రాత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. మాజీ ప్రధాని ఆవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా తన సంతాప సందేశంలో బంగ్లాదేశ్ రాజకీయాల్లో తీరని నష్టం వాటిల్లిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలో జియా గుర్తుంచుకోదగిన నేతగా నిలిచారన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎనలేని కృషిచేసారని హసీనా కొనియాడారు. అదేవిధంగా ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీ, సోనియా, ప్రియాంకలు కూడా ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. పొరుగుననే ఉన్న పాకిస్థాన్, చైనా దేశాధినేతలుసైతం ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. దేశంకోసం నిరంతరం అంకితమయిన నేతగా జియాను చైనా, పాక్‌నేతలు కొనియాడారు.



# రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇంటి వద్ద డ్రోన్ల దాడులు

### ఉక్రెయిన్ చర్యను గగనతలంలోనే ప్రతిఘటించామన్న మాస్కో రక్షణమంత్రి

### దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు మంచిదికాదు.. ట్రంప్



**మాస్కో, డిసెంబరు 30:** రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధంముగింపునకు వస్తున్న సందర్భంలో పుతిన్ నివాసంపై ఉక్రెయిన్‌డ్రోన్ దాడిచేసిందన్న వార్తలు దౌత్యచర్చలకు అంతరాయం కలిగించింది. తమ అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడిచేసిందని ఈదాడులను తీవ్రంగా ప్రతిఘటించామని రష్యా రక్షణ వ్యవస్థప్రకటించింది. ఈ ఘటనను ఉగ్రదాడిగా పేర్కొన్న మాస్కో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని మార్చుకుంటామని వెల్లడించింది. ఆదివారం రాత్రినుంచి సోమవారం ఉదయం మధ్యలో మాస్కోలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌మధ్య ఉన్న నోవ్గోరడ్‌ప్రాంతంలోని పుతిన్ అధికార నివాసం లక్ష్యంగా ఉక్రెయిన్ మొత్తం 91 డ్రోన్లు ప్రయోగించిందన్నారు. అయితే రష్యా గగనతల వ్యవస్థలన్నీ వీటిని ధ్వంసంచేసాయన్నారు. దీనితో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని పునఃసమీక్ష చేసుకుంటామని రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు. అయితే ఈఆరోపణలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. అమెరికా నేతృత్వంలో సాగుతున్న దౌత్యప్రయత్నాలను భగ్నంచేయడానికే రష్యా ఈ ప్రమాదకర ప్రయత్నాలుచేస్తోందని విమర్శించారు. పుతిన్‌నివాసంపైదాడి కథనం పూర్తిగా కల్పితమనిచెప్పిన జెలెన్‌స్కీ యుద్ధం ముగింపునకు చర్యలు తీసుకోకుండా తప్పించుకోడానికి ఇలాంటిసాకులు చెపుతున్నదన్నారు.

**స్వయంగా పుతిన్ ఫోన్‌చేసి చెప్పారు...డొనాల్డ్‌ట్రంప్**

ఈ డ్రోన్ దాడి వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌పై తీవ్ర అసహనం వ్యక్తంచేసారు. ఈ సమాచారం స్వయంగా అధ్యక్షుడు పుతిన్ తనకు చెప్పారని అంటూనే అయితే దాడిపై ఆయన సందేహాలు వ్యక్తంచేసారు. డ్రోన్‌దాడి జరక్కపోయి ఉండొచ్చని అందుకు ఆస్కారం కూడా ఉందని అన్నారు. అవమానకరంగా ప్రవర్తించడం ఒక ఎత్తు అయితే ఇంటిపై దాడిచేయడం మరో ఎత్తు అని ఇపుడే అలాంటిపనులుచేయడానికిఇది సరైన సమయం కాదని అన్నారు. అయినా దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు ఎంతమాత్రం మంచిదికాదన్నారు.

# చీనాబ్‌పై కొత్త ప్రాజెక్టుకు ఆమోదం..

## పాక్ దాహంతో అల్లాడిపోవాల్సిందే



**శ్రీనగర్, డిసెంబరు 30:** పాకిస్థాకు గడ్డు కాలం మొదలు కానుంది. పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక కమిటీ జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తి స్టేజ్-2 జలవిద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌లో ఉన్న ఇండస్ జల ఒప్పందం (ఇండస్ వాటర్స్ ట్రీటీ) ప్రస్తుతం నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇండస్ నది, దాని ఉప నదుల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పహల్గామ్‌లో జరిగిన పాకిస్థాన్ ప్రరేపిత ఉగ్రదాడి తర్వాత, 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు కేటాయించిన ఇండస్ నది పశ్చిమ ఉప నదులైన చీనాబ్, జీలమ్, ఇండస్‌లపై భారత్ తన హక్కులను వినియోగించుకునేందుకు వేగంగా చర్యలు ప్రారంభించింది. దీని లక్ష్యం జలవిద్యుత్ సామర్థ్యాన్ని పెంచడం, నీటి భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవడం ప్రారంభించింది. దుల్హస్తీ స్టేజ్-2 ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ రావడం, జూలైలో ఇదే చీనాబ్ నదిపై 1,856 మెగావాట్ల సవాల్కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు అంతర్జాతీయ టెండర్లు పిలిచిన కొన్ని నెలల తర్వాత ఇది జరిగింది. ఇండస్ జల ఒప్పందం అమలులో ఉన్నప్పుడు, పశ్చిమ నదులపై భారత్‌కు కేవలం నీటిని వినియోగించకుండా విద్యుత్ ఉత్పత్తి చేసే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఒప్పందం నిలిపివేయబడినప్పటికీ, కొత్తగా ఆమోదించిన ప్రాజెక్టులన్నీ 'రన్-ఆఫ్-ది-రివర్' విధానంలోనే ఉండటం గమనార్హం.

# సంక్షిప్తంగా..

## ఐఐటి కాన్పూర్‌కు పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళం



**కాన్పూర్, డిసెంబరు 30:** ఐఐటీ కాన్పూర్ క్యాంపస్‌లో ఇటీవల నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం దాతృత్వానికి ఒక మైలురాయిగా నిలిచింది. తమ కెరీర్, జీవితాల్ని తీర్చిదిద్దటంలో కీలకంగా నిలిచిన విద్యా సంస్థకు రూ.100 కోట్లు విరాళంగా అందజేస్తామని వాళ్లంతా ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. దీనిపై ఐఐటీ కాన్పూర్ స్పందిస్తూ, దేశంలోనే అత్యధికం. పూర్వ విద్యార్థుల విరాళంలో ఇది చారిత్రక మైలురాయిని సూచిస్తున్నది. ఐఐటీ కాన్పూర్ పట్ల కృతజ్ఞతా భావాన్ని తెలుపుతుందని పేర్కొన్నది. ఐఐటీ కాన్పూర్‌లో మిలీనియం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సొసైటీని స్థాపించడానికి విరాళాల్ని ఉపయోగించాలని పూర్వ విద్యార్థులు ప్రతిపాదించారు. ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు.

## ప్రియాంక కుమారుడు రెహాన్ నిశ్చితార్థం



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కుమారుడు రేహాన్‌వాద్రా వివాహ నిశ్చితార్థం జరిగింది. తన స్నేహితురాలు అవీవాబేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండురోజులక్రితం వీరిద్దరూ దిగిన ఫోటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫోటోను హైలైట్స్ సెక్షన్‌లో పోస్టుచేసారు. వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఈ ఫోటోలు మరింత బలాన్నిచ్చాయి. రేహాన్ అవీవా ఏడేళ్లుగాస్నేహితులు. అవీవాముందు రేహాన్‌పెళ్లిప్రస్తావన తీసుకురాగా ఆమె ఆమోదించిందని తెలుస్తోంది. వీరి ప్రేమ బంధాన్ని ఇరుకుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాలనుంచి ఎలాంటిప్రకటన ఇప్పటివరకూ రాలేదు. అవీవా కుటుంబసభ్యులు ఢిల్లీకి చెందినవారని రాబర్ట్ వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలున్నట్లు చెపుతున్నారు.

## ఉత్తరాఖండ్ లోయలో పడిన బస్సు.. ఏడుగురు మృతి!



**డెహ్రాడూన్, డిసెంబర్ 30:** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు పేర్కొన్నారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని వారిని బయటకు తీయడం కష్టంగా మారిందన్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహాత్ మీదుగా రాంనగర్‌కు వెళుతుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తి హత్య!



**ఢాకా, డిసెంబర్ 30:** బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరువకముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి నోమన్ మియా కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్‌వైపు గురిపెట్టానని అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# మే 17న జెఇఇ అడ్వాన్స్‌డ్-2026

ఏప్రిల్ 23వ తేదీ నుంచి

మే 2 వరకు దరఖాస్తుల స్వీకరణ

షెడ్యూల్ విడుదల చేసిన ఐఐటి రూర్కీ

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** దేశంలోని 23 ఐఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్), బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను వచ్చే ఏడాది మే 17న నిర్వహించనున్నారు. జేఈఈ అడ్వా న్స్‌డ్-2026ను ఐఐటీ రూర్కీ నిర్వహించనున్న సంగతి తెలిసింది. ఈ నేపథ్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 షెడ్యూల్‌ను విడుదల చేసింది. రెండు విడతల్లో జేఈఈ మెయిన్- 2026లో అర్హత సాధించిన విద్యార్థులు ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు అడ్వాన్స్‌డ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ప్రకటించింది. మే 4 వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను మే 11 నుంచి మే 17న మధ్యాహ్నం 2.30గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను మే 17న నిర్వహించనున్నారు. పేపర్-1 పరీక్షను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, పేపర్-2ను మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహిస్తారు. అడ్వాన్స్‌డ్ ప్రొవిజినల్ ఆన్సర్ కీని మే 25న విడుదల చేసి 26 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం జూన్ 1న తుది కీతోపాటు ఫలితాలను ప్రకటిస్తారు. జేఈఈ మెయిన్‌లో కనీస స్కోర్ సాధించిన 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అవకాశం ఉంటుంది.

# స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టును తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఉద్యోగాల భర్తీలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పీడ్ పెంచింది. కొద్దిరోజుల క్రితం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన బోర్డు, తాజాగా స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందరి వివరాలను మంగళవారం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. అభ్యర్థి అకాడమిక్ క్వాలిఫికేషన్‌లో సాధించిన మార్కులు, వెయిటేజీ ద్వారా సాధించిన మార్కులు, వారి స్థానికతకు సంబంధించిన అంశాలు సహా అన్ని వివరాలను రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, వాటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని బోర్డు కోరింది. అభ్యంతరాలను జనవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా నమోదు చేయాలని సూచించింది. అభ్యంతరాలను అభ్యర్థి లాగిన్ ద్వారా మాత్రమే నమోదు చేయాలని, ఆఫ్‌లైన్‌లో పంపించిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని బోర్డు స్పష్టం చేసింది. మల్టీ జోన్-1 పరిధిలో ఎటువంటి పోస్టులు నోటిఫై చేయనందున, ఆ జోన్‌కు చెందిన అభ్యర్థులను పోస్టుల కోసం పరిగణనలోకి తీసుకోవడం లేదని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.

## కామారెడ్డిలో మహిళకు సైబర్ నేరగాళ్ల టోకరా


**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఆగడం లేదు. ప్రతీరోజు వేల సంఖ్యలో అమాయకులు వీరి ఆగడాలకు బలవు తునే వున్నారు. ఇదే క్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ మహిళ తన ఫోన్‌లో వచ్చిన యాప్‌ను నమ్మి ప్రతీరోజు కొంత పెట్టుబడిగా పెట్టింది. ఇలా మూడు నెలల వ్యవధిలో 1.68 వేల రూపాయలను ఆమె సదరు యాప్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఈ నగదుకు రెండింతలు లాభం వచ్చినట్లు యాప్‌లో కనిపించినా వీటిని డ్రా చేసుకునేందుకు అవకాశం లభించలేదు. దీనిపై యాప్ నిర్వాహకులుగా ఉన్న వ్యక్తులను ఆరా తీయగా మరింత పెట్టుబడి పెట్టాలని కోరారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మహిళ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కామారెడ్డి జిల్లా సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.



లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడ్డ సర్వేయర్ బాలకృష్ణ, అసిస్టెంట్ నాగరాజు

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన సర్వేయర్

**నిర్మల్‌రూరల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** నిర్మల్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ల్యాండ్ సర్వేయర్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిన్నయ్య అనే వ్యక్తి భూమి కొలత నిమిత్తం ల్యాండ్ సర్వేయార్ బాలకృష్ణను సంప్రదించగా 15000 డిమాండ్ చేసి, 5000 అడ్వాన్స్ తీసుకొని మిగతా పదివేలకు డిమాండ్ చేయడంతో బాధితుడు పదివేల నుండి తక్కువ చేయాలని కోరడంతో 7500 రూపాయలకు అంగీకరించారు. ఈ విషయం బాధితుడు ఏసీబీ అధికారులకు చెప్పడంతో సర్వేయర్ బాలకృష్ణ, అసిస్టెంట్ నాగరాజులు లంచం తీసుకుంటుండగా మంగళవారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఎమ్మార్వో కార్యాలయంలోకి తరలించి పంచనామా చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి మధు మాట్లాడుతూ లంచం తీసుకొని పట్టుబడినవి ఇద్దరికీ జ్యూడిషల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. అవినీతికి ఎవరు పాల్పడిన తమను సంప్రదించాలని కోరారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 407

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 30, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 407 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 126 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 57, ఇందిరమ్మ ఇళ్ల కోసం 194, ప్రవాసీ ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 30 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ప్రాజెక్టులను పూర్తిచేసి 54 లక్షల ఎకరాలకు సాగునీరందించాలి

రెండేళ్లలో భారీ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

రాష్ట్ర రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రాజెక్టులను పూర్తి చేసి 54 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, అలాగే రెండు సంవత్సరాల కాలవ్యవధిలో భారీ ప్రాజెక్టులను పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడానదరు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా త్రాగు సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ రైతు సంఘం మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. పశ్య పద్మ అధ్యక్షతన రాజ బహదూర్ గౌర్ హాల్‌లో నిర్వహించింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఇంజనీర్ కే విఠల్ రావు, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, సాగునీటి విశ్లేషకులు సాంబశివరావు, ఎస్కేం రాష్ట్ర కన్వీనర్లు బిక్షపతి, జక్కుల వెంకటయ్య, పట్లోళ్ల నాగిరెడ్డి, విజయ్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు పెద్ద నదులు కృష్ణ, గోదావరి ప్రవహిస్తున్నాయని, సుమారుగా 43 శాతం ఏరియా కృష్ణ బేసిన్‌లో, 56 శాతం ఏరియా గోదావరి బేసిన్‌లో ఉందని వక్తలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మధ్య నుండి తూర్పునకు అనేక నదులు ప్రవహించడం, బంగాళాఖాతం వరకు దక్కన్ పీఠభూమి ఉండటం తెలంగాణకు అనుకూలంగా ఉందన్నారు.

ఈ ప్రవాహాలల్లో అధిక భాగం నైరుతీ ఋతుపవనాల కాలంలో జూన్ నుండి సెప్టెంబర్ వరకు 3, 4 నెలల కాలంలో మాత్రమే ఉంటాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 73 ప్రాజెక్టులను.. అందులో 34 భారీ ప్రాజెక్టులు, 39 మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టి అందులో 42 ప్రాజెక్టులను (10 భారీ ప్రాజెక్టులు, 32 మధ్యతరహా ప్రాజెక్టులు) పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన 31 ప్రాజెక్టుల (24 భారీ, ఏడు మధ్య తరహా ప్రాజెక్టుల) నిర్మాణం కొనసాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 127. 57 లక్షల ఎకరాల లక్షి త సాగునీటి సామర్థ్యాన్ని సాధించటానికి రానున్న 5, 6 సంవత్సరాల కాలంలో కొనసాగుతున్న భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కింద 54 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించటానికి కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పెండింగ్ లో ఉన్న భారీ మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తిచేసి 54 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని , నిధులను కేటాయించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ లో 7వ బ్లాక్ లో పియర్స్ కృంగిపోవడానికి కారణాలను తెలుసుకోవడం కోసం భూగర్భ సంబంధిత పరీక్షలు, ఇతరత్రా పరీక్షలు చేయాలని ఈ పరీక్షల్లో తేలిన విషయాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని జాతీయ డ్యాం భద్రత అథారిటీ చేసిన సూచనల మేరకు చర్యలను వేగవంతం చేయాలన్నారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై డిపిఆర్‌ను ప్రకటించాలని తక్కువ ఖర్చుతో కాగ్ రిపోర్టు ప్రకారం గోదావరి జలాలను వినియోగించుకోవాలన్నారు. ఐటీసీ ఎత్తిపోతల పథకాలు రాష్ట్రంలో 637 ఎత్తిపోతల పథకాలు ఉండగా అందులో 385 మాత్రమే పని చేస్తున్నాయన్నారు. కొత్తగా నెలికల్, కేశవాపురం (నల్లగొండ జిల్లా) పిప్రీ(నిర్మల్ జిల్లా) మూడు కొత్త లిఫ్టు పథకాలను మంజూరు చేశారు. ఇవి కాక మరొక 37 నిర్మాణంలో కొనసాగుతున్నాయని.. వాటికి బడ్జెట్ కేటాయించి పూర్తి చేయాలన్నారు.

# కీలక ఆవిష్కరణలకు మైలురాయి ఎస్పీడిసిఎల్

అత్యంత ప్రయోజనకరంగా ప్రజాబాట

దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ఫరూఖీ



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త :** ఈ యేడాది దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ (ఎస్పీడీసీఎల్)లో పలు వినూత్న కార్యక్రమాల ప్రారంభానికి, కీలక ఆవిష్కరణలకు మైలురాయిగా నిలిచిందని సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో ఈ ఏడాది సాధించిన విజయాలను గూర్చి వివరించారు. ప్రధానంగా కరంటోళ్ల ప్రజా బాట, పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ విధానం వినియోగదారులకు అత్యంత ప్రయోజన కరంగా మారాయని వెల్లడిం చారు. ఇందులో భాగంగా ప్రతి వారినికి మూడు రోజుల్లో సంస్థలోని మొత్తం ఆపరేషన్ సిబ్బంది బస్తీలు, కాలనీలు, గ్రామాల్లో పర్యటించి వినియోగదారులను ప్రత్య క్షంగా కలుస్తున్నారన్నారు. నెట్‌వర్క్‌కు సంబం ధించిన సమస్యలను గుర్తించి, వీలైనంత వరకు అదేరోజు సాయంత్రంలోగా పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 1,800 వంగిన, దెబ్బతిన్న కరెంటు స్తంభాలను సరిచేయడం, ఇరుకైన గల్లీల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన షుమారు 800 కిలోమీటర్ల ఓవర్‌హెడ్ లైన్లను ఏబీ కేబుళ్లను మార్పిడి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇదే యేడాది ప్రారంభించిన మరో ముఖ్యమైన పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ విధానంగా తెలిపారు. ఇప్పటి వరకూ ఒక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు కనీసం 30-35 చదరపు అడుగులు అవసరం ఉండగా, దీన్ని ఈ ఏడాది మార్చి కేవలం 377 మిల్లీమీటర్ల వ్యాసార్థం కలిగిన పోల్‌పై ట్రాన్స్ ఫార్మర్ అమర్చే విధంగా ఈ నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 304 ప్రాంతాల్లో ఈ విధానంలో ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకుగాను, ఇప్పటికే 150 ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ యేడాది నూతనంగా 7531 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, 291 పవర్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామ న్నారు. వీటితో పాటు, నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు సంబంధించి, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా దాదాపు 97 నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో 47,68,029 టన్నుల యూరియా

అత్యధికంగా ఖమ్మంలో 3,09,681 టన్నులు

ప్రకటించిన వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 47,68,029 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ మొత్తం రాష్ట్ర స్థాయిలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ డిలర్ల ద్వారా 31,077 టన్నులు, సహకార సంఘాల ద్వారా 16,755 టన్నులు, జిల్లా మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) ద్వారా 1,66,730 టన్నులు, మొత్తం డిమాండ్ 2,14,561 టన్నులకు మించి భారీగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ నిల్వలతో ప్రస్తుత రబీ సీజన్లో రైతులకు ఎరువుల కొరత లేదని తేల్చి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 3,09,681 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు జిల్లాల వారీగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇక యూరియా నిల్వల్లో రెండో స్థానంలో నల్గొండ జిల్లాలో 3,09,679 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లుగా వెల్లడించారు. ఇందులో కొన్ని జిల్లాల్లో ఉన్న నిల్వలు చూస్తే ఆదిలాబాద్‌లో 57,998 టన్నులు, ఆసిఫాబాద్‌లో 96,297 టన్నులు, మంచిర్యాలలో 86,917 టన్నులు, నిర్మల్‌లో 1,69,367 టన్నులు, నిజామాబాద్‌లో 2,91,808 టన్నులు, కామారెడ్డిలో 2,17,765 టన్నులు, కరీంనగర్‌లో 1,86,374 టన్నులు, పెద్దపల్లిలో 2,22,135 టన్నులు, జగిత్యాలలో 1,62,141 టన్నులు, సిరిసిల్లాలో 64,517 టన్నులు, మెదక్‌లో 1,22,402 టన్నులు, సంగారెడ్డిలో 1,05,901 టన్నులు, సిద్దిపేట్‌లో 2,44,008 టన్నులు, వరంగల్‌లో 2,08,337 టన్నులు, మిగిలిన జిల్లాల్లో సైతం రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# బిపిసిలో 12 అంశాలను పరిశీలించండి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ఈ నెల 29 నుంచి ప్రారంభమైన శాసనసభ శీతాకాల సమావేశాల్లో చర్చించాల్సి న అంశాలపై కొన్ని ప్రతిపాదనలను శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పంపారు. ఈ నెల 29 నుంచి శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో సిపిఐ తరుపున కొన్ని అంశాలను బిఎసి పరిశీలనకు ప్రతిపాదిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత శీతాకాల సమావేశాలు కనీసం పదిపనిదినాలపాటు నిర్వహించాలని ఎజెండాను సాయంత్రం కాకముందే అందించడం ద్వారా, సభ్యులు ప్రిపేర్ అయ్యేం దుకు వీలు కలుగుతుందన్నారు. యేటా కనీసం 50 రోజులపాటు శాసనసభ నిర్వహిం చాలన్నారు. శాసనసభకు సంబంధించి అన్ని కమిటీ నియామకాలను పూర్తి చేయాలని కోరారు. సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన, సింగరేణి కార్మికుల సమస్యలు, ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలు కార్యాచరణపై చర్చించాలని స్పీకర్‌కి రాసిన లేఖలో కూనంనేని పేర్కొన్నారు.

# జంగుబాయి దేవాలయ అభివృద్ధికి చర్యలు

ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్

**కెరమెరి, డిసెంబరు 30, ప్రభాతవార్త:** జంగుబాయి దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్ అన్నారు. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం కోట పరంధోలి గ్రామంలో నిర్వహించిన జంగుబాయి జాతరలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, మహారాష్ట్ర లోని యావత్ మాల్ నియోజకవర్గ శాసనసభ్యులు తొడసం రాజులతో కలిసి ఆలయ క్షేత్రాన్ని సందర్శించి జంగుబాయి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ పవిత్రమైన పుష్య మాసంలో జంగుబాయి క్షేత్రంలో నిర్వహిస్తున్న జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, తదనగుణంగా క్షేత్రంలో జాతర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జంగుబాయి దేవతను భక్తితో కొలుస్తారని, ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా జంగుబాయి దేవత కొలువై ఉందని తెలిపారు. గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు అందించాలని, వచ్చే రోజులలో జంగుబాయి క్షేత్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రహదారి సౌకర్యం, ఆలయ క్షేత్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, తాగునీటి వసతి కల్పిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జంగు భాయ్ ఉత్సవాలకు ప్రభుత్వం ద్వారా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దర్శనానికి వచ్చే భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు, రహదారి, ప్రహరీ నిర్మా ణం, లైటింగ్ ఏర్పా టుకు చర్యలు చేపడు తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ శాసన సభ్యులు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన జంగు బాయి దేవస్థానం అభివృద్ధికి కట్టు బడి ఉన్నామని తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మహారాష్ట్రలోని యవత్ మాల్ శాసనసభ్యులు మాట్లాడుతూ జంగుబాయి దేవస్థానం అభివృద్ధికి ఇరు రాష్ట్రాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

అనంతరం ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు మార్లవాయిలు జరిగే హైమన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకుముందు కటోడీలు జాతరకు విచ్చేసిన అతిధులకు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు.

## కొత్త యేడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** కొత్త యేడాది నుంచే రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ (టిఫిన్) పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించడంతోపాటు సెంటర్లలో అటెండెన్స్ పెంచడమే లక్ష్యంగా తీసుకున్నది. ముందుగా ఈ పైలట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్ లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్నారు. అది విజయవంతం అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించనున్నారు. తెలంగాణ ఫుడ్స్ సంస్థ ద్వారా రెడీ టు ఈట్ పద్దతిలో ఆహారాన్ని అందించనున్నారు. ఇందులో భాగంగా ఒకరోజు కిచిడీ, మరోరోజు ఉప్మా విద్యార్థులకు ఇవ్వనున్నారు.ఇలా రోజు విడిచి రోజు వేర్వేరు టిఫిన్స్ను చిన్నారులకు పెట్టనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 35,781 అంగన్వాడీ కేంద్రాల్లోని 8 లక్షల మంది చిన్నారుల ఆకలి తీర్చనుంది ప్రభుత్వం. కాగా అంగన్వాడీల్లో ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, బాలామృతం అందిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెడుతున్న బ్రేక్‌ఫాస్ట్‌తో నాణ్యత తగ్గకుండా, పిల్లలకు నచ్చేలా అధికారులు మెనూ ప్లాన్ చేశారు.

# కొత్త హైకోర్టు పనుల వేగానికి వారాంతపు సమీక్షలు

ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్ ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 30:** రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న కొత్త హైకోర్టు సముదాయాన్ని గడువులో పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనుల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని రవాణా, రోడ్లు- భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టులో జాప్యాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇకపై ప్రతి శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సైట్‌లోనే వారాంత సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాలకు కన్సల్టెంట్‌తోపాటు నిర్మాణ, ఎంఈపీ ఉపకన్సల్టెంట్లు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. పనుల వేగం పెరగాలంటే సాంకేతిక సిబ్బంది, ఉప కన్సల్టెంట్ల సంఖ్యను వెంటనే పెంచాలని ఆదేశించిన వికాస్‌రాజ్, ఒప్పంద పరిధిలోనే స్వతంత్ర ఇంజినీరింగ్ సంస్థను నియమించి సాంకేతిక సలహాలు తీసుకునే అంశాన్ని పరిశీలించాలని సీఈ (బిల్డింగ్స్)కు ఆదేశించారు. డ్రాయింగ్‌లను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కనీసం రెండు నెలలు ముందుగానే సమర్పించాలని, అలా చేయడం వల్ల సామగ్రి కొనుగోలు, కార్మికుల సమీకరణ సకాలంలో జరిగే అవకాశం ఉంటుందని వివరించారు. డ్రాయింగ్‌ల జారీలో జాప్యం జరిగితే, ప్రాజెక్టు పురోగతికి భంగం కలగకుండా ప్రత్యామ్నాయ కన్సల్టెంట్‌ను నియమించే అధికారం ఇంజినీరింగ్ విభాగానికి ఉంటుందని హెచ్చరించారు.ప్రాజెక్టు గడువు తప్పకుండా నిలబెట్టేలా శాఖ, కాంట్రాక్టర్, కన్సల్టెంట్ ముగ్గురూ సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఆర్కిటెక్చరల్ రూపకల్పన, ఎంఈపీ షాఫ్టులు తదితర అంశాలను సివిల్, ఎలక్ట్రికల్‌ఇంజినీర్లు కలిసే సమీక్షించి, జాతీయ భవన నియమావళి (ఎన్‌బీసీ) ప్రమాణాలకు అనుగుణంగా తుదిడ్రాయింగ్‌లను ధ్రువీకరించాలన్నారు.

# అత్తాపూర్‌లో జింక మాంసం విక్రయం కలకలం

నిందితుడు అరెస్టు.. 15 కిలోలు స్వాధీనం



నిందితుడు మహ్మద్ ఇర్ఫానుద్దీన్‌తోపాటు జింక మాంసం స్వాధీనం చేసుకున్న పోలీసులు

**హైదరాబాద్ (అత్తాపూర్), డిసెంబరు 30, ప్రభాతవార్త :** అత్తాపూర్‌లో జింక మాంసం విక్రయం కలకలంసృష్టించింది.ఓ వ్యక్తి అక్రమంగా జింక మాసం విక్రయిస్తున్నాడని పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు సులేమాన్ నగర్ లో దాడులు చేసి జింక మాంసం అమ్ముతున్న మహ్మద్ ఇర్ఫానుద్దీన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.అతనివద్ద నుంచి 15 కిలోల జింక మాంసం , జింక తోలు , తలతో పాటు 3,500 నగదు స్వాధీనం చేసుకొని అత్తాపూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.అయితే కర్నూల్ జిల్లా పెబ్బేరు నుంచి నగరానికి జింకను తీసుకువచ్చి స్థానికంగా వధించి 800 రూపాయలకు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు.వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఈగల్ పోలీసులకు చిక్కిన మహిళా డ్రగ్‌స్మగ్లర్

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** డ్రగ్ స్మగ్లర్లపై ఈగల్ పోలీసుల దాడులు కొనసాగుతూనే వున్నాయి. బంజారాహిల్స్‌కు చెందిన హస్నా (47) అనే మహిళ ప్రైవేటు ఉద్యోగి. ఉద్యోగులతో కలిసి 2024 డిసెంబర్‌లో తొలిసారిగా గోవాకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడ మీనా అనే మ హిళతో పరిచయం కాగా ఆమె ద్వారా కిరణ్ అనే మరో వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇతని ద్వారా రోమి భరత్ కల్యాణి (40) అనే మరో వ్యక్తి ప రిచయం కాగా ఆ సమయంలోనే మొదటిసారిగా ఎండిఎంఎ డ్రగ్‌ను వాడింది. దీని తరువాత హస్నా ఈ ఏడాది జూలై, అక్టోబర్, డిసెంబర్ నెల లో గోవాకు వెళ్లి రోమి భరత్ కల్యాణితో భేటీ అయి మాదకద్రవ్యాలకు బానిసగా మారడంతో పాటు డ్రగ్ పెడ్లర్‌గా మారింది. అక్కడ తక్కువ ధరకు ఎండిఎంఎతో పాటు ఎల్ఎస్‌డ కొనుగోలు చేసి దానిని హైదరాబాద్‌లో తనకు తెలిసిన వారికి ఎక్కువ ధరకు అమ్మసాగింది. కాగా హస్నా గురించి సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు మంగళవారం నాడు పక్కాగా వ్యవహరించి బంజారాహిల్స్‌లోని ఆమె వుండే ఇంటిపై దాడిచేసి పట్టుకునాన్నరు. ఈ సందర్భంగా ఆమె వద్ద కొంత డ్రగ్‌ను జప్తు చేశారు. నిందితురాలిపై కేసు నమోదు చేసిన ఈగల్ పోలీసులు ఆమె ఇక్కడ ఎవరెవరికి మాదకద్రవ్యాలను విక్రయిస్తుందనే దానిపై ఆరా తీస్తున్నారు. కాగా ఈ కేసులో రోమి భరత్ కల్యాణితో పాటు హస్నాపై గతం లో గోల్కొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ కేసులో వీరు బెయిల్‌పై ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉప్పల్ రవాణా శాఖ అధికారి దుర్మరణం



ఎవి కృష్ణారావు (ఫైల్)

**హైదరాబాద్ (ఉప్పల్), డిసెంబరు 30, ప్రభాతవార్త** : రోడ్డు ప్రమాదంలో ఉప్పల్ రవాణాశాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆపీసర్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యో గి దుర్మణం చెందారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాగోల్ వాసవి బృందావనంలో నివసించే ఆదూరి వెంకట కృష్ణారావు (59) ఉప్పల్ తూర్పు రవాణాశాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు డ్యూటీకి వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటినుంచి బయలుదేరి రవాణా కార్యాలయానికి వస్తుండగా ఉప్పల్ రాజ్యలక్ష్మి థియేటర్ వద్ద వెనుక నుంచి వచ్చిన పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆయన కుడికాలుపై ట్యాంకర్ వాహనం వెళ్లడంతో తీవ్రగాయాలకు గురైయ్యాడు. వెంటనే స్థాని కులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రుని కామినేని ఆస్పత్రికి తర లించారు. చికిత్స పొందుతూ సాయంత్రం ఆరున్నరగంటలకు మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య గాయత్రిదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంతంగా 'ఉత్తరద్వార' దర్శనాలు



వైకుంఠద్వార దర్శనాలతో ఆలయం వెలుపల భక్తులు

## తిరుమలలో టోకెన్ భక్తులకు పూర్తి సౌకర్యాలు

### నేడు పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం

**తిరుమల,డిసెంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వ రస్వామి నిలయమైన ఆనందనిలయానికి ఆనుకునే ఉన్న వైకుంఠద్వార దర్శనాలను సినీప్రముఖులతో బాటు సామాన్యభ క్తులు వైకుంఠ ఏకాదశి ఘడియల్లో ప్రశాంతంగా చేసు కుం టున్నారు.మంగళవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని వైకుంఠద్వార దర్శనాలు మొదల య్యాయి. వేకువజామున 1.30గంటలకు మొదలైన ప్రోటోకాల్ ప్రముఖుల దర్శనాలు ఏకధాటిగా ఉదయం 6గంటల వరకు సాగాయి. ఆ తరువాత ముందుగా నిర్ధేశించిన సమయం ప్రకారం టోకెన్లుపొందిన భక్తులను స్లాట్‌ల వారీగా సమయం ప్రకారం ఆలయంలోనికి అనుమతించారు. సర్వదర్శనం ప్రారం భించడంతో సామాన్యభక్తులు ఏడుకొండల స్వామితోబాటు వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకొంటున్నారు.

**నేడు చక్రస్నానం:** వైకుంఠ ద్వాదశి పర్వదినాన బుధవారం ఉదయం స్వామివారి పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం జరిపిస్తారు. ఆగమోక్తంగా అర్చకులు పవిత్ర కార్యక్రమం నిర్వహించిన అనంతరం సామాన్యభక్తులు పుణ్యస్నానాలాచరిస్తారు.

# గ్రూప్-1పై హైకోర్టులో ముగిసిన వాదనలు

## జనవరి 22న తీర్పు ఇవ్వనున్న డివిజన్ బెంచ్

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తుది తీర్పును జనవరి 22న వెలువరించనున్నట్టు హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం వాదనల అనంతరం ప్రకటించింది. తెలంగాణలో మొదటిసారి నిర్వహించిన గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టిజిపిఎస్‌సితోపాటు పలువురు గ్రూప్-1 సెలెక్టెడ్ అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో మంగళవారం విచారణ ముగిసింది. ఇరు వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన ధర్మాసనం జనవరి 22న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. వాదనల సమయంలో టిజిపిఎస్‌సి తరపున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు.



# కొత్త కమిషనర్ల బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** సైబరాబాద్, మల్కాజిగిరితో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు కమిషనర్లుగా నియమితులైన సీనియర్ ఐపిఎస్ అధికారులు మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేబట్టారు. సైబరాబాద్ కమిషనర్‌గా మస్తీపురం రమేష్‌రెడ్డి గచ్చిబౌలిలోని కమిషనర్ కార్యాలయంలో, మల్కాజిగిరి కమిషనరేట్ (పూర్వపు రాచకొండ కమిషనరేట్) కమిషనర్‌గా అవినాష్ మొహంతి నేరెడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో, ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా గొట్టె సుధీర్‌బాబు కొంగర కలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో బాధ్యతలు చేబట్టారు. కాగా కొత్త కమిషనర్లను ఆయా కమిషనరే ట్లలోని డిసిపిలు, ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

# చొరబాట్లను ప్రోత్సహిస్తున్న తృణమూల్ కాంగ్రెస్!

## మహిళా సిఎం హయాంలోనే మహిళల భద్రతకు ముప్పు

### కోల్‌కతాలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**కోల్‌కతా, డిసెంబరు 30:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 2026 అసెంబ్లీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. కోల్‌కతా పర్యటనలో ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగాల్‌ను పట్టి పీడిస్తున్న చొరబాటుదారులు, అవినీతి, హింసాత్మక రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే బెంగాల్‌ను చొరబాటుదారుల నుంచి విముక్తి చేస్తామని భారీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మమతా బెనర్జీ ప్రభుత్వం తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బంగ్లాదేశీయుల చొరబాటును ప్రోత్స హిస్తోందని అమిత్ షా ఆరోపించారు. చొరబాటు అనేది కేవలం బెంగాల్ సమస్య మాత్రమే కాదు. ఇది మొత్తం దేశ భద్రతకు సంబంధించిన అంశం. సరి హద్దుల్లో కంచె వేయడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించకుండా అడ్డుకుంటోంది. అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాల్లో చొరబాటును అడ్డుకోగలిగినప్పుడు బెంగాల్‌లో ఎందుకు జరగడం లేదనిప్రశ్నించారు. 2026లో బీజేపీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులను గుర్తించి వారిని రాష్ట్రం నుంచి తరిమికొడతామని స్పష్టం చేశారు.

# సంక్రాంతికి అదనపు రైళ్లు

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 30, ప్రభాతవార్త :** రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్యస్థానాల మధ్య 9 అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ స్పెషల్ ట్రైన్లు విశాఖపట్నం - చర్లపల్లి, చర్లపల్లి - విశాఖపట్నం, అనకాపల్లి - వికారా బాద్ మార్గాల్లో ప్రయాణిస్తాయి.విశాఖపట్నం - చర్లపల్లి స్పెషల్ రైళ్లువిశాఖపట్నం - చర్లపల్లి - విశాఖపట్నం)ఈ ప్రత్యేక రైళ్లు రెండు దిశలలో దువ్వాడ, అనకాపల్లి, సామర్ల కోట, అనపర్తి, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొం డ స్టేషన్లలో ఆగుతాయి.అనకాపల్లి - వికారాబాద్ స్పెషల్ రైలుట్రైన్ నంబర్: 07416 (అనకాపల్లి - వికారాబాద్)ఈ రైలు ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, రాయన పాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి స్టేషన్లలో ఆగుతుంది.బోగీల వివరాలు.....ఈ అన్ని ప్రత్యేక రైళ్లలో 2ఏసీ, 3ఏసీ, స్లీపర్. జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉంటాయి.రిజర్వేషన్ వివరాలుట్రైన్ నంబర్లు 08512 మరియు 07416కు సంబంధించిన టికెట్ బుకింగులు .... డిసెంబర్ 31, 2025 ఉదయం 8.00 గంటల నుంచి ప్రారంభ మవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సౌకర్యాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

# ఢిల్లీ గగనతలంపై 'సుదర్శన చక్రం'

## రూ.5,181 కోట్లతో స్వదేశీ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ కొనుగోలుకు కేంద్రం అనుమతి

## నో-ఫ్లై 'విఐపి-89' జోన్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

### శత్రుదుర్భేద్యంగా దేశ రాజధాని



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** పొరుగుదేశాల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీ భద్రతపై దృష్టి సారించింది. ఇజ్రాయెల్ తరహాలో గగనతల రక్షణ కోసం యాంటీడ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి మోడీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఢిల్లీ రక్షణకు 'సుదర్శన చక్ర' (గోల్డన్ డ్రోమ్) ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోడీ ఎర్రకోట ప్రసంగంలో వెల్లడించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఢిల్లీ- ఎన్‌సిఆర్‌లోని కీలకమైన నో-ఫ్లై జోన్ అయిని 'విఐపి-89 జోన్'పై వైమానిక భద్రతను బలోపేతం చేయడానికి రూ.5,181 కోట్ల విలువైన స్వదేశీ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఎఐడిడబ్ల్యుఎస్) కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిని "సుదర్శన్ చక్ర"లో భాగంగా మోహరించనున్నారు. ఇది దేశ రాజధాని చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇది కార్యరూపం దాలిస్తే, భారతదేశానికి పెట్టని కోటలా హిమాలయాలు ఉన్నట్లే, ఇకపై ఢిల్లీకి సుదర్శన చక్ర మారబోతుంది. దేశ రాజధాని ఢిల్లీ భద్రత ఇప్పుడు చాలా అభేద్యంగా ఉండబోతోంది. రాబోయే రోజుల్లో ఏ శత్రుదేశ డ్రోన్, క్షిపణి లేదా విమానం కూడా ఢిల్లీ గగనతలంలోకి ప్రవేశించే ఆలోచన చేయలేదు.

ప్రభుత్వ వర్గాల ప్రకారం... ఈ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ అనేది పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో తయారు అయ్యిందే. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, ఇప్పుడు ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని 'విఐపి-89 జోన్' మీదుగా 30 కిలోమీటర్ల పరిధిలో బహుళ పొరల రక్షణను అందిస్తుంది. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ఆయుధాల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో మోడీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఇకపై ఢిల్లీకి గస్తీగా ఏర్పాటు చేయనున్న ఈ కొత్త వ్యవస్థ తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను త్వరగా గుర్తించి, వాటిని గాలిలో నాశనం చేయగలదు. ఇది నెట్‌వర్క్ ఆధారిత వ్యవస్థ. రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం రూ.79వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోలుకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఢిల్లీలో పైలట్ ప్రాజెక్ట్‌గా దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. డ్రోన్లు, క్షి పణుల వంటి ముప్పులను ఎదుర్కోవడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. భారత సైనిక సామర్థ్యాలను పెంచే దిశగా ఈ చర్యలున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత తన భద్రత వ్యూహాన్ని సమీక్షి ంచింది. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ రాజధాని చుట్టూ 30 కి.మీ. పరిధిలోని గగనతలంలో ఎటువంటి ముప్పునైనా నిరోధించగలదని సదరు వర్గాలు తెలిపాయి. సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలను కొనుగోలుచేయడానికి రక్షణ శాఖ సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.

# రేవంత్‌రెడ్డి నాడు ఉద్యమద్రోహి, నేడు నీళ్లద్రోహి

## బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హారీశ్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. డిసెంబరు 30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమ సమయంలో ఉద్యమానికి ద్రోహం చేశాడని, ఇప్పుడు నీళ్ల విషయంలో రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాడని బిఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హారీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. బనకచర్లను వెనక్కి తీసుకుని నల్లమల సాగర్‌కు మారుతున్నట్లు ఏపీ ప్రకటించగానే అది తమ ప్రతాపమే అని ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి డబ్బా కొట్టుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బనకచర్ల అయినా.. నల్లమల సాగర్ అయినా జరిగేది తెలంగాణకు జల దోపిడే అని హారీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏపీ తన తెలివిని ప్రదర్శించిందని, కానీ మన సర్కారుకు ఆ సోయి లేకుండా పోయిందని విమర్శించారు. పోలవరం నుంచి నీటిని బనకచర్లలో కలపకుండా, పోలవరం-నల్లమల్ల సాగర్‌కు లింక్ చేయడంలో వాళ్ల ప్రయోజనాలు చూసుకున్నారని ఆరోపించారు.ఎందుకంటే.. గోదావరి నీళ్లను కృష్ణా ద్వారా తరలిస్తే.. బచావత్ అవార్డు ప్రకారం 45:21:14 నిష్పత్తిలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు కృష్ణాలో



నీటి వాటా ఇవ్వాల్సి ఉంటుందని, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఈ రూల్ వర్తిస్తుందని, నల్లమల సాగర్‌కు లింక్ చేస్తే ఎగువ రాష్ట్రాలకు వాటాలు ఇవ్వాల్సిన అవసరం తప్పుతుందని, అందుకే ఏపీ ఆ ఉపాయం చేసిందని చెప్పారు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పనిచేసి, తెలంగాణ నీటి ప్రాజెక్టులను అడుగడుగునా అడ్డుకున్న ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ నీటి సలహాదారుడిగా నియమించడం ద్వారా, నేడు బనకచర్ల కమిటీలోకి తీసుకోవడం ద్వారా రేవంత్‌రెడ్డి తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని ఆరోపించారు. రేవంత్ సర్కారు ఇప్పటికైనా పిచ్చి డ్రామాలు బంద్ పెట్టి, తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడాలని సూచించారు.అసెంబ్లీలో చిల్లర ప్రసంగాలు చేయడం కాకుండా, గోదావరి-బనకచర్లకు తాము వ్యతిరేకమని, కమిటీని వెనక్కి తీసుకుంటున్నామని తీర్మానం పెట్టాలని, ఆ తీర్మానం కాపీని ఢిల్లీకి పంపిద్దామని హారీశ్‌రావు సూచించారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి ఈ ప్రాజెక్టుకు అనుమతి ఎలా ఇచ్చారని ధర్నా చేద్దామని చెప్పారు.బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయాన్ని ముందుగానే పసిగట్టిన బీఆర్ఎస్ పార్టీ రణభేరి మోగించిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బల్లెంపెట్టి పొడిచినా రేవంత్ ప్రభుత్వం నిద్రలేవలేదని చెప్పారు. మేం ఎన్నో ప్రెస్‌మీట్‌లు పెట్టి హెచ్చరిస్తే గూడా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. తాను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టినా ఉత్తమ్ కుమార్ రెడ్డి బ్యాక్ డేట్‌ల లెటర్ రాస్తుంటడని ఎద్దేవా చేశారు.తాము బనకచర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నప్పుడే కేంద్ర ప్రభుత్వం.. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులకు మీటింగ్ పెట్టిందని గుర్తుచేశారు. ఆ మీటింగ్‌కు వెళ్లొద్దు, అన్యాయం జరుగుతది అని చెప్పినా రేవంత్‌రెడ్డి వినిపించుకోలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి గూడా పోను అని చెప్పిండని, లోపలలోపల ఏమైందోగానీ పోనుపోను అనుకుంటనే పొయ్యి మీటింగ్‌కు హాజరయ్యిండని విమర్శించారు.ఆ మీటింగ్‌ల ఎజెండా పత్రాలపై సంతకం పెట్టపెట్ట అనుకుంటనే సీఎం సంతకం కూడా పెట్టిండని ఆరోపించారు.కేంద్ర జలవనరుల శాఖ మీటింగ్‌లో గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ జరిగిందని, ఆ ప్రాజెక్టుపై ముందుకు పోవడానికి రెండు రాష్ట్రాలు కమిటీ వేసుకోవాలనే నిర్ణయం జరిగిందని చెప్పాడని వెల్లడించారు. దాంతో రేవంత్‌రెడ్డిది నల్లముఖం అయ్యిందని చెప్పారు.

నల్లమల సాగర్ అక్రమ నిర్మాణానికి సూత్రధారి చంద్రబాబు అయితే, పాత్రధారి రేవంత్ రెడ్డి అని చెప్పారు. కత్తి చంద్రబాబుదే అయినా పొడిచేది మాత్రం రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమం సమయంలో రేవంత్‌రెడ్డి 'ఎవడ్రా జై తెలంగాణ అంటుండు' అని తెలంగాణ ఉద్యమకారుల మీదనే తుపాకీ గురిపెట్టిండని హారీశ్‌రావు గుర్తుచేశారు. అసుంటి రేవంత్‌రెడ్డి ఇయ్యాల నేను ఉద్యమకారుడిని అని చెప్పుకుంటున్నడని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేసినప్పుడు సోనియాగాంధీని బలిదేవత అని తిట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు దేవత అని అంటున్నడని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీకి తనంతటి విధేయుడే లేడని మాట్లాడుతన్నడని అన్నారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపడితే.. ఆ ఉద్యోగులకు నియామక పత్రాలు పంచిన రేవంత్‌రెడ్డి తాను ఉద్యోగాలు ఇచ్చినట్టు చెప్పుకుంటున్నడని, ఆయన అంతటి ఘనుడు అని వ్యాఖ్యానించారు.

# ఐదు టి-20ల సిరీస్‌లో లంకను క్లీన్‌స్వీప్ చేసిన ఉమన్ ఇండియా

## 16 పరుగులకే పరిమితమైన శ్రీలంక

## ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హార్మన్‌ప్రీత్‌కౌర్

## ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా షెఫాలివర్మ

**తిరువనంతపురం, డిసెంబరు 30:** శ్రీలంకతో ఐదు టి20ల సిరీస్‌ను భారత మహిళాజట్టు క్లీన్‌స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ గెలు పొందిన టీమిండియా చివరి మ్యాచ్‌లోకూడా శ్రీలంకను చిత్తుగా ఓడించింది. 15 పరుగుల తేడాతో శ్రీలంక జట్టుపై విక్టరీ నమోదుచేసింది. మంగళవారం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68) విధ్వంసక ఆటతో చెలరేగి భారీ స్కోర్ అందించింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు పడినా అమన్‌జోత్ కౌర్(21), అరుంధతి రెడ్డి(27)లు రాణించారు. 176 పరు గులు ఛేదనలో హాసిని పెరేరా(65), ఇమేశా దులానీ(50)లు పోరాడినా తమ జట్టును గెలిపించ లేకపోయారు. ఐదుకు ఐదు మ్యాచుల్లో పర్యాటక జట్టును మట్టికరిపించిన హర్మన్‌ప్రీత్ సేన విశ్వ విజేతగా తొలి సిరీస్‌ను 5-0తో అందుకుంది. స్వదేశంలో వన్డే ప్రపంచ కప్ విజేతగా చరిత్ర సృష్టించిన భారత్ తొలి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. వరల్డ్ కప్ అందుకున్నాక ఇకపై విజయాన్ని, ట్రోఫీలను గెలవడం ఒక అలవాటుగా మార్చుకుంటాం అని చెప్పిన హర్మన్‌ప్రీత్ కౌర్ తొలి అడుగు ఘనంగా వేసింది. రెండేళ్ల క్రితం ఆసియా కప్ ఫైనల్లో ఓడించిన శ్రీలంకను వైట్‌వాష్ చేస్తూ పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఐదో టీ20లో ఓపెనర్ షఫాలీ వర్మ(5) విఫలమైనా హర్మన్‌ప్రీత్ కౌర్(68) ఖతర్నాక్ అర్ధ శతకంతో జట్టుకు కొండంత స్కోర్ అందించింది. అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి లంక గెలుపు ఆశలపై నీళ్లు చల్లారు. ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేయడం ఇది మూడోసారి.





2019లో వెస్టిండీస్‌ను, 2024లో బంగ్లాదేశ్‌ను ఐదుకు ఐదు మ్యాచుల్లో ఓడించింది భారత్. చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలనున్న శ్రీలంకకు భంగపాటే ఎదురైంది. భారీ ఛేదన ఆరంభంలోనే చమరి ఆటపట్టు(2)ను డైవింగ్ క్యాచ్‌తో ఔట్ చేసిన దీప్తి శర్మ లంకబ్యాటర్లకు షాకిచ్చింది.

హాసిని పెరేరా(65), ఇమేశా దులానీ(50) దూకుడుగా ఆడారు. ఇద్దరూ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోర్ బోర్డును నడిపించారు. ముఖ్యంగా దులానీ కళాత్మక షాట్లతో అలరిస్తూ టీ20ల్లో తొలి అర్ధ శతకం నమోదు చేసింది. రెండో వికెట్‌కు 79 రన్స్ జోడించిన దులానీని అమన్‌జోత్ వెనక్కి పంపింది. ఆ తర్వాత హాసిని అర్ధ శతకం పూర్తి చేసుకుంది. చరణి ఓవర్లో వరుసగా 4,6 బాదిన తను నాలుగో బంతికి బౌల్డయ్యింది. స్నేహ్ రానా ఓవర్లో నుత్యంగన రనౌట్ కాగా డేంజరస్ హర్షిత సమరవిక్రమ(8) బౌండరీ వద్ద డియోల్ క్యాచ్ పట్టగా వెనుదిరిగింది. ఇక అక్కడితో లంక ఓటమి ఖాయమైంది. చివరి ఓవర్లో 25 రన్స్ అవసరం కాగా లంక160కే పరిమితమైంది. పొట్టి సిరీస్ చివరి మ్యాచ్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68) విధ్వంసక ఆటతో చెలరేగింది. ఓపెనర్లు విఫలమైనా మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు పడిన వేళ క్రీజులోకి వచ్చిన హర్మన్‌ప్రీత్ భారీ షాట్లతో విరు చుకుపడింది. హ ర్లీన్ డియోల్, దీప్తి శర్మలు విఫలమైనా అమన్‌జోత్ కౌర్ (21)తో కలిసి స్కోర్ బోర్డును ఉరికిం చింది. ఆరో వికెట్‌కు 61 రన్స్ జోడించింది. ఆఖరి ఓవర్లో అరుంధతి రెడ్డి(27) మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదడంతో భారత్ 175 పరుగులు చేసింది. కాగా ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హర్మన్‌ప్రీత్‌కౌర్ ఎంపికయింది. ఇక ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా షెఫాలీ వర్మ నిలిచింది.

# ఆర్థికవృద్ధిలో జపాన్‌ను అధిగమించిన భారత్!

## 4.1 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరిక

### 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని రేటింగ్స్ అంచనాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఆర్థిక వ్యవస్థ వృద్ధితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా నిలిచింది. ప్రస్తుతం నాలుగోస్థానంలో ఉన్న జపాన్‌ను అధిగమించి 4.18 లక్షలకోట్ల డాలర్లకు చేరింది. 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని అంచనాలున్నాయి. శరవేగంగా అభివృద్ధిచెందుతున్నదేశంగా కొనసాగుతున్న భారత్ దేశీయంగా వినియోగం, నిర్మాణాత్మక సంస్కరణలతో మరింత వృద్ధి వేగవంతం అవుతోంది. భారత్ వాస్తవ జిడిపి 8.2శాతం రెండోత్రైమాసికంలో పెరిగింది. అంతకుముందు తొలిత్రైమాసికంలో 7.8శాతంకాగా గత ఏడాది నాలుగో త్రైమాసికంలో 7.4శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. 2030 నాటికి భారత్ 7.3 లక్షలకోట్ల డాలర్ల జిడిపితో ఉంటుందని అంచనా. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత్ వృద్ధి అవకాశాలపై సానుకూలంగా రేటింగ్ ఇచ్చాయి. ప్రపంచ బ్యాంకు 2026 లో 6.5శాతం ఉంటుందని,మూడీస్ రేటింగ్ అయితే 6.4శాతంగా ఉంటుందని 2027లో 6.5శాతం ఉంటుందని అంచనాలు వేసింది. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అయితే భారత్ అంచనాలు 2025లో 6.6శాతం, 2026లో 6.2శాతంగా ఉంటాయి.

# ఖలీదాజియా అంత్యక్రియలకు విదేశాంగమంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ తొలి మహిళాప్రధాని బిఎన్పీ ఛైర్‌పర్సన్ బేగమ్ ఖలీదాజియా అంత్యక్రియలకు భారత ప్రభుత్వం తరపున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరు అవుతున్నారు. బుధవారం ఢాకాలోని జియా ఉద్యాన్‌లో తన భర్త జియావుర్ రెహమాన్ సమాధిపక్కనే ఖలీదాను ఖననంచేయనున్నారు. ఈ కార్యక్రమానికి భారత్ తరపున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరు అవుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. విదేశాంగశాఖప్రకటన విడుదలచేసింది. అంతకుముందు ఖలీదా మృతిపట్ల భారత ప్రధాని నరేంద్రమోడీ సంతాపం వ్యక్తంచేసారు. 2015లో ఢాక పర్యటన వేళ ఆమెతో భేటీ అయిన అంశం గుర్తుచేసుకున్నారు.

# సర్పంచ్‌లపై గత సర్కారు ఒత్తిడిచేసి పనులు చేయించింది

## బిల్లులు చెల్లించకపోవడంతో వందలాది మందికి ఇబ్బందులు


## సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బిల్లులు విడుదలయ్యేలా కృషి

## సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్

**హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త:** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచులపై ఒత్తిడి చేసి గ్రామాలలో పనులు చేయించారని తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్ అన్నారు. ఒకొక్క సర్పంచు ఐదు లక్షల నుండి యాభై లక్షల వరకు పనులు చేయించారని తెలిపారు. బిల్లులు విడుదల చేయకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన నిరక్ష్యం కారణంగా అనేక మంది మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఈమేరకు మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన దాదాపు 200మందికిపైగా సర్పంచ్‌లను సన్మానించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎలా పనులు చేయించుకోవాలనే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా భూమన్న యాదవ్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌ల బిల్లుల అంశంపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి విడుదల అయ్యేలా కృషి చేస్తామని ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లతో కలిసి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆశాదీప్ రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్ తో పాటు కార్యవర్గాన్ని భూమన్న యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్య క్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ప్రతిఒక్క సర్పంచు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పంచాయతీ రాజ్ మంత్రి సితక్క సహకారంతో సర్పంచుల సమస్యల పరిష్కారం తోపాటు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**రాష్ట్ర నూతన కార్యవర్గం..**

అధ్యక్షుడు-కాయితి ఆశాదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కరణం కీర్తి రామకృష్ణ, ఉపాధ్యక్షులు శివగోని పెంటయ్య, కంజర్ల చంద్ర శేఖర్, జాదవ్ జమునా నాయక్, కార్యదర్శి-



నూతన కార్యవర్గంతో వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్నయాదవ్, అధ్యక్షులు ఆశాదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

లోపల్లి శ్రీనివాసరావు, చీర్ల అనూష భాస్కర్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా-తలానీ అవి నాష్, కల్లూరి హనుమంతు, అలాగే మహిళా అధ్యక్షురాలుగా మాధవిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని భూమన్నయాదవ్ నియామకపత్రం అందజేశారు.

# జెపి నడ్డాతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్. డిసెంబరు 30:** మంగళవారం సాయంత్రం ఢిల్లీలో బిజెపి జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డాతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలను రాబట్టిందని వివరించారు. దీనికి జాతీయ అధ్యక్షులు స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయ పార్టీగా



ఎదిగి అధికారంలోకి రావడం జరుగుతుందన్నారు. దానికోసం భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు సమిష్టిగా పని చేయాలని ప్రజలు ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గణనీయంగా సర్పంచులు వార్డ్ మెంబర్లు గెలవడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి కృషి చేసినందుకు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని ప్రజల్లోకి వెళ్లాలని ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని రాంచందర్‌రావుకు సూచించారు. బిఆర్‌ఎస్ కుటుంబ కలహాలు ప్రజల్లో నమ్మకం కోల్పోయింది అని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు రాష్ట్రంలో బిజెపి వైపు ప్రజలు చూస్తున్నారు. రాజకీయపరమైన పార్టీ సంస్థగత విషయాలపై చర్చించామని పేర్కొన్నారు.

# పవిత్ర 'వైకుంఠవాకిలి' దర్శనంతో పులకింత

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మముహూర్తంలోపెద్దసంఖ్యలో ప్రముఖులు పవిత్రమైన వైకుంఠవాకిలి దర్శనాలను చేసుకున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ఘడియలు అర్ధరాత్రి దాటిన తరువాత ఆరంభం కావడంతో మంగళవారం వేకువజామున 1.30గంటల నుండి ఉదయం 6.30గంటల వరకు ఏకధాటిగా దేవదేవుడ్ని వైకుంఠద్వారంలో దర్శనం చేసుకున్న ప్రముఖులు పులకించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పవిత్రత ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి ,సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ప్రముఖులంతా ఆకాంక్షించారు. ఆపదమొక్కులవాడి ఆశీస్సులతో తెలుగుప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఘడియల్లో మంగళవారం వేకువజామున ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచుకున్నాయి. విశేష పూజలు నిర్వహించిన అనంతరం రాజ్యాంగపరిధిలోని ప్రోటోకాల్ ప్రముఖులు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబంతో కలసి ఆలయంలోనికి ప్రవేశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రులు నిమ్మలరామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్యప్రసాద్, కొల్లురవీంద్ర,సవిత, ఎంఎల్‌సిలు పోచంపల్లి శ్రీనివాస్, కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్ దంపతులు, ఎంపిలు మిథున్‌రెడ్డి, డికె అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, మాజీ ఎంపి సంతోష్ వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ మార్గంలో ఆలయంలోనికి ప్రవేశించిన ప్రముఖులందరూ హారతి లేని లఘు దర్శనంలో వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా కొలువై భక్తులను కటాక్షిస్తున్నారు.


కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ,ఎపి మంత్రులు

వైకుంఠద్వారంలో వేంకటేశ్వరునిదర్శించుకుని ప్రముఖులంతా భక్తిపారవశ్యం చెందారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,పలుశాఖల అధికారులు చక్కగా దర్శనం ,వసతి సౌకర్యాలు కల్పించారని ప్రముఖులు అభినందించారు. వేకువజామున 1.30గంటలనుండి ఉదయం 6గంటల వరకు ఏకధాటిగా ఐదుగంటల పాటు రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ వర్గాలు చక్కటి సంతృప్తికర దర్శనం చేయించారు. ఉదయం ఆరుగంటలకు ఆన్‌లైన్‌లో టోకెన్లు పొందిన స్లాట్ భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ ఆలయంలోనికి చేరుకున్నారు. తొలిరోజు ప్రముఖులతో బాటు సామాన్యభక్తులు భక్తితో ప్రశాంతంగా వైకుంఠవాకిలి దర్శనం చేసుకోవడం విశేషం.

# తిరుమల సమాచారం

## వైకుంఠ ఏకాదశినాడు స్వర్ణరథమెక్కిన శేషాచలాధీశుడు

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న శేషాచలకొండల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం స్వర్ణమయమైన మహోన్నత రథం అధిరోహించి భక్తులను కటాక్షించాడు. శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులను విశేషాభరణాలంకృతుడ్ని చేసిన అర్చకులు బంగారురథంపై అధిరోహింపజేశారు. ఉదయం చక్కటి వాతా వరణంలో చల్లటిగాలులు వీస్తుండగా భగవంతుడు శైల్య,సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన స్వర్ణరథం ఎక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్ద జీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ మురళీకృష్ణ, బోర్డు మహిళ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## వైకుంఠాన్ని తలపిస్తున్న తిరుమలగిరులు

### - తిరుమల ఆలయం వెలుపల సినీనటుడు చిరంజీవి కుటుంబం

**తిరుమల, డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతి నిధి:** దేవలోకంలో వైకుంఠాన్ని తలపించేలా కలియుగక్షేత్రం తిరుమలను టిటిడి అధికారులు అద్భుతంగా ఫల, పుష్పఅలంకరణలు, విద్యుద్దీపకాంతులతో చక్కగా తీర్చిదిద్దారు. అన్నిటికంటే మించి తిరుమల ఆలయం సమీపంలో శ్రీరంగాన్ని తలపించేలా రంగనాధస్వామి ఆలయ సెట్టింగ్స్‌తో దర్శనం టోకెన్ లేని భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి మోక్షం పొందామని అనుభూతి కలుగుతోంది. ఆలయంలోపల, వెలుపల సువాసనల పుష్పాలతో బంగారువాకిలి, ఆనందనిలయం, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం,మహద్వారం ,గోపురం ప్రాంతాలను ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు.ఆలయంపైభాగాన మహద్వారం గేట్‌పైన వైకుంఠంలో శ్రీమహావిష్ణువు కొలువైనట్లు అద్భుతంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పలువురు సినీప్రముఖులు ప్రముఖ నటుడు చిరంజీవి కుటుంబసభ్యులు, సినీనటుడు రాజేంద్రప్రసాద్, సినీనటుడు బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర, నారారోహిత్,శివాజీ, శ్రీలీల,నటి హేమ, సినీనిర్మాతలు దానయ్య, బండ్ల గణేశ్, ఇండియన్‌క్రికెటర్ తిలక్‌వర్మ, సూర్యకుమార్‌యాదవ్, చాముండేశ్వరినాథ్, సామాన్యభక్తులు వెంకన్న దర్శనంతో బాటు వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకున్నారు. రాత్రి వరకు 55వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. రు.




శ్రీవారి వైకుంఠద్వార దర్శనంలో సినీ ప్రముఖులు

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీ సిఎం జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా .మంగళవారం వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తెలుగు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆ వైకుంఠవాసుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ.. తెలుగు ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు అంటూ తన ఎక్స్ ఖాతా ద్వారా జగన్ పోస్టు పెట్టారు.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియామకం



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతి నిధి:** చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఒంగోలులో జన్మించి, అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిన సీతారామాంజనేయ ప్రసాద్ చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలతో పెరిగారు. యువకుడిగా ఉన్నప్పుడే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా ఆయన సేవలందించారు. ఆ సమయంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాల జీర్ణోద్ధరణ చేపట్టడంతో పాటు, పలు ప్రాంతాల్లో కోటి దీపోత్సవం, దశ సహస్ర సువాసినీ పూజ వంటి విశిష్ట కార్యక్రమాలను నిర్వహించారు.

## అజ్ఞాతంలోకి వైసిపి నేత వల్లభనేని వంశీ



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతి నిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఈ అంశం తాజాగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొన్ని రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులోకి రాకుండా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. విజయవాడలోని మాచవరం పోలీసులు తనను ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం ఉందన్న అనుమానంతోనే ఆయన అందుబాటులోకి లేకుండా పోయినట్లు భావిస్తున్నారు. ఈ నెల 17న విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో వంశీని ప్రధాన నిందితుడిగా (ఏ1) పోలీసులు చేర్చారు. 2024 జూన్ 7న సునీల్ అనే వ్యక్తిపై దాడి చేయాలని తన అనుచరులను వంశీ రెచ్చగొట్టడంతో వారు కర్రలు, మారణాయుధాలతో తీవ్రంగా గాయపరిచారని నేరాభియోగం నమోదైంది. ఈ కేసులో వంశీతో పాటు యతీంద్ర రామకృష్ణ, కొమ్మా కోట్లు, ఓలుపల్లి రంగా, కాట్ర శేషు, ఎం.బాబు, మల్పూరి ప్రభుకాంత్, అనగాని రవి సహా పలువురు నిందితులుగా ఉన్నారు.

వారం రోజుల క్రితమే వంశీ నివాసానికి వెళ్లిన పోలీసులు సమన్లు ఇచ్చేందుకు ప్రయత్నించగా, ఆయన అక్కడ అందుబాటులో లేరు. ఈ క్రమంలోనే ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించినా,

న్యాయస్థానం నుంచి ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో ఆయన తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా సోమవారం విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో జరగాల్సిన సత్యవర్ధన్ కేసు విచారణకు కూడా వంశీ, ఆయన అనుచరుడు ఓలుపల్లి రంగా గైర్హాజరయ్యారు. ప్రస్తుతం వంశీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

- తెల్లవారుజామునుంచే భక్తులు బారులు
- ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాల నిర్వహణ

**విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక విశిష్టత వుందనీ, ఈ రోజున విష్ణుమూర్తి వైకుంఠ ద్వారాలు తెరుస్తారనీ, ఆయనను దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం, స్వర్గద్వార ఏకాదశి అని కూడా పిలిచే ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి.. తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కడప జిల్లాలోని ఆలయాలు తెల్లవారుజామున నుంచే భక్తులతో రద్దీగా మారాయి. కడపలోని తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య స్వామి ఆలయాలకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ పూజారులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం కోటలో వెలసిన సుప్రసిద్ధ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉరవకొండ శ్రీవెంకటేశ్వరస్వామి,



బెలుగుప్ప మండలం శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి, పామూరు మండలాల్లోని ఆలయాలు గోవిందా నామస్మరణతో మార్మోగాయి. విష్ణుమూర్తి ఉత్తర ద్వారం ద్వారా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, తిరువూరు శ్రీ కోదండ రామాలయం, జగ్గయ్యపేటలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి జనం పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# అంతర్ రాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్ట్

- రూ.75లక్షల బంగారు, వెండి నగలు స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

**కడప క్రైం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** కడప జిల్లాలో బస్సులు, బస్సు స్టాండ్లు మరియు ఆటోలలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని బ్యాగ్ లిఫ్టింగ్‌కు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో భారీగా దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశంలో తెలిపారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ముఠా సభ్యుల నుంచి రూ.75లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ముఠాపై 23 కేసులు ఛేధించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, నంద్యాల, తూగో, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ తదితర జిల్లాల్లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. పోషమ్మపై 15 కేసులు, ఆమె భర్త పోతురాజుపై 42 కేసులు, రావుల లక్ష్మీ అలియాస్ అంబటి సీత అలియాస్ పిచ్చిలక్ష్మిపై సుమారు 10 కేసులు ఉన్నాయన్నారు. వారితో పాటు కావేటి అరుణపై 1, పాల శ్రీకాంత్ అలియాస్ స్వామిపై ఒక కేసు ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న బ్యాగ్ లిఫ్టింగ్ ఘటనలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జమ్మలమడుగు డీఎస్పీ పర్యవేక్షణలో ఎర్రగుంట్ల పీఎస్‌లో సీఐ విశ్వనాథ్, ఎస్సై నాగ మురళీ, సిబ్బందిలు తమ సిబ్బందిలో నిఘా ఉంచి బ్యాగ్‌లిఫ్టింగ్ ముఠాను తమకు రాబడిన సమాచారంతో ముద్దనూరు-కడప మెయిన్ రోడ్డు, వలసపల్లె క్రాస్ వద్ద సోమవారం అరెస్టు చేయడం జరిగిందన్నారు. ముఠాను అరెస్టు చేయడంలో తమ సిబ్బంది చేసిన కృషిని ఎస్పీ అభినందించారు.




## జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ :మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అని మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలు చేసారు.మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారన్నారు.రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామన్నారు. లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.



# దివంగత ఎమ్మెల్యే మాగంటి సోదరుడిపై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 30, ప్రభాతవార్త:** దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సోదరుడు మాగంటి వజ్రనాథ్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని 550 చదరపు గజాల స్థల విక్రయానికి సంబంధించి మణికొండ చిత్రపురి కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ సుధాకర్‌బాబును దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోద రుడు మాగంటి వజ్రనాథ్ సంప్రదించారు. స్థలం విక్రయిస్తే రూ. 10 లక్షలు బ్రోకరేజీ ఇస్తానని మాగంటి వజ్రనాథ్ హామినిచ్చారు. దీంతో ఈ స్థలాన్ని డీఎస్ఆర్ డెవపలర్స్‌కు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మధ్యవర్తిత్వంతో సుధాకర్‌బాబు విక్రయించాడు. ఇందుకు సంబంధించి బ్రోకరేజీ లక్ష రూపాయలు చెల్లించిన వజ్రనాథ్ మిగిలిన మొత్తం చెల్లించకుండా కాలం గడుపుతున్నాడు. పలుమార్లు సంప్రదించగా వజ్రనాథ్ అశ్లీల పదజాలంతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఫోన్ నంబరును బ్లాక్ చేశాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 6న బంజారా హిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ ప్లాట్ నంబరు 80సి వద్ద కలిసిన వజ్రనాథ్‌ను బ్రోకరేజీ డబ్బుల గురించి అడుగగా తిరిగి దూషించాడు. ఈ వ్యవహారాన్ని సుధాకర్‌బాబు తన ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు సుధాకర్‌బాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మాగంటి వజ్రనాథ్‌పై సెక్షన్ 351(4), 352 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందజేసిన సిఎం

**విజయవాడ డిసెంబర్ 30,ప్రభాతవార్తప్రతినిధి :** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వర రావు కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.1 కోటి పరిహార చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం-స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య 2025 మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం అమలులో ఉన్న ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. ఒప్పందం తర్వాత ఈ పథకం ద్వారా పరిహారం అందజేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కల్పిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పునఃవ్యవస్థీకరించి, సమర్థంగా ముందుకు నడిపించినందుకు ముఖ్యమంత్రికి ఎక్సైజ్ అధికారులు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శాఖ అభివృద్ధికి సహకరించిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలను అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌బీఐ ఎస్ జి ఎస్ పి సాలరీ ఖాతా ద్వారా ఇలాంటి విలువైన బీమా ప్రయోజనాలు కల్పించడం అభినందనీయమని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు. ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక భద్రత కలగడం ఎంతో ఉపశమనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ అధికారుల సంఘం నాయకులు బి. నరసింహులు, కె. కామేశ్వర రావు, ప్రభాకర్ రావు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



## వైకుంఠ ఏకాదశి సందర్భంగా సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు


**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతి నిధి:** వైకుంఠ ఏకాదశ పవిత్ర దినాన్ని తెలుగు వారు భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పుణ్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. పవిత్రమైన ఈ పండుగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.ఏడాదిలో తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైె రోజులు. ఈ రోజులను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు పర్వదినాలుగా భావిస్తారు. ఇక తొలి ఏకాదశి ఆషాడ మాసంలో వస్తే.. వైకుంఠ ఏకాదశి పుష్యమాసంలో వస్తుంది.

ఈ వైకుంఠ ఏకాదశి రోజున మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో కలిసి భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని చెబుతారు.

## స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడండి

### రాష్ట్రన సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారుజ.రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ ల సమస్యలను శశి భూషణ్ కుమార్ కు తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు ప్రధానంగా ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ 15 వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం పైన తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కరెంటు బకాయిలు గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెత్త సేకరణ వాటికి ఖర్చు పెట్టాలని ఆదేశాలు ఇచ్చిన దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆందోళనలో ఉన్న విషయాన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు ఆదేశాలను సడలించాలని గతంలో మాదిరిగానే చేసిన పనులకు అంగన్వాడి భవనాలకు సీసీ రోడ్లకు, సైడ్ డ్రయిన్స్ కు విద్యుత్ పరికరాల కొనుగోలు రిపేర్లు, మోటార్ రిపేర్లకు వాడుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రాన్ని ఇచ్చారు. గత 25 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో సాధారణ నిధులు కూడా బిల్లులు పాస్ కాకుండా ఉన్న విషయాన్ని కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తో చర్చించారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లా డుతూ సాధారణ నిధులు బిల్లులు పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు వినతి పత్రాన్ని పరి శీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


శశిభూషణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జాస్తి

# బాధ్యతే అసలైన గౌరవం



ప్లాట్ఫామ్ పై నిలబడి రైలు కోసం జనంలో ఆమె ఒకరు. కానీ, తను రైలు ఎక్కడానికి కాదు. ఆ ట్రైన్ నుంచి దిగే ప్రయాణికుల కోసం. వాళ్లిచ్చే సామాన్లు మోస్తేనే ఆమె పిల్లల కడుపు నిండుతుంది. తనే సంధ్యా మారవి. భర్త మరణంతో పిల్లల భవిష్యత్తుకోసం రైల్వే కూలీగా మారారు. జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలీదు. 2016లో భర్త మరణం సంధ్య మారవిని కుదిపేసింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ముగ్గురు పిల్లలు. తను బాధ పడుతూ కూర్చుంటే వారి కడుపు నిండేదెలా అనుకున్నారామె. దాంతో కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకున్నారు. ఎప్పుడూ ఇంటి నుంచి బయటికి వెళ్లింది లేదు. పెద్దగా చదువు లేదు. ఏ పని చేయాలో తెలియలేదు. అలాగని ఎవరి దగ్గర చేయి చాచలేదు. కష్టాన్నే నమ్ముకున్నారు సంధ్య. కుటుంబాన్ని పోషించడానికి మగవాళ్లు మాత్రమే రైల్వే కూలీనే వృత్తిగా ఎంచుకోవచ్చు. జబల్పూర్ రైల్వే స్టేషన్లో బ్యాడ్జ్ నంబర్ 36, ఎరుపు చొక్కా ధరించి కూలీగా మారారామె. 400మంది పురుషుల మధ్యలో ఒక్కరే మహిళ. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతిసారీ సుమారు 45 కేజీల బరువుని భుజాలపై మోసుకెళ్లాలి. అయినా భయపడలేదు. మొదటిసారి నేను స్టేషన్లో పనిచేయడానికి నిలబడినప్పుడు అందరూ వింతగా చూశారు. మగవాళ్ళు మాత్రమే చేసే పని నీవల్ల అవుతుందా? ఇంత బరువు మోయగలవా అన్నట్లు చూశారు. వాళ్ల ముందే లగేజీని మోసి చూపించా. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా సంకల్పం బలంగా ఉంటే ఏది అసాధ్యం అంటారు సంధ్య. రోజూ కట్నీ నుంచి జబలూర్నకు 45కి.మీ రవాణా ప్రయాణికుల పిలుపుకోసం ఎదురు చూస్తుంటారామె.

**అమ్మ మేల్కొంటుంది.....** స్టేషన్లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లగానే ఆమెలోని కూలీ నిద్రపోయి అమ్మ మేల్కొంటుంది. పిల్లలకి అన్న తినిపించి, చదువు చెప్పి, నిద్రపుచ్చే వరకూ విశ్రాంతి తీసుకోరామె. 'భుజాన మోసేది ప్రయాణికుల బరువులు కాదు, నా ముగ్గురు పిల్లల భవిష్యత్తు' అంటారు సంధ్య. కష్టాలకు కుంగిపోకుండా నేను వాటిని గెలవగలను అని నిరూపించుకున్నారు. చేసే పని ఎలాంటిది అని ఆలోచించకుండా బాధ్యతే అసలైన గౌరవం అనుకున్న సంధ్య ఈ తరం మహిళలకి స్ఫూర్తిదాయకమే కదూ !

# పుస్తకంలో దాచేద్దాం !



నగలంటే ఏ అమ్మాయికైనా ఇష్టమే! చిన్నప్పుడు అమ్మ నగలను ఆశ్చర్యంగా చూడటాన్నైతే అస్సలు మర్చిపోలేం, అక్కడ నగ అందమేనా మనం మెచ్చేది? కాదు... ఓ పెట్టెలో పొందిగ్గా ఆభరణాలు అమర్చడమూ ఆకర్షించే విషయమే. అదీ వారసత్వంగా వస్తుందో ఏమో కానీ... మనదీ అదే బాట. ఓపికగా ఒక్కోటి చక్కగా అమరుస్తాం. ఇక్కడ బంగారం, గిట్టు అన్న తేడా అస్సలు చూపించం. అన్నీ ఒకచోట ఉంటాయి, పొడవ్వవు. వెతుక్కో కుండా త్వరగా తీసుకోవడానికి వీలుగా ఉంటాయనీ జ్యువెల్లరీ బాక్సులు వాడుతుంటాం. ఇంత శ్రద్ధ చూపే మనకి చిక్కులు ఎప్పుడొస్తాయి? ప్రయాణాల్లోనే కదూ! అట్టి పెట్టెలు పెట్టెలు విడివిడి వాటిల్లో సర్దుకుని తీసుకెళ్లలేం. స్థల వృథాతో పాటు చోరీ భయం. అలాగని తీసుకెళ్లకుండానూ ఉండలేం. మరెలా అంటే... ఈ జ్యువెల్లరీ స్టోరేజ్ బుక్స్ తెచ్చుకుంటే సరి. చూడటానికి పుస్తకంలానే ఉంటుంది. తెరిస్తే కానీ... అసలు గుట్టు బయటపడదు. అన్ని రకాల నగలూ పెట్టుకునేలా వీటిని తీర్చిదిద్దారు. వీటిలో మీకు కావాల్సిందే ఏంచుకుంటే సరి. చక్కగా చేతిలో పట్టుకుని వెళ్లినా పోతాయన్న భయం ఉండదు. బాగా ఉన్నాయి కదూ! కావాలనుకుంటే ఆన్లైన్లో వెతికేయండి మరి.

# తిరుప్పావై

## 16వ పాశురము



నాయకనాయ్ నిన్ఱ
నందగోపనుడైయ
కోయిల్ కాప్పానే! కొడిత్తోన్ఱుమ్
తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్
తాళ్ తిఱవాయ్,
ఆయర్ శిఱుమియరోముక్కు,
అఱైపఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే
వాయ్నేర్న్దాన్,
తాయోమాయ్ వన్దోమ్ తుయిలెళ
పాడువాన్,
వాయాల్ మున్న మున్నమ్
మాత్తాదే అమ్మ ! నీ,
నేశనిలైక్కదవమ్ నీక్కేలో
రెమ్బావాయ్

అది నందగోపాలుని భవనము, జెండాలతో ప్రకా శించుచున్నది. తోరణములతో అలంకరించబడి యున్నది. మణులతో పొదగబడిన తలుపులు గలది. లోనికేగుటకు గోపికలు, అక్కడ కావలియున్న భవనరక్షకుని అనుమతి కోరుతున్నారు."మాయావి, ఇంద్రనీలవర్ణుడగు సర్వేశ్వరుడు ఖపరఖి అను ధ్వనిచేయు వాయిద్యమును మాకు ఇస్తానని మాట ఇచ్చినాడు. ఏ ప్రతిఫలము ఆశించక పరిశుభ్రంగా వచ్చాము. నిద్రనుండి లేచునటుల పాడుటకు వచ్చినాము. నీవు ఏ అభ్యంతరము చెప్పక దృఢముగా నున్న తలుపులను తెరువుము. మమ్ముల లోపలికి వచ్చుటకు అనుమతినిమ్ము" అని గోపికలు ద్వారపాలకుని ప్రార్థిస్తున్నారు.

ఫలం : "ఆచార్యుని అనుగ్రహం లభిస్తుంది"

# టీ బానిసలేనా.. అయితే ఆపాల్సిందే

అలవాట్లు, ఇష్టాలు అన్నీ హద్దుల్లోనే ఉండాలి. లేదంటే అవి తెచ్చే సమస్యలు వర్ణనాతీతం. రోజూ ఉదయం మనల్ని పలకరించే చాడ్కి కూడా ఇది వర్తిస్తుంది. అసలే శీతకాలం... వేడివేడిగా టీ తాగితే వచ్చే ఉత్తేజం మాటల్లో చెప్పలేం. అందుకే నిద్ర లేచాక ఒక కప్పు టీతోనే మొదలవుతుంది మహిళల రోజు, ఇలా ఉదయం, సాయంత్రం, మహా అయితే అలసట ఎక్కువైనప్పుడో ఓ కప్పు టీ తాగితే పర్వాలేదు కానీ... కొందరు చాలాసార్లు తాగుతుంటారు. చుట్టాలు వచ్చారు. స్నేహితులకి కంపెనీ ఇవ్వాలి. తల నొప్పి వస్తోంది... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ చాంతాడంత ఉంటుంది. వీటన్నింటివల్ల శరీరంలో కెఫీన్ స్థాయులు ఎక్కువవుతున్నాయి. మానసిక సమస్యలు దీని పర్యవసానమే అంటున్నారు నిపుణులు. ప్రశాంతత, నిద్రను ప్రోత్సహించే అడెనోసిన్ గ్రాహకాలను అడ్డుకుంటుంది కెఫీన్. దాంతో నిద్రలేమి సమస్యలతో బాధపడు తుంటారు. హృదయ స్పందన రేటు మీద దీని ప్రభావం పడుతుందట. టీ తయారీలో వాడే పాలు, చక్కెర జీవక్రియా రేటుని దెబ్బతీస్తాయి. దాంతో ఆజీర్తి, ఉబ్బరం వంటి జీర్ణసంబంధిత సమస్యలూ పెరుగుతాయి. పైగా, ఇప్పటికే యాంగ్జయిటీతో బాధపడుతున్నవారు టీ ఎక్కువగా తాగడం వల్ల అందులోని కెఫిన్ నాడీ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. పర్యవసానంగా... మానసిక రుగ్మతలు ఇంకా పెరుగుతాయి. అందుకే రోజుకు 400మి.గ్రా.కి మించకూడదని నిపుణులు భావిస్తున్నారు. వయసును బట్టీ పూర్తిగా మార్పులు ఉంటాయట. గర్భిణులు యాంగ్జయిటీ సమస్యలున్న వారు అయితే 200మి.గ్రాకి మించకుండా చూసుకోవాలట.



# రుచులలో భారత్ 13వ స్థానం



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నెన్ని రుచులున్నా వాటిల్లో మనదేశ వంటలకు ఒక ప్రత్యేకత ఉంది. పాయసం నుంచి పరోటా వరకూ, బిర్యానీ నుంచి పావ్ భాజీ వరకూ దేనికైనా తినేదాకా.. నోరూరిస్తుంది. తినేశాక.. ఖిఇంతకంటే ఇంకేం కావాలి?!ఖి అనేంత సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తుంది. అందుకే మన వంటకాలు ప్రపంచవ్యాప్తంగా భళీ అనిపిస్తాయి. ఈ ఏడాది కూడా మన రుచులు ప్రశంసలు పొందాయి. టేస్ట్ ఆఫ్లాస్ 2025/26 ప్రపంచ 100 ఉత్తమ వంటకాల జాబితాలో వివిధ వంటకాలతో మనదేశం 13వ సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 100 ఉత్తమ ఆహార నగరాల్లో మనవి ఆరున్నాయి. మన ఘాటైన వంటలు ప్రపంచాన్ని ఆకట్టు కున్నాయి. ఇందులో ముంబై 5వ, హైదరాబాద్ 54వ స్థానాల్లో నిలిచాయి. భేల్పురి, పావ్ భాజీ, మోదక్, రగ్గా పట్టీస్, వడ పావ్లతో ముంబై, బిర్యానీ, పెసరట్టు, హలీమ్, చికెన్5, కరాచీ బిస్కెట్లతో హైదరాబాద్ తమదైన గుర్తింపు సాధించాయి. అమృత్సర్ 48, న్యూఢిల్లీ 53, కోల్కతా 73, చెన్నై 93 స్థానాల్లో నిలిచాయి. టేస్ట్ ఆఫ్ అట్లాస్ ర్యాంకింగ్స్లో ఇటలీ మొదటి స్థానంలో నిలిచింది.



# దగ్గుకు చిట్కా

ఈ కాలంలో జలుబుతోపాటు మనల్ని వేధించే వాటిల్లో దగ్గు కూడా ఉంటుంది. దీన్ని సహజంగా తగ్గించుకోవాలా? ఈ చిట్కా ప్రయత్నించండి. ఒక గిన్నెలో పావుకప్పు చొప్పున అల్లం, తమలపాకు రసాలు, తేనె తీసుకోండి. సన్నని సెగమీద ఈ గిన్నెని ఉంచి పాకంలా తయారయ్యేదాకా వేడి చేయండి. దాన్ని ఓ గాజు సీసాలోకి తీసుకోండి. అరచెంచా మిశ్రమాన్ని గోరువెచ్చని నీటితో తీసుకోండి. రోజుకి 2-3 సార్లు తీసుకుంటే త్వరగా తగ్గుతుంది.

## రంగవల్లి



25 చుక్కలు, 3 వరుసలు, ఇటు అటు వదిలి 3 వచ్చే వరకు



- మంజుల
తాడిపత్రి



## ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

తెర

# సితార ఎంటర్టైన్మెంట్స్ పై సిద్దు ఆరో చిత్రం



ముచ్చటగా మూడోసారి చేతులు కలిపిన సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్టైన్మెంట్స్ తన ప్రత్యేకమైన కథా ఎంపికలు, శక్తివంతమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, తన ఆరో చిత్రానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదలైన అద్భుతమైన పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్టైన్మెంట్స్ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. గతంలో వీరి కలయికలో వచ్చిన డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ విజయం సాధించాయి. ఇప్పుడు వారు హ్యాట్రిక్ కోసం సన్నద్ధమవుతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన ప్రత్యేకమైన కథన శైలితో గుర్తింపు పొంది, తెలుగు చిత్ర సీమలో ప్రతిభగల యువ దర్శకుల లో ఒకరి గా పేరు గాంచిన స్వరూప్ ఆర్ఎస్జే.. ఈ ప్రతిష్టాత్మక చిత్రం యొక్క కథ, కథనం మరియు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అద్భుతమైన కథాకథనా లతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నారు.

# 'రాజా సాబ్' ట్రైలర్ 2.0 రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్". ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ 2.ఓ రిలీజ్ చేశారు. ఎన్నో సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ ప్యాకేజ్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్ని "రాజా సాబ్" ప్రపంచంలోకి తీసుకెళ్లింది. "రాజా సాబ్" ట్రైలర్ 2.ఓ ఎలా ఉందో చూస్తే గంగమ్మ (జరీనా వాహబ్) ముద్దుల మనవడు రాజా సాబ్ (ప్రభాస్), అన్నీ మర్చిపోయే గంగమ్మ తన భర్త (సంజయ్ దత్)ను మర్చిపోలేక పోతుంది. ఓ మిస్టరీగా మారిన తాతను కలిసే సాహసా నికి రాజా సాబ్ సిద్ధమవుతాడు. అడుగు అడుగునా ప్రమాదాలు నిండి ఉన్న మయసభ లాంటి తాత భారీ హవేలీలో అడుగుపెడతాడు రాజాసాబ్. ఆ హవేలీలోకి వెళ్లిన వారిని ఎవరిని ఎలా వేటాడాలో డిజైన్ చేసి పెడతాడు తాత. హిప్నాటిజంతో పాటు దుష్ట శక్తులను శాసించగల తాత.. రాజాసాబ్, అతనితో వచ్చిన వారిని ఎలా ఇబ్బంది పెట్టాడు ? తాత సృష్టించిన ప్రమాదాల నుంచి రాజాసాబ్ ఎలా బయటపడ్డాడు ? తాను వెళ్లిన మిషన్ను రాజా సాబ్ కంప్లీట్ చేసుకున్నాడా? లేదా ?, దేవనగర సంస్థ జమీందారిణి గంగాదేవి, సాధారణ మధ్య తరగతి గంగమ్మగా ఎందుకు జీవిస్తోంది ?

# 'సైక్ సిద్దార్థ' డిఫరెంట్గా ప్రెజెంట్ చేశారు

- నిర్మాత డి. సురేశ్ బాబు



యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్తో వస్తు న్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్ స్టైల్ మ్యాడ్నెస్తో యూత్ఫుల్ ఎంటర్టైనర్గా రూపొందిన సైక్ సిద్ధార్థ లో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మోనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జనవరి 1న సైక్ సిద్ధార్థ గ్రాండ్గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు.నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమాలకి ముఖ్యంగా చిన్న సినిమాలకి ఆడియన్స్ థియేటర్స్ కి రావడం తగ్గిపోతుందని తరుచు మాట్లాడుతుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలని ఆడియన్స్ చాలా అద్భుతంగా థియేటర్స్లో ఆదరిస్తున్నారు.హీరో శ్రీ నందు మాట్లాడుతూ... అందరికి నమస్కారం. మీడియా మిత్రులకు ధన్యవాదాలు. దండోరా లో నా పర్ఫార్మెన్స్ కి చాలా మంచి అప్రిషియేషన్స్ ఇచ్చారు. ఈ సినిమా రిలీజ్కి ముందు అది నాకు మంచి బూస్ట్ ఇచ్చింది. డైరెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. థియేటర్స్ కి వచ్చి గట్టిగా కేకలు వేసి ఫుల్ గా ఎంజాయ్ చేసే తెలుగు ఆడియన్స్కి ఈ


# 'శంబాల' చూసి ఎంజాయ్ చేశాను

## అల్లు అరవింద్




ఆదికి వచ్చిన సక్సెస్ చూసి అందరూ సంతోషిస్తున్నారు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్లో మెగా డైరెక్టర్ బాబీ.. నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని మరోసారి నిరూపించారు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్లో సందీప్ కిషన్.. శంబాలని థియేటర్లోనే చూడండి.. కచ్చితంగా డిజప్పాయింట్ అవ్వరు.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్లో ఆది సాయి కుమార్.. ..ప్రతీ ఒక్కరూ మన ఆది హిట్టు కొట్టారు అని చెబుతుంటే ఆనందంగా ఉంది.. డివైన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్లో సాయి కుమార్.. ఆది సాయి కుమార్ హీరోగా నటించిన 'శంబాల' చిత్రం ప్రస్తుతం సక్సెస్ ఫుల్గా దూసుకుపోతోంది. ఈ కార్యక్రమానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ దర్శకులు వశిష్ట, బాబీ, యంగ్ హీరో సందీప్ కిషన్, ప్రముఖ రచయిత కోన వెంకట్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్లో.. ..అల్లు అరవింద్ మాట్లాడుతూ.. .. శంబాల సినిమాని యుగంధర్ ముని అద్భుతంగా తెరకెక్కించారు. సాయి కుమార్తో మాది మూడు తరాల అనుబంధం ఉంది. ..ఆది సాయి కుమార్ మాట్లాడుతూ.. 'శంబాల' సక్సెస్ మీట్కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అడిగిన వెంటనే వచ్చిన అల్లు అరవింద్ గారికి థాంక్స్. డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. ..సాయి కుమార్ గారి మంచితనం వల్లే ఇండస్ట్రీ అంతా ఇలా కదిలి వస్తోంది. కొడుకు సక్సెస్ అయితే తండ్రి ఎలా సంతోషిస్తారో నాకు తెలుసు. .డైరెక్టర్ వశిష్ట మాట్లాడుతూ.. .. సాయి కుమార్ ఈ ఏడాది ప్రారంభంలో హిట్టు కొట్టారు. ఆది ఏడాది చివర్లో హిట్ కొట్టారు.

# 'పెద్ది'లో జగపతిబాబు ఫస్ట్ లుక్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'పెద్ది' షూటింగ్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని గర్వంగా సమర్పిస్తున్నారు. భారీ బడ్జెట్తో, అద్భుతమైన నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'పెద్ది' ఒక అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించబోతోంది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. అప్పలసూరి పాత్రలో జగపతి బాబును పరిచయం చేస్తూ చిత్ర బృందం ఆయన ఫస్ట్లుక్ పోస్టర్ను విడుదల చేసింది. ఈ పోస్టర్లో జగపతి బాబు ఇంటెన్స్ అవతార్లో కనిపిస్తున్నారు. ఇది సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి పర్ఫెక్ట్ యాప్ట్. చెదిరిన సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు మును ఎన్నడూ చూడని అవతార్లో కనిపిస్తూ, తన రఫ్ లుక్కు మరింత వన్నె తెచ్చారు. దారంతో కట్టిన విరిగిన కళ్లద్దాలు ఆ పాత్ర యొక్క కఠినమైన వ్యక్తిత్వాన్ని, అప్పలసూరి పాత్ర డెప్త్ని ఇంటెన్స్గా ప్రజెంట్ చేశాయి. పెద్ది మార్చి 27, 2026న గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కానుంది. 2026లో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్లలో ఒకటిగా పెద్ది అలరించబోతోంది

# కొత్త నిర్మాణ సంస్థ 'బండ్ల గణేష్ బ్లాక్బస్టర్స్'



నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నిర్మాతగా మారిన బండ్ల గణేష్, మాస్ మహారాజా రవితేజ నటించిన 'అంజనేయులు' చిత్రంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాతోనే ఆయన తన సొంత బ్యానర్ పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్ను ప్రారంభించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సంచలన బ్లాక్బస్టర్ 'గబ్బర్ సింగ్' చిత్రంతో ఈ బ్యానర్కు మొదటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ లభించింది.ఇప్పుడు తన కొత్త నిర్మాణ సంస్థ బండ్ల గణేష్ బ్లాక్బస్టర్స్ (బీజీ బ్లాక్బస్టర్స్) ని అనౌన్స్ చేశారు. ఈ కొత్త అధ్యాయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చే విషయం ఏమిటంటే, ఇందులో నెక్స్ట్ జనరేష్ భాగస్వామ్యం కావడం.బీజీ బ్లాక్బస్టర్స్ బ్యానర్ ద్వారా మనసుకి దగ్గరగా ఉండే సినిమాలు, నిజాయితీతో కూడిన కథలు, కంటెంట్ రిచ్ చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బండ్ల గణేష్ ముందుకు సాగుతున్నారు. కొత్త ఆలోచనలు, వినూత్న కథనాలు, ఫ్రెష్ టాలెంట్కు అవకాశం ఇవ్వడమే ఈ బ్యానర్ ప్రధాన ఉద్దేశం.బండ్ల గణేష్, అతని టీం వరుసగా ఎక్సయిటింగ్ ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే ఒక ప్రాజెక్ట్ ఖరారైంది,



## వరల్డ్ బ్లిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో
# అర్జున్ చేతిలో కార్ల్‌సెన్ చిత్తు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ చేతిలో రాపిడ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ చిత్తుగా ఓటమి చెందాడు. ఖతర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో 13 రౌండ్ల తర్వాత దోహాలో మంచి ఫామ్‌ను కొనసాగించాడు. అతను 9వ రౌండ్‌లో ఛాంపియన్ కార్ల్‌సెన్‌ను కూడా మట్టికరిపించగా, ఇప్పుడు 10/13 పాయింట్లతో యుఎస్‌కు చెందిన ఫాబియానో కరువానా మరియు మాక్సిమ్ వాచియర్ లాగ్రేవ్ (ఎఫ్ఆర్ఎ) లతో సమంగా అగ్రస్థానంలో ఉన్నాడు. అర్జున్ అద్భుతంగా ప్రారంభించి మొదటి ఐదు వరుస గేమ్‌లను గెలుచుకున్నాడు. కానీ ఆ తర్వాత అతను రౌండ్ 6లో డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డెన్ వాన్ ఫారెస్ట్ చేతిలో తన తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. అతనికి ఎదురైన ఏకైక ఓటమి ఇదే, అయితే తర్వాత 7 ఆటలలో అర్జున్ అజేయంగా నిలిచాడు. 3 విజయాలు మరియు 4 డ్రాలతో రోజును మరో ఇద్దరు ఆటగాళ్లతో కలిసి అగ్రస్థానంలో ముగించాడు. ఇక మహిళల విభాగంలో టాప్ 30లో ఒక్క భారత్‌కు చెందినవారు కూడా లేరు. మహిళల విభాగంలో మొదటి రోజు మొదటి 10 ఆటల తర్వాత టాప్30లో ఎవరూ లేకపోవడంతో భారత్ చాలా పేలవంగా ఆడింది. రాపిడ్ విభాగంలో మూడు టాప్5 ఫినిషింగ్‌లను సాధించిన తర్వాత, భారత ఆటగాళ్ళు మొదటి రోజు బ్లిట్జ్ ప్రదర్శనతో నిరాశ చెందారు. ప్రస్తుతం మహిళల విభాగంలో అత్యుత్తమ ర్యాంక్‌లో ఉన్న భారత క్రీడాకారిణిల్లో దివ్య దేశ్‌ముఖ్ (34వ స్థానం), రక్షిత రవి (41), రాపిడ్ పతక విజేత కోనేరు హంపి 5 పాయింట్లు మాత్రమే గెలుచుకోని 61వ స్థానంలో ఉన్నారు.



## మహిళల షూటింగ్‌లో..
# నీరూ, ఆర్యవంశికి స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో (షాట్‌గన్) ఆసియా ఛాంపియన్‌షిప్ బంగారు పతక విజేత నీరు దండ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి మహిళల ట్రాప్ బంగారు పతకం సాధించింది. ఫైనల్లో నీరూ 41 హిట్స్ తో అగ్రస్థానంలో నిలిచింది. ఢిల్లీకి చెందిన కీర్తి గుప్తా 40 హిట్స్‌తో రజతం, ప్రగతి దూబే 32 హిట్స్‌తో కాంస్యాన్ని గెలుచుకుంది. జూనియర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో ఆర్యవంశ్ త్యాగి 42 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని, పంజాబ్‌కు చెందిన కేశవ్ చౌహాన్ 37 పాయింట్లతో రజతం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన జుహైర్ ఖాన్ 30 పాయింట్లతో కాంస్యం సాధించాడు. టీమ్ ఈవెంట్లలో, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో మధ్యప్రదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ప్రగతి దుబే, నీరు దండా మరియు మనీషా కీర్ మొత్తం 339 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అద్యా కత్యాల్, కీర్తి గుప్తా, భవ్య త్రిపాఠి 333 పాయింట్లతో ఢిల్లీ రజత పతకాన్ని గెలుచుకోగా, పంజాబ్ 319 పాయింట్లతో (రాజేశ్వరి కుమారి, పుఖ్రాజ్ కౌర్ చాహల్, క్రిషికా జోషి) కాంస్య పతకాన్ని గెలుచుకుంది.అలాగే అర్జున్, లక్ష్య అత్రీ, ప్రిక్షిత్ ఆర్య సౌజన్యంతో 336 స్కోరుతో జూనియర్ పురుషుల ట్రాప్ టీమ్ స్వర్ణాన్ని హర్యానా కైవసం చేసుకుంది. గుజరాత్ 327 (ఆర్యన్ సింగ్, భక్త్యార్ ఉద్దీన్ మహ్మద్ముజాహిద్, మానవరాజ్‌సింగ్ రాజేంద్రసింగ్ చుడాసమా) రజతంతో రెండో స్థానంలో, ఉదవ్ సింగ్ రాథోడ్, పృథ్వీరాజ్ సింగ్ రాథోడ్, వినయ్ ప్రతాప్ సింగ్ సి ద్వారా రాజస్థాన్ 326తో కాంస్యం సాధించింది. జూనియర్ మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో ఢిల్లీ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది, ఆద్య కత్యాల్, భవ్య త్రిపాఠి మరియు అనన్య యదువంశి కలిసి 323 పాయింట్లతో విజయం సాధించారు. తమిళనాడు 295 పాయింట్లతో రెండవ స్థానంలో నిలవగా, రాజస్థాన్ 274 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది.

## 2025 అన్ని ఫార్మాట్‌లలో..
# దుమ్మురేపిన హీరోస్
### టాప్ 5లో భారత్ యశస్వికి చోటు

**న్యూఢిల్లీ:** ప్రేక్షకులకు అత్యంత వినోదం అందిస్తున్న క్రికెట్‌లో వన్డే, టీ20, టెస్టు ఫార్మాట్లు మూడు ఉన్నాయి. ఈ మూడు ఫార్మాట్‌లలోనూ సత్తా చాటే ఆటగాళ్లు తగ్గిపోతున్నారు. ఈ ఏడాది 2025లో మరో 48 గంటల్లో ముగియనున్ననేపథ్యంలో అన్నీ ఫార్మాట్‌లలో సత్తాచాటిన ఆటగాళ్ల గూర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు ఫార్మాట్‌లలో సత్తా చాటేవారిలో ఐదుగురు క్రికెటర్లు ముందంజలో ఉన్నారు. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్‌కు సరిపోయే ఆటగాళ్లలో మన భారత్ నుంచి యశస్వి జైస్వాల్ చోటు దక్కించుకోగా, మార్కో యాన్సెన్, జేకబ్ డఫీ, కామెరాన్ గ్రీన్, హ్యారీ బ్రూక్ ఉన్నారు. భారత యువ కెరటం యశస్వి జైస్వాల్ అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్నాడు. రెండున్నరేళ్ల







కిందట భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన ముంబై పోరడు యశస్వి జైస్వాల్ ఫార్మాట్‌తో సంబంధం లేకుండా అదరగొడుతున్నాడు. టెస్టుల్లో సెంచరీలు, డబుల్ సెంచరీతో ఈ లెఫ్టాండర్ బ్యాటర్ ఓపెనర్‌గా రాణిస్తుండగా, వన్డే, టీ20లలో కూడా ఆడగల సత్తా ఉన్నాడు. 23 ఏళ్ల యశస్వి 28 టెస్టుల్లో ఏడు శతకాలు, రెండు డబుల్ సెంచరీలు బాదగా, 4 వన్డేల్లో 171, 23 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ వచ్చి జట్టుకు ఊపిరిలూదాడు. టెస్టు, వన్డే, టీ20లలో రాణిస్తున్న బ్రూక్ ఇంగ్లండ్ జట్టుకు మిడిలార్డర్ సమస్యను తీర్చాడు. 26 ఏళ్లకే బ్రూక్ ఆ దేశ జట్టుకు వన్డే, టీ20 జట్లకు కెప్టెన్ అయ్యాడు. ఇప్పటివరకు 34 టెస్టులు, 35 వన్డేలు, 52 టీ20లు ఆడిన బ్రూక్ అన్నీ ఫార్మాట్లలో అదరగొడుతున్నాడు. సౌతాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ ఆల్ ఫార్మాట్ స్టార్‌గా మారాడు. అత్యంత పొడవైన ఈ క్రికెటర్ మూడు ఫార్మాట్లలో దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక వేలానికి అమ్ముడుపోయిన ఆస్ట్రేలియా యువ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ అద్భుతంగా ఆడుతున్నాడు. 26 ఏళ్ల ఆల్‌రౌండర్ గ్రీన్ ఐపీఎల్‌లో రూ.25.20 కోట్ల వేలం పలికిన విషయం తెలిసిందే. 36 టెస్టులు, 31 వన్డేలు, 21 టీ20లు గ్రీన్ ఆడాడు. న్యూజిలాండ్‌కు చెందిన 31 ఏళ్ల జేకబ్ డఫీ అన్నీ ఫార్మాట్‌లలో సత్తా చాటుతున్నాడు. కుడిచేతి వాటం బౌలర్ ఇప్పటికీ 4 మ్యాచ్‌లు ఆడి 25 వికెట్లు తీయగా, 19 వన్డేలు, 38 టీ20 మ్యాచ్‌లు ఆకట్టుకున్నాడు.



## మహిళల టి20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో
# వరల్డ్ నం.1 దీప్తి

ఆట

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టి20 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో దీప్తి నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. ఇటీవలే వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో 87 పరుగులతో పాటు రెండు వికెట్లు తీసి భారత్‌కు కప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్ షఫాలీ టీ20 ఫార్మాట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు సత్తా చాటారు. ముఖ్యంగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న భారత క్రీడాకారిణుల ర్యాంకులు గణనీయంగా మెరుగుపడ్డాయి. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. శ్రీలంక సిరీస్‌లో ఇప్పటికే మూడు అర్ధసెంచరీలు సాధించిన షఫాలీ, తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 6వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం ఆమె నెంబర్ వన్ ర్యాంకులో ఉన్న బెత్ మూనీకి కేవలం 60 పాయింట్ల దూరంలో ఉంది. అలాగే వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ కూడా ఏడు స్థానాలు మెరుగుపరచుకుని 20వ స్థానంలో నిలిచింది. బౌలింగ్ విభాగంలో పేసర్ రేణుకా సింగ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి టాప్6లో చోటు దక్కించుకుంది. మూడో టీ20లో నాలుగు వికెట్లు తీసి ఆమె ఈ ఘనత సాధించింది. ఇక యువ బౌలర్లు శ్రీ చరణి 52వ స్థానానికి చేరుకోగా, అరంగేట్రం సిరీస్‌తోనే వైష్ణవి శర్మ ఏకంగా 390 స్థానాలు దాటి 124వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్ రౌండర్ల విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం భారత్ శ్రీలంకపై 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 40 ఆధిక్యంలో ఉంది.



## సౌతాఫ్రికా టి-20 లీగ్‌లో..
# సన్‌రైజర్స్ రెండో హ్యాట్రిక్
### క్యాపిటల్స్ 48 రన్స్‌తో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025-26లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ లీగ్‌లో భాగంగా ప్రిటోరియా క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపొందింది. ఈ విజయంతో సన్‌రైజర్స్‌కు అదనంగా ఒక బోనస్ పాయింట్ కూడా లభించింది. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఈస్టర్నన కేప్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ క్వింటన్ డికాక్ మరోసారి చెలరేగాడు. 47 బంతులు ఎదుర్కొన్న డికాక్ 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 పరుగులు చేశాడు. అతడితో పాటు, మాథ్యూ బ్రీట్జ్కే (33 బంతుల్లో 52 పరుగులు), జోర్డాన్ హెర్మాన్ (20 బంతుల్లో 37) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ప్రిటోరియా క్యాపిటల్స్ బౌలర్లలో టైమల్ మీల్స్ రెండు వికెట్లు పడగొట్టగా, లుంగి ఎంగిడీ, లుబ్బే తలా వికెట్ సాధించారు. అనంతరం 189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిటోరియా క్యాపిటల్స్ 18 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ ఆడమ్ మిల్నే 4 వికెట్లు పడగొట్టగా, రత్నాయకే రెండు, మార్కో జాన్సెన్, ముత్తుసామి తలా వికెట్ సాధించారు. ప్రిటోరియా ఇన్నింగ్స్‌లో షాయ్ హోప్ (36) టాప్ స్కోరర్‌గా నిలవగా, స్మిడ్ (35), రూథర్ ఫర్డ్ (25) ఫర్వాలేదనిపించారు. కాగా ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా భారత్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యవహరిస్తున్నాడు.

# ముక్కోటి రోజున సెన్సెక్స్, నిఫ్టీలు వెనక్కి
### స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌లదీ అదే దారి

**ముంబయి, డిసెంబరు 30:** ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్,నిఫ్టీలు దిగువ స్థాయిలోనే ట్రేడింగ్ ముగించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపించడంతో షేర్లపై ఒత్తిడిపెరిగింది. దీనితో మార్కెట్లు దిగువ స్థాయికే దిగజారాయి. దీనికితోడు దేశీయంగా కూడా సంవత్సరాంతపు హాలిడే మూడ్ కనిపించింది. ఇన్వెస్టర్లు కార్పొరేట్ ఫలితాల సీజన్ వస్తుండటంతో కొంత ఆచితూచి పెట్టుబడులు పెట్టారు. నిఫ్టీ 25,950 మార్కు దిగువన ముగిసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 20.46 పాయింట్లు క్షీణించి 84,675.08 పాయింట్లవద్దట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 3.25 పాయింట్లు క్షీణించి 25,938.85 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.05శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా ప్రతికూలంగానే కనిపించింది. బిఎస్ఇలో 1936 కంపెనీలు పెరిగితే 2252 కంపెనీలు క్షీణించాయి. మొత్తంగా 171 కంపెనీలు షేర్లు మాత్రం స్థిరంగానే కనిపించాయి. కొత్త లిస్టింగ్‌లలో గుజరాత్ కిడ్నీసూపర్‌స్పెషాలిటీ ప్రస్తుతం 9.37శాతం డిస్కౌంట్‌కు 103.35 వద్ద కొనుగోళ్లుజరిగాయి. ఇక నిఫ్టీలో మెటల్‌సూచీ ఒక్కసారిగా జంప్‌చేసింది. 203శాతంపెరిగింది హిందూస్థాన్ కాపర్9.42, జిందాల్ స్టెయిన్‌లెస్ 6.52శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 5.18శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 5.15శాతం, ఎన్ఎండిసి 3.22శాతం, జిందాల్ స్టీల్ 3.14శాతం,హిందాల్కో ఇండస్ట్రీస్ 2.22 శాతం,వేదాంత 2.11శాతం, టాటాస్టీల్ 2.04శాతం, జెఎస్‌డబ్ల్యుస్టీల్ 1.75శాతంచొప్పున పెరిగాయి. ఓరియంట్ టెక్నాలజీస్ 20శాతం ఎగువ సర్క్యూట్‌కు వెళ్లింది. బిల్ 0.04శాతం పెరిగింది. కంపెనీ 569 కోట్ల అదనపు ఆర్డర్లు రాబట్టింది. ఫ్రైమ్ ఫోకస్ 2.07శాతం పెరిగింది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 1.39 శాతం క్షీణించింది. గుజరాత్ నర్మదా వ్యాలీ ఫర్టిలైజర్స్ 1.82శాతం వారీ ఎనర్జీస్ 0.12శాతం క్షీణించాయి. లెమన్‌ట్రీ హోటల్స్ 0.87 శాతం పెరిగింది. నీరజ్ సిమెంట్‌స్ట్రక్చర్స్ 1.22శాతం పెరిగి 34.86 వద్ద ట్రేడ్ అయింది.ఫార్మాలో 0.07 శాతంతో లూపిన్‌షేర్లు ట్రేడ్ అయ్యాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లోనే ముగిస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా కనిపించాయి.వాల్‌స్ట్రీట్ మొత్తం కృత్రిమ మేధ భయాలతోనే ఊగిసలాడింది. రాత్రికి రాత్రే అమెరికాలో స్టాక్స్ క్షీణించాయి. ప్రత్యేకించి టెక్నాలజీరంగంలో భారీ పతనం చవిచూసాయి. ఎస్అండ్‌పి 500 0.35శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.50 శాతం, డౌజోన్స్ పారిశ్రామిక సగటు 249.04 పాయింట్లు చొప్పున క్షీణించాయి. ఇదిలా ఉంటే ఒక్కసారిగాపెరిగిన వెండి ఆరుశాతం క్షీణించింది. ఔన్స్ 80 డాలర్లకు పెరిగిన తర్వాత అనూహ్యంగా దిగి వచ్చింది.



వాణిజ్యం

# కృత్రిమ మేధ మిషన్‌కు రూ.10,300 కోట్లు

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** భారత్ కృత్రిమ మేధ మిషన్‌కు కేంద్రం రూ.10,300కోట్లు కేటా యించింది. ఐదేళ్లపాటు ఈనిధులు ఎఐని మరింత వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు వినియో గిస్తుంది. భారత్ రానురాను కృత్రిమమేధ వినియోగం, అమలులో గ్లోబల్ లీడర్‌గా మారుతున్నది. ఇందుకోసమే కేంద్రం ఇండియా ఎఐ మిషన్ ఏర్పాటుచేసింది. 38వేలకుపైగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు పర్యవేక్షిస్తున్న మిషన్ స్టార్టప్‌లు, పరిశోధకులకు అందుబాటులో కంప్యూటింగ్ వనరులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. భారత్‌లో కృత్రిమ మేధ, భారత్‌కోసం కృత్రిమ మేధగా రూపాంతరం చేయాలన్నదే లక్ష్యమని ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియా ఎఐ డివిజన్ ప్రకటించింది. అత్యున్నతస్థాయి ఎఐ కంప్యూటింగ్ మౌలికవనరులు ఏర్పాటు చేయడంతోపాటు జిపియుల పర్యవేక్షణ, పరిశోధకులు, స్టార్టప్‌లకు రాయితీతో కూడిన ధరలతో అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం. ఇక ఇండియా ఎఐ ఇన్నొవేషన్ కేంద్రం స్వదేశీ ఎఐ మోడళ్లను కీలకరంగాలయిన హెల్త్‌కేర్, వ్యవసాయ రంగాల్లో అమలుచేస్తోంది. డేటాసెట్స్ ప్లాట్‌ఫామ్ ఎఐ




ఖోష్ పరిధిలో ఎఐ మోడళ్లలోశిక్షణకు ఉన్నత ప్రమాణాలను అనుసరిం చడం, సామాజిక ఆర్థిక సవాళ్లను అధిగమిం చేందుకుగాను కొత్తకొత్త ఎఐ పరిష్కారాలు అన్వే షించడం ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు అవసరమైన రీతిలో ఎఐని అందుబాటులోకి తీసుకు రావడం ప్రధాన బాధ్యతలుగా ఇండియా ఎఐ మిషన్‌చూస్తోంది. ఇక విద్యాబోధనలో కూడా ఎఐని తప్పనిసరి చేసేవిధంగా ఇండియా ఎఐ భవిష్యత్తు నైపుణ్య సామర్ధ్యం పెంచుతోంది. అలాగే డీప్‌టెక్ ఎఐ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించడం కూడా చేస్తుంది. పూర్తి రక్షణా త్మకంగాను, భద్రతాపూర్వకమైన కృత్రిమమేధ టెక్నాలజీని అందించే లక్ష్యంతోనే కేంద్రం ఈ నిధులను కేటాయించినట్లు ఎంఇఐటివై చెపుతోంది.

# బ్యాంకింగ్ రంగంలో తగ్గుతున్న ఎటిఎంలు

**ముంబయి, డిసెంబరు 30:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం భారీగా పెరగడంతో ఏటీఎంల వాడకం క్రమంగా తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ నివేదికలో వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు పెరగడం, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపుతుండటంతో బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2024 మార్చి నాటికి 2,53,417గా ఉన్న ఏటీఎంల సంఖ్య 2025 మార్చి 31 నాటికి 2,51,057కు పడిపోయింది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను భారీగా కుదించుకున్నాయి. గత ఏడాది 79,884గా ఉన్న ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలు, ఈ ఏడాది 77,117కు తగ్గాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఈ సంఖ్య 1,34,694 నుంచి 1,33,544కు స్వల్పంగా తగ్గింది. ఆఫ్ సైట్ ఏటీఎంల మూసివేత ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. బ్యాంకేతర సంస్థలు నిర్వహించే వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య మాత్రం 34,602 నుంచి 36,216కు పెరగడం విశేషం. ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఏటీఎంలు తగ్గుతున్నప్పటికీ, బ్యాంక్ బ్రాంచుల సంఖ్య



మాత్రం పెరుగుతూనే ఉంది. 2025 మార్చి నాటికి దేశంలో బ్యాంక్ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరింది. కొత్త బ్రాంచుల ఏర్పాటులో ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే దూకుడుగా ఉన్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.


# జిడిపిని దాటేసిన భారతీయ కుటుంబాల్లోని పసిడి నిల్వలు
### జిడిపి 4.1లక్షలకోట్ల డాలర్లు ఉంటే, బంగారం నిల్వల విలువ ఐదు లక్షలకోట్ల డాలర్లు

**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** భారతీయుల కుటుంబాల్లో ఉన్న బంగారం దేశ ప్రస్తుత జిడిపి విలువలకు మించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం మొత్తం విలువ మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరిమాణాన్ని మించిపోయింది. అంత ర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లు దాటడంతో ఈ పరిస్థితి నెలకొంది. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం భారతీయ ఇళ్లలో దాదాపు 34,600 టన్నుల బంగారం నిల్వ ఉంది. మార్కెట్ ధరల ప్రకారం లెక్కిస్తే భారతీయుల వద్ద ఉన్న ఈ బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల కంటే ఎక్కువ. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం భారత జీడీపీ సుమారు 4.1 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. అంటే దేశం మొత్తం ఉత్పత్తి చేసే ఆదాయం కంటే ప్రజల ఇళ్లలో ఉన్న పసిడి విలువే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ అంశంపై ఇన్ఫోమెరిక్స్ వాల్యుయేషన్ అండ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ డాక్టర్ మనోరంజన్ శర్మ మాట్లాడుతూ జీడీపీ అనేది ఒక ప్రవాహం లాంటిది, బంగారం అనేది నిల్వ ఉండే ఆస్తి. ఈ రెండింటిని నేరుగా పోల్చలేం. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో బంగారానికి ఉన్న సామాజిక, ఆర్థిక, మానసిక ప్రాధాన్యతను ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు. బంగారం విలువ పెరగడం వల్ల గృహాల బ్యాలెన్స్ షీట్లు బలపడతాయని మోర్గాన్ స్టాన్లీ వంటి సంస్థలు చెబుతున్నప్పటికీ, భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎమ్కే గ్లోబల్ విశ్లేషణ ప్రకారం ఇళ్లలో ఉండే బంగారంలో దాదాపు 75 నుంచి 80 శాతం ఆభరణాల రూపంలోనే ఉంటుంది. భారతీయులు దీన్ని పొదుపుగా భావిస్తారు తప్ప, విక్రయించి సొమ్ము చేసుకునే ఆస్తిగా చూడరు. అందుకే ధరలు పెరిగినా వినియోగంపై పెద్దగా ప్రభావం ఉండదని నిపుణులు అంటున్నారు. కేవలం ప్రజలే కాదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా తన బంగారం నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఇప్పటివరకు ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతో మొత్తం నిల్వలు 880 టన్నులకు చేరాయి. యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం సురక్షితమైన పెట్టుబడి కావడంతో కేంద్ర బ్యాంకులు కూడా దీని వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే ఆర్థిక పరంగా చూస్తే బంగారం ఒక ఉత్పాదకత లేని ఆస్తి అని, ప్రజలు ఈటీఎఫ్ వంటి బాండ్ల వైపు మళ్లాలని నిపుణులు సూచిస్తున్నా, భౌతిక బంగారంపై మోజు మాత్రం తగ్గడం లేదు.



# రూ.32వేల కోట్ల బాండ్ల విక్రయానికి కేంద్రం సిద్ధం

**ముంబయి,డిసెంబరు 30:** దేశీయ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు రూ.32,000కోట్ల విలువైన ప్రభుత్వసెక్యూరిటీలను విక్రయించనున్నట్లు కేంద్రంప్రకటించింది. 6.48శాతం ప్రభుత్వ సెక్యూరిటీ 2035 రీఇష్యూ కింద ఈ విక్రయాలు జరుగుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ముంబై కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి2న ఈ వేలంజరగనుంది.మల్టిపుల్ ప్రైస్ విధానంలో ఈ వేలాన్ని నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీపై మరో రూ.2,000కోట్ల వరకు అదనపు సబ్‌స్క్రిప్షన్‌ను నిలుపుకునే వెసులు బాటు ప్రభుత్వానికి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఈ వేలంలో పాల్గొనేవారు ఆర్బీఐ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈకుబేర్) ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో బిడ్లను దాఖలు చేయాలి. నాన్‌కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:00 గంటల మధ్య, కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:30గంటల మధ్య సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన వ్యక్తులు, సంస్థల కోసం మొత్తం నోటిఫైడ్ మొత్తంలో 5శాతం నాన్‌కాంపిటీటివ్ బిడ్డింగ్‌కింద కేటాయించారు. సాధారణంగా ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లోటును భర్తీ చేసుకోవడానికి, మౌలిక సదుపాయాలు, సంక్షేమపథకాల వంటి ప్రజా ఖర్చులకునిధులు సమీకరించడానికే ఇలా బాండ్లను విక్రయిస్తాయి. వేలం ఫలితాలను జనవరి 2న ప్రకటిస్తారు. విజయవంతమైన బిడ్డర్లు జనవరి5న చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ హామీ ఉండటం తో ఈబాండ్లను సురక్షితమైన, తక్కువ రిస్క్ ఉన్నగా పరిగణిస్తారు.




# ప్యూరిఫయర్లపై ఇక 5% మాత్రమే జిఎస్టీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** జిఎస్టీ మండలి సమావేశంలో ఈసారి వస్తుసేవల పన్ను మరోసారి సవరణలు తెస్తోంది. వాటర్ ప్యూరిఫయర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లపై ఉన్న జిఎస్టీ 18శాతాన్ని ఐదుశాతానికి తీసుకువచ్చేందుకు నిర్ణయించిందని సమాచారం. దేశరాజధాని ఢిల్లీలోనుపరిసర రాష్ట్రాల్లోనే కాకుండా పర్యావరణ కాలుష్యం, జలకాలుష్యం ఎక్కువ కనిపిస్తుండటంతో జిఎస్టీని ప్రస్తుతం ఉన్న 18శాతం నుంచి ఐదుశాతానికి తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీహైకోర్టు, సుప్రీం కోర్టులు సైతం ఎయిర్‌ప్యూరిఫయర్లపై పన్నులు తగ్గించాలని కూడా సూచించింది. ఈ పరికరాలు మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి కాలుష్యానికి గురికాకుండా చూడాలన్న లక్ష్యంతోనే జిఎస్టీని కుదిస్తున్నట్లు కేంద్రం చెపుతోంది. అలాగే సురక్షిత మంచినీరు లభించడం కూడా ఇపుడు దేశంలో అందని ద్రాక్షగా ఉంది. ప్రత్యేకించి ఈశాన్య ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు లభించకపోవడం ఆపై వాటర్ ప్యూరిఫయర్లపైనా అధికపనులతో అందుబాటులోకి రాకపోవడంతోకేంద్రం దృష్టిసారించింది. అందువల్లనే ఇపుడు జలశుద్ధిసామగ్రి, వాయు శుద్ధిపరికరాలపై జిఎస్టీని 5శాతానికి తీసుకురావాలని నిర్ణయించింది. వచ్చే జిఎస్టీ సమావేశంలోనే ఈనిర్ణయం ప్రకటిస్తారని తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.